RNI TELTEL/2024/89620

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

Gk MEDIA

పచురణ : హైదరాబాద్, రంగారెడ్డి, సంపుటి 02, సంచిక 261, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -12, శుక్రవారం - 26 - డిసెంబర్ - 2025 , వెల రూ.5/-

### ఎయిర్ ప్యూరిఫయర్లపై 18 శాతం జీఎస్టీ..
## కేంద్రంపై ఢిల్లీ హైకోర్టు సీరియస్




వాయు కాలుష్యం నియంత్రించలేరు.. ఎయిర్ ప్యూరిఫయర్లపై జీఎస్టీ కూడా తగ్గించలేరా?

అడ్వకేట్ దాఖలు చేసిన పిల్ విచారణలో హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

## త్వరలో 'భారత్ ట్యాక్సీ'.. లాభాలన్నీ డ్రైవర్లకే!



త్వరలో 'భారత్ ట్యాక్సీ' సేవలు ప్రారంభిస్తామన్న అమిత్ షా

లాభాలన్నీ పూర్తిగా డ్రైవర్లకే పంచుతామని వెల్లడి

హర్యానాలో సహకార సమ్మేళనంలో అమిత్ షా ప్రకటన

### రేవంత్ రెడ్డి భాషపై హరీశ్ రావు వ్యాఖ్యలు..
## స్పందించిన ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి



రాజకీయాల్లో తిట్ల పురాణాన్ని ప్రారంభించిందే కేసీఆర్ అన్న చామల

ముఖ్యమంత్రిని ఉద్దేశించి కేసీఆర్ 'తోలు తీస్తా' అంటే ఊరుకునేది లేదని హెచ్చరిక

కేసీఆర్ పద్ధతిగా మాట్లాడితే రేవంత్ రెడ్డి అంతే పద్ధతిగా సమాధానం చెబుతారని వ్యాఖ్య

# అప్పటి వరకు రైతు భరోసా నిధుల పంపిణీ ఉండదు

- యాసంగి పంట భూములను ఉపగ్రహ చిత్రాల ద్వారా గుర్తిస్తామన్న తుమ్మల
- వాస్తవంగా సాగు చేస్తున్న భూములను గుర్తించి రైతులకు న్యాయం చేస్తామని వెల్లడి
- సాగు భూములను గుర్తించేంత వరకు నిధుల పంపిణీ ఉండదని స్పష్టీకరణ



హైదరాబాద్: రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో సాగవుతున్న పంట భూములను ఉపగ్రహ చిత్రాల ద్వారా ఖచ్చితంగా గుర్తించి, దాని ఆధారంగా రైతు భరోసా పథకం అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

# కేసీఆర్‌పై రేవంత్ భాష కరెక్ట్ కాదు

- తెలంగాణలో రాజకీయం మరోసారి వేడెక్కింది
- కేసీఆర్‌పై రేవంత్ మాట్లాడిని భాష సరికాదని వ్యాఖ్యలు చేశారు
- సీఎం రేవంత్ తన భాషపై పునరాలోచన చేయాలి
- కృష్ణా జలాల గురించి మాట్లాడే హక్కు కేసీఆర్‌కు లేదు
- డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం
- ప్రధాన మంత్రి ఆవాస యోజన కింద ఎన్ని ఇళ్లు ఇచ్చారు? రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలి



హైదరాబాద్: తెలంగాణలో రాజకీయం మరోసారి వేడెక్కింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేసీఆర్‌పై తీవ్ర వ్యాఖ్యల చేయడాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ తప్పుబట్టారు. కేసీఆర్‌పై రేవంత్ మాట్లాడిని భాష సరికాదని వ్యాఖ్యలు చేశారు. దీంతో, బండి సంజయ్ వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. కేంద్రమంత్రి బండి సంజయ్ తాజాగా మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడుతూ..'మనం మాట్లాడే భాష ఎదుటి వ్యక్తులను కించపరిచే విధంగా ఉండకూడదు. రేవంత్ రెడ్డి.. కేసీఆర్‌పై మాట్లాడిన భాష సరికాదు. సీఎం రేవంత్ తన భాషపై పునరాలోచన చేయాలి. రేవంత్ భాషతో ఆయనకే నష్టం జరుగుతుంది. ప్రతీ వ్యక్తి సుఖ సంతోషాలతో ఉండాలని హిందూ ధర్మం కోరుకుంటుంది అని చెప్పుకొచ్చారు.

ఇదే సమయంలో కృష్ణా జలాలపై స్పందిస్తూ..'కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకే ఒప్పందం చేసుకున్నది కేసీఆర్. ఆ విషయాన్ని బయట పెట్టింది నేను. ముడుపుల కోసం కేసీఆర్ 575 టీఎంసీలు కావాలని అడగలేదు. కృష్ణా జలాల గురించి మాట్లాడే హక్కు కేసీఆర్‌కు లేదు. కాళేశ్వరం దృష్టి మళ్లించడానికి కృష్ణా జలాలు అంశం కేసీఆర్ లేవనెత్తుతున్నారు. తెలంగాణకు కేసీఆర్ ద్రోహి. ఇందుకే కేసీఆర్‌ను ప్రజలు ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం. గ్రామ పంచాయతీలకు 5 లక్షల రూపాయలు ఏం సరిపోతాయి.

# మంటల్లో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. ప్రయాణికుల సజీవ దహనం

ఢిల్లీ: కర్ణాటకలో ఘోర బస్సు ప్రమాదంపై దాదాపుగా ఓ స్పష్టత వచ్చింది. రాంగ్‌రూట్‌లో వచ్చిన కంటెయినర్ లారీ ఢీ కొట్టడం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఈ దుర్ఘటనలో 17 మంది మరణించగా.. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 30 మంది ప్రయాణికులతో( డ్రైవర్, క్లీనర్‌తో కలిపి 31 మంది అని) కూడిన బస్సు బుధవారం అర్ధరాత్రి దాటాక బెంగళూరు నుంచి గోకర్ణ వెళ్తుండగా..






## తెలంగాణను వణికిస్తున్న చలి.. సింగిల్ డిజిట్‌కు పడిపోయిన ఉష్ణోగ్రతలు

తెలంగాణను వణికిస్తున్న తీవ్రమైన చలి

## డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడితే.. వాహనం సీజ్, రూ. 10 వేల ఫైన్, జైలు శిక్ష..



న్యూ ఇయర్ సందర్భంగా మందుబాబులకు సజ్జనార్ హెచ్చరిక

పార్టీలకు వెళ్లే వాళ్లు డ్రైవర్లను వెంట తీసుకురావాలని సూచన

సామాన్యులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించవద్దని వార్నింగ్

## ఏపీ హైకోర్టులో టీటీడీకి భారీ ఊరట



స్వర హోటల్‌కు భూ కేటాయింపుపై హైకోర్టులో పిల్

స్వర హోటల్ నిర్మాణానికి అనుమతి ఇవ్వడం చట్ట విరుద్ధమన్న పిటిషనర్


భూమార్పిడి ఒప్పందాన్ని రద్దు చేయలేమన్న ఉన్నత న్యాయస్థానం

# అమరావతిలో వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించిన చంద్రబాబునాయుడు

- ★ వాజ్‌పేయి వంటి వారితో రాజకీయం చేసి ఇప్పుడు చిల్లర వ్యక్తులతో చేయాలంటే సిగ్గేస్తోంది: చంద్రబాబు నాయుడు
- ★ జైభారత్, జై తెలుగుతల్లి అంటూ ప్రసంగం ప్రారంభించిన ముఖ్యమంత్రి
- ★ వాజ్‌పేయి, ఎన్టీఆర్ మధ్య మంచి అనుబంధం ఉందన్న చంద్రబాబునాయుడు



అమరావతి: వాజ్‌పేయి వంటి ఉన్నత స్థాయి నాయకులతో రాజకీయం చేసిన తనకు ఇప్పుడు చిల్లర వ్యక్తులతో రాజకీయం చేయాలంటే సిగ్గుగా ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి యాత్ర ఆగదని, సంపద, ఆరోగ్యం, ఆనందం ప్రజలకు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గతంలో వాజ్‌పేయి, ఇప్పుడు నరేంద్ర మోదీ తనకు స్ఫూర్తినిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజా రాజధాని అమరావతిలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు. అమరావతిలో వాజ్‌పేయి శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ



కార్యక్రమానికి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాజ్‌పేయి విగ్రహావిష్కరణ అనంతరం చంద్రబాబునాయుడు ప్రసంగించారు. జై భారత్, జై తెలుగుతల్లి అంటూ ఆయన తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అమరావతిలో వాజ్‌పేయి జయంతి ఉత్సవాలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రపంచమంతా గుర్తించేలా అమరావతిని తీర్చిదిద్దుతామని ఆయన పునరుద్ఘాటించారు.

## పులివెందుల చర్చిలో జగన్ కుటుంబం ప్రత్యేక ప్రార్థనలు



### సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ సీఎం తల్లి విజయమ్మ, భార్య భారతితో కలిసి హాజరు

చర్చి బయట వేచి ఉన్న అభిమానులకు అభివాదం, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన వైసీపీ చీఫ్

అమరావతి: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని వైసీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి పులివెందులలో సందడి చేశారు. గురువారం ఉదయం స్థానిక సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. పులివెందుల పర్యటనలో భాగంగా జగన్ తన తల్లి వైఎస్ విజయమ్మ, భార్య వైఎస్ భారతి రెడ్డితో కలిసి చర్చికి చేరుకున్నారు. వారితో పాటు మరికొందరు కుటుంబ సభ్యులు కూడా ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం జగన్ చర్చి వెలుపల వేచి ఉన్న అభిమానులు, స్థానికులకు అభివాదం చేస్తూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. జగన్ పర్యటన సందర్భంగా పులివెందులకు వైసీపీ కార్యకర్తలు, నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చర్చి పరిసరాల్లో పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### సీఎం చంద్రబాబుతో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని భేటీ .. ఆ కీలక అంశంపై వినతి



గ్రేటర్ విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ ఏర్పాటుపై సీఎంకు ఎంపీ కేశినేని వినతి

సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు

త్వరలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్న ఎంపీ

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## ఎయిర్ ప్యూరిఫయర్లపై 18 శాతం జీఎస్టీ.. కేంద్రంపై ఢిల్లీ హైకోర్టు సీరియస్

ఢిల్లీ: ఢిల్లీతో పాటు నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్సీఆర్) లో తీవ్రమైన వాయు కాలుష్యం కారణంగా ప్రజలు చనిపోతుంటే ఎయిర్ ప్యూరిఫయర్లపై కేంద్ర 18 శాతం జీఎస్టీ వసూలు చేయడంపై ఢిల్లీ హైకోర్టు సీరియస్ గా స్పందించింది. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో వేగంగా నిర్ణయం తీసుకోలేరా, అసలు జీఎస్టీ కౌన్సిల్ ఏం చేస్తోందంటూ ప్రశ్నించింది. "కాలుష్యాన్ని నియంత్రించి ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించలేకపోతున్నారు.. కనీసం ఎయిర్ ప్యూరిఫయర్లపై జీఎస్టీ తగ్గించడమూ చేతకాదా?" అంటూ కేంద్రాన్ని నిలదీసింది. ఈమేరకు కేంద్రానికి నోటీసులు జారీ చేస్తూ, రెండ్రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఎయిర్ ప్యూరిఫైయర్లపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని కోరుతూ అడ్వకేట్ కపిల్ మదన్ ఢిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్ పై చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావు గేదెల ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ బుధవారం విచారణ జరిపింది. స్పందించేందుకు 15 రోజుల సమయం కోరిన ప్రభుత్వం తరపు న్యాయవాదిపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రంగా ఉందని గుర్తు చేస్తూ.. ఇలాంటి అత్యవసర పరిస్థితిలో వేగంగా నిర్ణయం తీసుకోలేరా.. అంత సమయం దేనికి? ఎంతమంది చనిపోయేదాకా వేచి చూడాలని ప్రశ్నించింది. కనీసం తాత్కాలికంగానైనా మినహాయింపులు ఇవ్వలేరా.. జీఎస్టీ కౌన్సిల్ ఏం చేస్తోందని నిలదీసింది. వీలైనంత త్వరగా జీఎస్టీ కౌన్సిల్ సమావేశమై, ఎయిర్ ప్యూరిఫైయర్లపై జీఎస్టీని తగ్గించాలని సూచించింది. ఈ కేసు విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది.

## త్వరలో 'భారత్ ట్యాక్సీ'.. లాభాలన్నీ డ్రైవర్లకే!

ఢిల్లీ: దేశంలో త్వరలోనే 'భారత్ ట్యాక్సీ' పేరుతో కొత్త సేవలను ప్రారంభించనున్నట్లు కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ విధానంలో వచ్చే లాభాలను పూర్తిగా డ్రైవర్లకే పంచుతామని ఆయన స్పష్టం చేశారు. కస్టమర్లకు మెరుగైన సౌకర్యం కల్పించడంతో పాటు డ్రైవర్ల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. హర్యానాలోని పంచకులలో నిన్న జరిగిన సహకార సమ్మేళనంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "సహకార మంత్రిత్వ శాఖ చొరవతో త్వరలోనే 'భారత్ ట్యాక్సీ'ని ప్రారంభిస్తాం. దీని ద్వారా వచ్చే ప్రతి పైసా లాభం డ్రైవర్ సోదరులకే చెందుతుంది. ఇది డ్రైవర్ల లాభాలను పెంచుతుంది" అని వివరించారు. ఈ కార్యక్రమంలో దేశానికి హర్యానా అందిస్తున్న సేవలను అమిత్ షా కొనియాడారు. దేశ ఆహార భద్రత, పాడి ఉత్పత్తి, క్రీడారంగంలో ఆ రాష్ట్రం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పంజాబ్‌తో కలిసి హర్యానా దేశాన్ని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధం చేసిందని ప్రశంసించారు. చిన్న రాష్ట్రమైనప్పటికీ జనాభా నిష్పత్తి ప్రకారం కేంద్ర సాయుధ బలగాలకు, త్రివిధ దళాలకు అత్యధిక సైనికులను అందిస్తున్న ఘనత హర్యానాదే అని గుర్తుచేశారు. పశుపోషణ, వ్యవసాయం, సహకార రంగాలను అనుసంధానించడం ద్వారానే దేశంలో శ్రేయస్సు సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 2014లో రూ. 22 వేల కోట్లుగా ఉన్న వ్యవసాయ బడ్జెట్‌ను రూ. 1.27 లక్షల కోట్లకు, రూ. 80 వేల కోట్లుగా ఉన్న గ్రామీణాభివృద్ధి బడ్జెట్‌ను రూ. 1.87 లక్షల కోట్లకు పెంచామని అమిత్ షా తెలిపారు.

## రేవంత్ రెడ్డి భాషపై హరీశ్ రావు వ్యాఖ్యలు.. స్పందించిన ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్: ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి వాడుతున్న భాష సరిగాలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. రాజకీయాల్లో తిట్ల పురాణానికి ఆద్యుడు కేసీఆరేనని ఆయన పేర్కొన్నారు. రెండేళ్ల తర్వాత బయటకు వచ్చిన కేసీఆర్ ముఖ్యమంత్రిని ఉద్దేశించి 'తోలు తీస్తా' అంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేసీఆర్ పద్ధతిగా మాట్లాడితే రేవంత్ రెడ్డి అంతే పద్ధతిగా సమాధానం చెబుతారని, అభ్యంతరకర భాషను ఉపయోగిస్తే అదే పద్ధతిలో బదులిస్తారని అన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లకు హరీశ్ రావు నీతులు చెప్పాలని ఎద్దేవా చేశారు. హరీశ్ రావు వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని విమర్శించారు. నీతులు ఎదుటివారికే తప్ప తమకు కాదన్నట్లుగా మాట్లాడుతున్నారని అన్నారు. తొలుత కేసీఆర్ మాట్లాడే భాషను ఒకసారి పరిశీలించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ తిట్ల పురాణం ప్రారంభించారని, కానీ ఇప్పుడు రాజకీయ నాయకుడిగా కూడా అదే భాషను కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి పదేళ్ల అవినీతిపై చర్చించాలని సవాల్ విసిరారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కూడా ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రికి గౌరవం ఇవ్వాలని సూచిస్తున్నారని, ఇదే విషయాన్ని బీఆర్ఎస్ నాయకులకు కూడా చెప్పాలని కోరారు.

## అప్పటి వరకు రైతు భరోసా నిధుల పంపిణీ ఉండదు


మొదటి పేజీ తరువాయి

తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఉపగ్రహ చిత్రాల క్రోడీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ... యాసంగిలో వాస్తవంగా సాగు చేస్తున్న భూములనే గుర్తించి రైతులకు న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అందుకే ఉపగ్రహ చిత్రాల ఆధారంగా భూముల గుర్తింపు పూర్తయ్యే వరకు రైతు భరోసా నిధుల పంపిణీ ఉండదని తెలిపారు. జనవరి నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని తిరిగి ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ యాంత్రీకరణ పథకానికి రాష్ట్ర వాటా నిధులు సమకూర్చి, రైతులకు రాయితీపై యంత్రాలు, పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు జనవరి మొదటి వారంలో మండలాల వారీగా పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేయాలని మంత్రి సూచించారు. రైతులకు అందుతున్న రాయితీలు, యాంత్రీకరణ పథక దరఖాస్తులు, యూరియా యాప్ అమలు వంటి అంశాలపై ప్రత్యక్షంగా అభిప్రాయాలు సేకరించాలని చెప్పారు. ప్రస్తుతం ఐదు జిల్లాల్లో యూరియా యాప్ విజయవంతంగా అమలవుతోందని మంత్రి తెలిపారు. త్వరలోనే ఈ యాప్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామన్నారు. అయితే, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాల కారణంగా యాప్ అమలులో లేని జిల్లాల్లో కొంతమంది రైతులు అవసరానికి మించి యూరియా కొనుగోలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా యాప్ ద్వారా అవసరమైన మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని, రైతులెవరూ అనవసర భయాందోళనలకు గురికావద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసమే ప్రతి నిర్ణయం తీసుకుంటోందని, ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు.

## తెలంగాణను వణికిస్తున్న చలి.. సింగిల్ డిజిట్‌కు పడిపోయిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్: తెలంగాణ చలి గుప్పిట్లో చిక్కుకుంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో జనం గజగజ వణికిపోతున్నారు. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో రికార్డు స్థాయిలో 6.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, చలి తీవ్రతకు తట్టుకోలేక మెదక్‌లో ఓ యాచకుడు ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గత కొన్ని రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో చలి ప్రభావం అధికంగా ఉంది. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో ఈ నెల 5 నుంచి వరుసగా సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలే నమోదవుతున్నాయి. బుధవారం ఇక్కడ 6.4 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. ఇదే తరహాలో ఆసిఫాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనూ చలిగాలులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పగలు ఎండ ఉన్నప్పటికీ, సాయంత్రం నుంచే చల్లటి గాలులతో వాతావరణం మారిపోతోంది. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ మరో హెచ్చరిక జారీ చేసింది. రాబోయే రెండు, మూడు రోజుల పాటు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని తెలిపింది. దీంతో చలి తీవ్రత మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం. బయటకు వెళ్లేటప్పుడు ఉన్ని దుస్తులు, మఫ్లర్లు, చేతి గ్లౌజులు ధరించాలని, ఒకే మందపాటి దుస్తువుకు బదులు రెండు మూడు పొరలుగా దుస్తులు వేసుకోవాలని చెబుతున్నారు. గోరువెచ్చని నీరు, వేడి ఆహారం తీసుకుంటూ శరీరాన్ని డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలని, శ్వాసకోశ సమస్యలున్నవారు ఉదయం పూట బయటకు రాకపోవడం మంచిదని హెచ్చరిస్తున్నారు.

## ఏపీ హైకోర్టులో టీటీడీకి భారీ ఊరట




అమరావతి: తిరుపతి మండలం పేరూరు గ్రామ పరిధిలో టీటీడీకి చెందిన భూమిని పరస్పర భూమార్పిడి విధానంలో పర్యాటక శాఖకు కేటాయించి, అనంతరం దానిని ఒబెరాయ్ గ్రూప్‌కు చెందిన 'స్వర' హోటల్ నిర్మాణానికి ఇచ్చిన వ్యవహారంలో హైకోర్టు జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఈ మేరకు దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని (పిల్) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది. టీటీడీ - పర్యాటక శాఖ మధ్య జరిగిన భూమార్పిడిని రద్దు చేయాలని, స్వర హోటల్స్‌కు భూమి కేటాయింపుపై జారీ చేసిన జీవోను సవాలు చేస్తూ తిరు క్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ టీటీడీ నుంచి పర్యాటక శాఖ తీసుకున్న భూమిలో స్వర్ణ హోటల్ నిర్మాణానికి అనుమతి ఇవ్వడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, భక్తుల కోసం చేపట్టాల్సిన ప్రాజెక్ట్‌ను టీటీడీ వేరే ప్రాంతానికి మార్చిందన్న కారణంతో మాత్రమే భూమార్పిడి ఒప్పందాన్ని రద్దు చేయలేమని స్పష్టం చేస్తూ పిల్‌ను తోసిపుచ్చింది. దీంతో టీటీడీకి హైకోర్టులో భారీ ఊరట లభించినట్లయింది.

# కేసీఆర్‌పై రేవంత్ భాష కరెక్ట్ కాదు

మొదటి పేజీ తరువాయి



గ్రామ పంచాయతీలకు 5 లక్షల రూపాయలు ఏం సరిపోతాయి. ప్రతీ గ్రామ పంచాయతీకి కోటి రూపాయలు ఇవ్వాలి. మార్చి నాటికి మూడువేల కోట్లు ఇస్తామని రేవంత్ అంటున్నారు.. అవి కేంద్రం ఇచ్చే నిధులే. కాంగ్రెస్ పార్టీ మీద ప్రజలకు వ్యతిరేకత ఉంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇద్దరు, ముగ్గురు మంత్రులు వేల కోట్లు సంపాదిస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రహస్య సమావేశాలు నిర్వహించుకున్నారు. భూములు కొల్లగొడుతున్న ఇద్దరు, ముగ్గురు మంత్రులు భవిష్యత్‌లో జైలుకు వెళ్లడం ఖాయం. వారిపై నివేదిక తయారు చేస్తున్నాం.

గెలిస్తే కాంగ్రెస్ పార్టీనా?

పార్టీ గుర్తుపై జరిగే %వీుజ,,గాుజ% ఎన్నికలకు వెళ్లకుండా సర్పంచ్ ఎన్నికలకు వెళ్ళారు. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన వాళ్ళను తమ వాళ్ళే అని కాంగ్రెస్ వాళ్ళు చెప్పుకుంటున్నారు. ఒక ఫిరాయింపు ఎమ్మెల్యే బయటకు వచ్చి కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని చెప్పినా స్పీకర్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న అధికారులు నిజాయితీ పరులు.. వారికి స్వేచ్ఛ ఇవ్వండి. మావోయిస్టుల లిస్టులో పెట్టి మా ఫోన్లు ట్యాప్ చేశారు. ఈ ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ జరుగుతున్నట్లు ఆధారాలు లేవు' అని కామెంట్స్ చేశారు.

బీజేపీ బలంగానే ఉంది..

మా పార్టీ నేతలమంతా కలిసికట్టుగానే ఉన్నాం. మేం కలిసి భోజనాలు కూడా చేశాం. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం జీవోలను దాచిపెడుతోంది. ఆరు గ్యారెంటీలు చర్చ జరగకుండా చేస్తున్నారు. ప్రధాన మంత్రి ఆవాస యోజన కింద ఎన్ని ఇళ్లు ఇచ్చారు? రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలి. రంగారెడ్డి జిల్లాలో నలుగురు రోహింగ్యాలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చారు. ఓట్ల కోసం వారిని ప్రోత్సహిస్తున్నారు. భాగ్యనగరం అభివృద్ధి చెందాలంటే ఏ పార్టీ మేయర్ కావాలో ప్రజలు తేల్చుకోవాలి. గతంలో కొద్ది తేడాలో మేయర్ స్థానం పోగొట్టుకున్నాం. ఈసారి సింగిల్‌గా మేయర్ పీఠం మాదే. ఎంఐఎంకు అనుకూలంగా హైదరాబాద్‌లో డివిజన్ల డీలిమిటేషన్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మాయలో ఉంది. భాగ్యనగరంలో ఎంఐఎంతో సహవాసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఓటు ఎవరూ వేయడానికి సాహసం చేయరు. జూబ్లీహిల్స్ ఓటమితో కార్యకర్తలు ఆవేదన చెందారు. ఖైరతాబాద్‌లో కార్యకర్తలు కసితో ఉన్నారు. ఈ దేశంలో మైనార్టీ ప్రజలంతా క్షేమంగా ఉన్నారు. ముస్లింలతో పాటు అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లో మాత్రం హిందువులను హతమారుస్తున్నారు' అని అన్నారు.

## మంటల్లో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. ప్రయాణికుల సజీవ దహనం

మొదటి పేజీ తరువాయి




కూడిన బస్సు బుధవారం అర్ధరాత్రి దాటాక బెంగళూరు నుంచి గోకర్ణ వెళ్తుండగా.. బెంగళూరు-హుబ్బళి హైవేపై సిరా-హిరియూర్ మధ్య గోర్లత్తు గ్రామం(చిత్రదుర్గ జిల్లా) వద్ద ప్రమాదానికి గురైంది. ఆ మంటల ధాటికి బస్సుతో పాటు ట్రక్కు కూడా పూర్తిగా కాలిబూడిదైంది. తొలుత ఆగి ఉన్న ట్రక్కును వేగంగా వచ్చిన బస్సు ఢీ కొట్టడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రచారం జరిగింది. అయితే.. ఈ ఘటన నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్, హెల్పర్ సురక్షితంగా బయటపడ్డాడు. వాళ్లు తెలిపిన వివరాల ప్రకారం.. అపోజిట్ రోడ్డులోంచి దూసుకొచ్చిన బస్సు ఢీ కొట్టడం వల్లే ప్రమాదం జరిగింది. "డివైడర్‌కు మరోవైపున ప్రయాణిస్తున్న లారీ ఒక్కసారిగా నేను వెళ్తున్న రోడ్డు పైకి దూసుకొచ్చింది. లారీ ఢీకొట్టబోతోందని అర్థమై బస్సును కంట్రోల్ చేసేందుకు ప్రయత్నించా. కానీ అప్పటికే ప్రమాదం జరిగింది. ప్రమాదం ధాటికి మా బస్సు పక్కనే వెళ్తోన్న మరో వాహనాన్ని కూడా తాకింది. అయితే ఆ వాహనం ఏంటో నేను చూడలేకపోయా. అతివేగం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుంది" అని ట్రావెల్స్ బస్సు డ్రైవర్ వివరించాడు. ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి ?వ్యక్తం చేసిన సీఎం సిద్ధరామయ్య.. మంత్రులను, అధికార యంత్రాగాన్ని ఘటనా స్థలానికి తక్షణమే వెళ్లాలని, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల్ని పరామర్శించాలని ఆదేశించారు. సమగ్ర దర్యాప్తు తర్వాతే ప్రమాదానికి గల కారణంపై ప్రభుత్వం ప్రకటన చేస్తుందని అన్నారాయన.

ప్రమాదం జరిగిందిలా..

చిత్రదుర్గ జిల్లాలోని జాతీయరహదారి-48పై గోర్లత్తు క్రాస్ వద్ద గురువారం వేకువజామున 2.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బెంగళూరు నుంచి గోకర్ణ వెళ్తున్న సీబర్డ్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును కంటెయినర్ లారీ ఢీకొట్టింది. బస్సు డీజిల్ ట్యాంక్‌కు మంటలు అంటుకోవడంతో ప్రమాదం జరిగింది. డీజిల్ ట్యాంక్ వద్ద ఢీ కొట్టడంతో.. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఆ మంటల్లో రెండు వాహనాలు కాలి బూడిద అయ్యాయి. కంటెయినర్ డ్రైవర్‌తో పాటు గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికుల్లో చాలామంది కాలి బూడిదయ్యారు.

యువకుడి సాహసంతో..

ప్రయాణికుల్లో ఒక యువకుడు సాహసం చేసి బస్సు అద్దాలు పగలకొట్టాడు. దీంతో 9 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారని తెలుస్తోంది. వీళ్లలో కొందరికి గాయాలు కావడంతో చిత్రపురి, సిరా ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. కాలిన గాయాలతో ఉన్న క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

సకాలంలో స్పందించినా..

సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చాయి. అయితే మంటలు శరవేగంగా అంటుకుని అప్పటికే బస్సు మొత్తం బూడిదైంది. ట్రావెల్స్ నిర్వాహకులు ఇచ్చిన లిస్ట్ ప్రకారం.. మృతుల్లో చాలామంది గోకర్ణవాసులేనని తెలుస్తోంది. ఈ ఘటనతో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

తప్పిన ఘోరం!

అయితే.. ఈ ప్రమాదం నుంచి 40 మందికి పైగా స్కూల్ విద్యార్థులు త్రుటిలో తప్పించుకున్నారు. టి.దర్శహళ్లి నుంచి దండేలికి వెళ్తున్న ఓ టూర్ బస్సు.. ప్రమాదానికి గురైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు సమాంతరంగా ప్రయాణించింది. ఈ టూర్ బస్సులో 42 మంది విద్యార్థులు ఉన్నారు. ట్రావెల్స్ బస్సును లారీ ఢీకొనడంతో ఆ ప్రమాద ధాటికి స్కూల్ బస్సు కూడా అదుపు తప్పింది. ఈక్రమంలో స్కూల్ బస్సు ప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సును వెనక నుంచి ఢీకొట్టి రోడ్డు పక్కకు జారింది. అయితే, పిల్లల బస్సుకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ మేరకు ఆ బస్సు డ్రైవర్ స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డ్ చేశారు.

# అమరావతిలో వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించిన చంద్రబాబునాయుడు

మొదటి పేజీ తరువాయి



ప్రపంచమంతా గుర్తించేలా అమరావతిని తీర్చిదిద్దుతామని ఆయన పునరుద్ఘాటించారు. వాజ్‌పేయి స్మృతివనాన్ని అమరావతిలో నిర్మించడానికి ఇక్కడి రైతుల త్యాగమే స్ఫూర్తి అని కొనియాడారు. చరిత్ర గుర్తించే విధంగా వాజ్‌పేయికి ఘనమైన నివాళి ఇవ్వాలనే సదుద్దేశంతో స్మృతి వనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. 26 జిల్లా కేంద్రాల్లో అటల్ విగ్రహాలను ప్రతిష్ఠించేలా కూటమి సంయుక్తంగా కృషి చేస్తోందని చంద్రబాబునాయుడు తెలిపారు. అటల్ జన్మదినాన్ని సుపరిపాలన దివస్‌గా దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నామని ఆయన గుర్తు చేశారు. తెలుగు నేలలో కూడా అలాంటి స్ఫూర్తినిచ్చిన నేత ఎన్టీఆర్ అని, వీరంతా చరిత్రను తిరగరాసిన గొప్ప నాయకులని ఆయన అభివర్ణించారు. నేషనల్ ఫ్రంట్ ద్వారా కాంగ్రెసేతర పార్టీలను ఏకం చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని ఆయన అన్నారు. వాజ్‌పేయి, ఎన్టీఆర్ మధ్య సుదీర్ఘ అనుబంధం ఉందని చంద్రబాబు గుర్తు చేశారు. జనసంఘ్ నుంచి భారతీయ జనతా పార్టీని ఏర్పాటు చేసిన ప్రయాణం కూడా ఎంతో కీలకమని ఆయన అన్నారు. వాజ్‌పేయి మంచి వక్తగా, కవిగా, ప్రజాహృదయ నేతగానే కాకుండా దేశ మౌలిక సదుపాయాలకు బలమైన పునాది వేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన గోల్డెన్ క్వాడ్రిలేటరల్ రహదారిని మొట్టమొదట తడ-చెన్నైల మధ్య ప్రారంభించామని గుర్తు చేశారు. దేశాన్ని అణుశక్తిగా మార్చి ప్రపంచానికి భారతీయుల సత్తా చాటిన ధీశాలి వాజ్‌పేయి అని చంద్రబాబు అన్నారు. కార్గిల్ యుద్ధం ద్వారా వాజ్‌పేయి, సింధూర్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత్ వైపు ఎవరైనా చూస్తే తగిన బుద్ధి చెబుతామని గట్టిగా చెప్పారని గుర్తు చేశారు. అబ్దుల్ కలాం, వాజ్‌పేయి ఇద్దరూ దేశం కోసం నిరంతరం శ్రమించిన మహానుభావులని అన్నారు. దేశం మెచ్చిన నేతగా వాజ్‌పేయి చిరస్మరణీయులని, అందుకే ఆయన స్మారకాన్ని అమరావతిలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ వంటి మహనీయులకు కూడా అమరావతిలో స్మారక స్థూపం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ తెచ్చిన సంస్కరణలతో 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ అగ్రస్థానం దిశగా వేగంగా పయనిస్తోందని చంద్రబాబునాయుడు అన్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానానికి చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. దేశాన్ని శిఖరాగ్రంలో నిలిపే శక్తి నరేంద్ర మోదీకి ఉందని ఆయన ప్రశంసించారు. రాజధానికి భూములు ఇచ్చిన అమరావతి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాజధాని నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని వెల్లడించారు. నాడు ప్రధాని హోదాలో హైటెక్ సిటీకి అటల్ బిహారీ వాజ్‌పేయి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు అమరావతిలో క్వాంటం వ్యాలీని నిర్మిస్తున్నట్లు తెలిపారు. హైవేలు, పరిశ్రమలు, ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందని అన్నారు. గత వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ వెంటిలేటర్‌పై ఉందని, ఇప్పుడు కోలుకుని అభివృద్ధి ప్రయాణం మొదలు పెట్టిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పీపీపీ ద్వారా మెడికల్ కళాశాలలు నిర్మించేందుకు ప్రయత్నిస్తుంటే కొందరు మోకాలడ్డుతున్నారని ఆరోపించారు. పీపీపీ అంటే ప్రైవేటు కాదని, ప్రభుత్వ ఆస్తేనని గుర్తించాలని సూచించారు. వాటిని నిర్వహించి తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తారని తెలిపారు.

## డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడితే.. వాహనం సీజ్, రూ. 10 వేల ఫైన్, జైలు శిక్ష..



హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీస్ శాఖ... డ్రంకెన్ డ్రైవ్‌పై ఉక్కుపాదం మోపుతోంది. క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్వయంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను పర్యవేక్షించారు. నిన్న రాత్రి బంజారాహిల్స్‌లోని టీజీ స్టడీ సర్కిల్ పరిసరాల్లో నిర్వహించిన తనిఖీల్లో సీపీ పాల్గొని, పోలీసు సిబ్బంది పనితీరును పరిశీలించారు. తనిఖీల విధానంపై సూచనలు ఇవ్వడమే కాకుండా, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి స్వయంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రంకెన్ డ్రైవ్ వల్ల కలిగే ప్రమాదాలపై సీపీ సజ్జనార్ వాహనదారులకు స్పష్టంగా వివరించారు. "ప్రతిరోజూ మీడియాలో చెబుతున్నాం. అయినా చదువుకున్న వారు కూడా ఇలా మద్యం తాగి డ్రైవ్ చేస్తే ఎలా?" అని ఆయన ప్రశ్నించారు. నిర్లక్ష్యం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు తెచ్చే ప్రమాదం ఉందని అన్నారు. పబ్‌లు, పార్టీలకు వెళ్లే వారు తప్పనిసరిగా డ్రైవర్లను వెంట తీసుకురావాలని లేదా క్యాబ్‌లు బుక్ చేసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ప్రవర్తించవద్దని హెచ్చరించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డిసెంబరు 31 రాత్రి వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని సీపీ స్పష్టం చేశారు. నగరవ్యాప్తంగా సుమారు 120 ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తామని వెల్లడించారు. డ్రంకెన్ డ్రైవ్‌పై ఎలాంటి ఉపేక్ష ఉండదని సజ్జనార్ తేల్చిచెప్పారు. అలా పట్టుబడిన వారి వాహనాన్ని సీజ్ చేస్తామని, రూ. 10 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. 6 నెలల జైలు శిక్ష కూడా తప్పదని స్పష్టం చేశారు. సేవించిన మద్యం మోతాదును బట్టి శాశ్వతంగా లైసెన్స్ రద్దుకు రవాణా శాఖకు సిఫారసు చేస్తామని తెలిపారు.

## రేవంత్ వ్యాఖ్యలు.. జగదీష్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్




సూర్యాపేట: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌ది కంపు నోరు.. మురుగు కాల్వ కంటే అధ్వాన్నం అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక బూతులు మాట్లాడి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతూ..'రేవంత్ రెడ్డికి ప్రధాని మోదీ, చంద్రబాబు అవసరం ఉండొచ్చు.. కానీ, తెలంగాణ ప్రజలకు లేదు. కేసీఆర్ స్ట్రీట్ ఫెలోస్ గురించి మాట్లాడలేదు. రేవంత్ రెడ్డిది కేసీఆర్ స్థాయి కాదు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్ పార్టీకి బండ రాయి కట్టి మూసీ నదిలో పడేస్తారు. కేసీఆర్ అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక బూతులు మాట్లాడి తప్పుదోవ పట్టిస్తున్నారు. రేవంత్ తోలు కాదు, ప్రభుత్వం తోలు వలుస్తాం. కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి వస్తే తమ బట్టలు ఇప్పుతాడనే భయంతోనే ఫ్రస్టేషన్‌లో రేవంత్ మాట్లాడుతున్నాడు. రేవంత్ భాషకి ప్రజాక్షేత్రంలో తప్పక శిక్ష పడుతుంది. ప్రజలే రాజకీయ సమాధి చేస్తారు. కేసీఆర్ ముందు రేవంత్ బచ్చా. ఇరిగేషన్ మంత్రి ఒక అజ్ఞానపు మంత్రి. ఉత్తమ్ కుమార్‌కు కనీస అవగాహన లేదు. మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత' అని వ్యాఖ్యలు చేశారు.

## మల్కాజ్‌గిరిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు,.....

### క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి.......






నేరెడ్ మెట్, డిసెంబర్ 25:**(నేటి శుభోదయ):** మల్కాజ్‌గిరి నియోజకవర్గ పరిధిలోని సఫిల్‌గూడలోని సెయింట్ పీటర్స్ చర్చ్, దుర్గానగర్‌లోని సీజీఎం చర్చ్, యాప్రాల్ బేతెల్‌లోని ఫెయిత్ చర్చ్‌లలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. "ప్రేమించు – ప్రేమను పంచు" అనే సందేశంతో క్రైస్తవ ధర్మ సూక్తులను ఉటంకిస్తూ, పరస్పర ప్రేమ, సౌభ్రాతృత్వం, ఐక్యతతో సమాజం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో లియోనార్డ్ మీఘర్, పాస్టర్ రెవరెండ్ డాక్టర్ సూర్యప్రకాశ్, రెవరెండ్ జె.పి. నిథిల్ కుమార్, జాన్ పాల్, బెనేహర్, జాకబ్, నాహోమ్ పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, జేఏసీ వెంకన్న, జి.కె. హనుమంత్ రావు, మురుగేష్, చిన్నా యాదవ్, కరంచంద్, వంశీ ముదిరాజ్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, హేమంత్ పటేల్, సంపత్ యాదవ్, శివ గౌడ్, సాయి గౌడ్, నవీన్ రాజ్, అరవింద్, రాజేష్ గౌడ్, సుమన్ గౌడ్, సుమన్ సింగ్, కుమార్, నర్సింగ్, అరుణ్, శోభా, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## ప్రాచీన కళలకు కంబాల శ్రీనివాసరావు ప్రోత్సాహం


### కోలాటం గజ్జ పూజ కార్యక్రమానికి 1,50,000 రూపాయలు విరాళం.



నేటిశుభోదయ–గోకవరం.: మండల కేంద్రమైన గోకవరం డ్రైవర్స్ కాలానికి చెందిన పలువురు మహిళలు మన ప్రాచీన కాలం నాటి అద్భుతమైన కళలో ఒకటైన కోలాటం నృత్యాలను నేర్చుకుంటున్నారు. కోలాటం నేర్చుకున్న అనంతరం గజ్జపూజ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి సహాయంఅందించాలని, డ్రైవర్ కాలనీకి చెందిన పలువురు మహిళలు విశ్వహిందూధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు వద్దకు వచ్చి ఇటీవలే కోరారు. స్పందించిన ఆయన మన ప్రాచీన కళలను ప్రోత్సహించాలని సంకల్పంతో వారికి 1,50,000 రూపాయలు విరాళం ప్రకటించారు. ఆ విరాళం చెక్ ను గోకవరం సీఎండీ కార్యాలయం వద్ద మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు, కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత, మనందరిపై ఉందన్నారు. వాటి ప్రోత్సాహానికి తాను ఎల్లప్పుడు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు.

## బృందావన్ కాలనీలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ

### అయ్యప్ప పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి.....




నేరెడ్ మెట్, డిసెంబర్ 25:**(నేటి శుభోదయ):** మల్కాజ్‌గిరి నియోజకవర్గం నేరేడ్మెట్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో పిట్టల మోహన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అయ్యప్ప స్వామి ఆశీస్సులు భక్తులందరికీ కలగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యత, సౌహార్దాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అన్ని మతాల వారు పరస్పర గౌరవంతో కలిసి పాల్గొనడం భారతీయ సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. ఈ మహా పూజలో బీఆర్ఎస్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, జేఏసీ వెంకన్న, జి.కె. హనుమంత్ రావు, మురుగేష్, చిన్నా యాదవ్, కరంచంద్, వంశీ ముదిరాజ్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, హేమంత్ పటేల్, సంపత్ యాదవ్, శివ గౌడ్, సాయి గౌడ్, నవీన్ రాజ్, అరవింద్, రాజేష్ గౌడ్, సుమన్ గౌడ్, సుమన్ సింగ్, కుమార్, నర్సింగ్, అరుణ్, శోభా, శ్రీలత తదితరులు పాల్గొన్నారు. .

## వి.వై.ఎస్.హైటెక్ ఫామ్ వాష్ సర్వీసింగ్ సెంటర్ ని ప్రారంభించిన తోట



నేటిశుభోదయ–గోకవరం.: గోకవరంమండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో వి.వై.ఎస్. హైటెక్ ఫామ్ వాష్ సర్వీసింగ్ సెంటర్



ప్రారంభించిన జగ్గంపేట నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు తోట నరసింహం, రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, ఉభయగోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీ రాంజీలు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, గోకవరం మండల వైస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు, వివిధ అనుబంధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.




## జవహర్‌నగర్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



నేరెడ్ మెట్, జవహర్ నగర్, డిసెంబర్ 25:**(నేటి శుభోదయ):** క్రిస్మస్ పండగ సందర్భంగా జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ సంగీత రాజశేఖర్ నివాసంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ సందేశం ప్రేమ, కరుణ, మానవత్వాన్ని చాటుతుందని మల్లారెడ్డి పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో, ఐక్యతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఇటువంటి పండుగలు సమాజంలో సామరస్యాన్ని మరింత బలపరుస్తాయని అన్నారు. వేడుకలు ఆనందోత్సాహాల మధ్య స్నేహపూర్వక వాతావరణంలో సాగాయి. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, స్థానికులు, క్రైస్తవ కుటుంబ సభ్యులు పాల్గొని పండగ శుభకాంక్షలు పంచుకున్నారు.



## లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కౌకూర్ విద్యార్థుల ఘన విజయం



నేరెడ్ మెట్, డిసెంబర్ 25:**(నేటి శుభోదయ):** లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో జాతీయ రికార్డు సాధించి కౌకూర్‌కు చెందిన నేషనల్ అకాడమీ ఫర్ డ్యాన్స్, మార్షల్ ఆర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ సెషన్స్ అసోసియేషన్ విద్యార్థులు కొత్త చరిత్ర సృష్టించారు. హైదరాబాద్ ఆర్.ఆర్. జిల్లా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నవంబర్ 23, 2025న నిర్వహించిన "30 నిమిషాల్లో అత్యధిక రౌండ్‌హౌస్ కిక్‌లు (మావాషి గేరి)" ఈవెంట్‌లో ఈ రికార్డు నమోదైంది. విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశంలోని 10 రాష్ట్రాల నుంచి 927 మంది పాల్గొని మొత్తం 8,55,460 రౌండ్‌హౌస్ కిక్‌లు చేసి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్నారు. పాల్గొన్నవారి వయస్సు 8 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల వరకు ఉండగా, పసుపు బెల్ట్ నుంచి 7వ డాన్ బ్లాక్ బెల్ట్ స్థాయి వరకు ఉన్న మార్షల్ ఆర్టిస్టులు తమ ప్రతిభను చాటారు. ఈ జాతీయ రికార్డు సాధనలో అమైరా, బద్దూరి హేమామృత, రిషికా కుమారి, బైస్నబీ మహాపాత్ర, దుహిత రాయ్, రాగం షణ్ముఖ్, అల్లి లవిక్, అద్విక్ సింగ్, అపూర్వ, ప్రణవ్ ముకుంద, వొంగటి రితిక్ రెడ్డి, కొలుముల గవశిత్ ముధిరాజ్, శోభిత్ టీఎస్, మరియా థెరిసా, బి. అనంతు తో పాటు మాస్టర్ డాక్టర్ జి. విజయ్ కుమార్ కీలకంగా పాల్గొన్నారు. ఈ రికార్డు ఫలితాలను లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫైడ్ రచయిత, ఎడిటర్ వత్సల కౌల్ బెనర్జీ అధికారికంగా గురువారం ప్రకటించారు. ఈ ఘన విజయంతో కౌకూర్ ప్రాంతం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని క్రీడా నిపుణులు తమ సంతోషం ను వ్యక్తం చేస్తున్నారు.

## వికారాబాద్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు ఈసారి రాజకీయ శత్రుత్వాలను మరిచిపించేలా, సామరస్యానికి ప్రతీకగా నిలిచాయి




నేటి శుభోదయ వికారాబాద్ 25 డిసెంబర్ : వికారాబాద్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు ఈసారి రాజకీయ శత్రుత్వాలను మరిచిపించేలా, సామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. ఈ వేడుకల్లో ఒక అరుదైన దృశ్యం కనిపించింది ౹ మాజీ ఎమ్మెల్యే లిడాక్టర్ మెతుకు ఆనంద్ (బీఆర్ఎస్) మరియు ప్రస్తుత ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ (కాంగ్రెస్) ఇద్దరూ ఒకే వేదికపై పాల్గొని, స్నేహపూర్వకంగా ముచ్చటించటం, ఒకరిని మరొకరు సాదరంగా పలకరించటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా నేతలు కీలకమైన సందేశాన్ని ఇచ్చారు ౹ ఎన్నికల సమయంలో పోటీ సహజం, కానీ ప్రజా సంక్షేమం కోసం ఎన్నికల అనంతరం నాయకులు కలిసిమెలిసి పని చేయాలి అనే దృక్పథాన్ని పంచుకున్నారు. గ్రామస్థాయిలోనూ రాజకీయ కక్షలు మరిచి ప్రతిపక్షం, పాలకపక్షం కలిసి పనిచేస్తేనే ప్రజలకు శ్రేయస్సు చేకూరుతుందని ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు అర్థ సుధాకర్ రెడ్డి, మండల స్థాయి నాయకులు, బీఆర్ఎస్ నేత లిశుభప్రద పటేల్‌లితో పాటు, వివిధ పార్టీలకు చెందిన అనేక మంది నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వీరి మధ్య స్పష్టంగా కనిపించిన , పరస్పర గౌరవం, సామరస్యపు వాతావరణం కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిలిచింది ఈ వేడుకలు రాజకీయాలకు పైగా మానవ సంబంధాల ప్రాధాన్యతను గుర్తు చేస్తూ, ప్రజా జీవితానికి ఒక పాజిటివ్ సందేశాన్ని పంపించాయి.



## గ్రామాల అభివృద్ధి బిజెపితోనే సాధ్యం -ఎంపీ డీకే అరుణమ్మ

### డీకే అరుణమ్మను మర్యాదపూర్వకంగా కలుసుకున్న కేశంపేట గ్రామ సర్పంచ్ సంతోష శ్రీశైలం




కేశంపేట ప్రతినిధి నేటి శుభోదయ: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అది బిజెపితోనే సాధ్యమని మహబూబ్ నగర్ పార్లమెంట్ ఎంపీ డీకే అరుణమ్మ అన్నారు. కేశంపేట గ్రామ సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం మహబూబ్ నగర్ లో బిజెపి పార్టీ కార్యాలయంలో ఎంపీడీకే అరుణమ్మను గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఎంపీ సంతోషశ్రీశైలంను సన్మానించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం ఆమె మాట్లాడుతూ... గ్రామాలని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రధాని మోదీ నిరంతరం శ్రమిస్తున్నారు. కేశంపేట గ్రామ అభివృద్ధి కొరకు అన్ని విధాలుగా సహకారాలు అందిస్తాను. సిసి రోడ్లు గాని ,డ్రైనేజీ గాని, స్ట్రీట్ లైట్ గాని అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజు, వార్డు సభ్యులు పోలెమోని సతీష్, మంచె కృష్ణయ్య, తిమ్మగళ్ల చంద్రకళరామచంద్రి, గంజాయి దశరథం, కమ్లికర్ అనితనాగేష్, లిక్కి హంసమ్మ విజయ్,బిజెపి నాయకుడు తలసాని పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబ సభ్యులకు మాజీ జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి ఆర్థిక సహాయం



కేశంపేట ప్రతినిధి నేటి శుభోదయ: కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామపంచాయతీ శ్యామ్ రావు తండాకు చెందిన మెగావత్ మారుని గురువారం ఆకస్మికంగా మరణించింది. విషయం తెలుసుకున్న కేశంపేట మాజీ జెడ్పిటిసి తాంద్ర విశాల శ్రావణ్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు 5 వేల రూపాయల ఆర్థిక సాయని అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉప సర్పంచ్ సఫూరా ఆమేర్ వార్డు సభ్యులు చంద్రయ్య, చెన్నయ్య, రమేశ్, రాము, రిజ్వానా బేగం మోహిజ్, మంజుల జంగేష్ నాయకులు దిద్దెల జంగయ్య, శ్రీశైలం, నందు నాయక్, ముత్యాలు, బద్దూ నాయక్, రామక్రిష్ణ, నసిర్, షాబొద్దిన్, నరేష్, శ్రీను, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

## మంథని బెతెల్ గాస్పల్ ప్రేయర్ మినిస్ట్రీస్ లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు






**మంథని, డిసెంబర్–25, నేటిశుభోదయ: మంథని బెతెల్ గాస్పల్ ప్రేయర్ మినిస్ట్రీస్ లో గురువారం ఘనంగా క్రిస్మస్ వేడుకలను మంథని మున్సిపాలిటీలోని ఎరుకల గూడెంలో బెతెల్ గాస్పల్ ప్రేయర్ మినిస్ట్రీస్ లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పాస్టర్ ఎలిషా క్రీస్తు జన్మదిన విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, విద్యుత్ సలహా మండలి సభ్యులు శశిభూషణ్ కాచే, పిఎసిఎస్ ఎక్స్ చైర్మన్ కొత్త శీను, మాజీ ఎంపీపీ కొండ శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్, సూరయ్య పల్లి సర్పంచ్ ఆర్ల నాగరాజు, ఉపసర్పంచ్ అరుణ్, రామక్క, పాస్టర్లు ఐతు ఎలీషా, ఐతు దేవిడ్, ఐతు లూక, సమ్మయ్య, రాజబాబు, మల్లేష్, శీను విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.**

## మాజీ ప్రధాని అటల్ బీహారి వాజ్ పాయ్ జీవితం నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలి

### –ధన్ పాల్ సూర్యనారాయణ

### ఆయన జయంతి సందర్భంగా బిజెపి పార్టీ సుపరిపాలన దినంగా ప్రకటించింది..

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ డిసెంబర్ 25 నేటి శుభోదయ: మాజీ ప్రధాని భారతదేశానికి మూడుసార్లు ప్రధానమంత్రిగా సేవలందించిన అటల్ బిహారీ వాజ్ పాయ్ నేటితరం యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు.గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బిజెపి జిల్లా





పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పాయ్ 101 జయంతినీ పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అపర మేధావి కవి అయినటువంటి మాజీ ప్రధాని అటల్ బీహారి వాజ్ పాయ్ మాటల్లో మృదుత్వం అందరినీ ప్రేమగా పలకరించే స్వభావం కలిగిన వ్యక్తి.ప్రధానిగా ఉన్న సమయంలో దేశ అభివృద్ధి కోసం ఎన్నో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకువచ్చరు.దేశ ప్రజల అభివృద్ధి సంక్షేమం భద్రత కోసం కీలక నిర్ణయాలు తీసుకున్న ఘనత వాజ్ పాయ్ కి దక్కుతుందన్నారు.అణు పరీక్షల ఒప్పందం తదితర ఇతర ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చి ప్రపంచంలోనే భారతదేశానికి ఒక గౌరవాన్ని తీసుకువచ్చారని,అదేవిధంగా వాజ్పే పాయ్ హయాంలో ఆడపిల్లల చదువు కోసం కీలక నిర్ణయాలు తీసుకొని ఆడపిల్లలకు చదువు ఎంత అవసరమో తెలియచెప్పి పురుషులతో సమానంగా ఆడపిల్లలు చదువుల్లో రాణిస్తారని మహిళల్లో ధైర్యం నింపిన వ్యక్తి వాజ్ పాయ్ తన ప్రసంగంతో దేశ ప్రజలను ఎందరినో ఆకట్టుకున్నారని తెలిపారు.గత సంవత్సరం ఆయన 100వ జయంతి రోజున సుపరిపాలన దినోత్సవంగా ప్రకటించించారు.ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని,ముఖ్యంగా నేటితరం యువత వాజ్ పాయ్ వ్యక్తిత్వాన్ని పుస్తకాల్లో చదివి ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్రవంతి రెడ్డి,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ళ లక్ష్మీనారాయణ,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పొతంకర్ లక్ష్మీనారాయణ,బీజేపీ మాజీ కార్పొరేటర్స్,బీజేపీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సి.ఎస్.ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకలు పాల్గొన్న

## ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ







నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ డిసెంబర్ 25 నేటి శుభోదయ: నిజామాబాద్ పట్టణంలోని సి.ఎస్.ఐ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో,ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి.ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేని ఉద్దేశించి చర్చి పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రభువైన యేసు క్రీస్తు ఎమ్మెల్యేని ఆయురారోగ్యాలు, జ్ఞానం,శక్తితో ఆశీర్వదించి,ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని ప్రసాదించాలని ప్రార్థించారు.ఎమ్మెల్యే కుటుంబంపై కూడా దేవుని కృప,శాంతి,ఆశీర్వాదాలు సదా ఉండాలని కోరారు.వేడుకల్లో మాట్లాడిన ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ,క్రిస్మస్ పండుగ ప్రేమ,శాంతి, సోదరభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. పశుగొట్టెలో జన్మించిన యేసు క్రీస్తు జీవితం వినయం,త్యాగం,సేవలకు ఉదాహరణ అని తెలిపారు.యేసు బోధించిన ప్రేమ,క్షమ,సేవ విలువలు ప్రతి ఒక్కరి జీవితంలో ప్రతిబింబించాలన్నారు.అలాగే,అన్ని మతాలు మానవత్వాన్ని బోధిస్తాయని,పండుగలు సమాజంలో ఐక్యతను,సామరస్యాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు.నిజామాబాద్ పట్టణం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో న్యాలం రాజు,కార్పొరేటర్ ప్రభాకర్,ముండాడ పవన్,మఠం పవన్,చర్చి ఫాదర్లు,పాస్టర్లు,సంఘ సభ్యులు,క్రైస్తవ భక్తులు,స్థానిక ప్రజాప్రతినిధులు,ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వికారాబాద్ పట్టణంలో క్రిస్మస్ వేడుకలు








నేటి శుభోదయ వికారాబాద్ 25 డిసెంబర్ : ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గారు పలు చర్చిలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు బి ఆర్ ఎస్ నేతలు శుభ ప్రద పటేల్, నాగేందర్ గౌడ్ మరియు ఇతర నాయకులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రార్థన అనంతరం మాట్లాడిన డాక్టర్ మెతుకు ఆనంద్ గారు, క్రిస్మస్ పండుగ ప్రజలందరికి శాంతి, సౌభాగ్యం, ఆరోగ్యం అందించాలన్న ఆశయాన్ని వ్యక్తం చేశారు. క్రీస్తు ప్రవక్త సందేశాన్ని గుర్తు చేస్తూ, మనం ప్రతి ఒక్కరిపట్ల ప్రేమ, దయ చూపించే జీవన శైలి అవలంబించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యత, సహన భావం, మానవత్వం పెంపొందాలన్నదే ఈ పండుగ సందేశమని వివరించారు. ఈ వేడుకల ద్వారా ప్రజల మధ్య పరస్పర స్నేహం, గౌరవం మరింత బలపడుతాయని, పండుగలు మనిషి మనిషికి దగ్గరవేసే వేదికలుగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న నేతలు, ప్రజలు ఆయనను అభినందిస్తూ, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చర్చిల వద్ద ప్రత్యేక అలంకరణలు, ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి.

# ప్రభు దయతో అందరు సుఖసంతోషాలతో ఉండాలి


## క్రిస్మస్ వేడుకలకు కేశంపేట జడ్పీటీసీ తాంద్ర విశాల శ్రావణ్ రెడ్డి





షాద్ నగర్ ప్రతినిధి నేటి శుభోదయ: షాద్‌నగర్‌లోని ఎఫ్‌సిఎన్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకలకు కేశంపేట మాజీ జెడ్పిటిసి తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి,ఎఫ్‌సిఎన్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత మరియు డాక్టర్ థామస్ సమక్షంలో సిబ్బంది మరియు వృద్ధులు హాజరయ్యారు...


# ఈనెల 27న హైదరాబాదులో జరిగే సదస్సును జయప్రదం చేయండి




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ డిసెంబర్ 25 నేటి శుభోదయ: "వందేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమం – గుణపాఠాలు – కర్తవ్యాలు" అంశంపై సీపీఐ(ఎం.ఎల్)మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎన్.ఆర్ భవన్,కోటగల్లీలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్)మాస్ లైన్ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 2025 డిసెంబర్ 26 కు వందేళ్లు అవుతుందన్నారు.ఈ సందర్భంగా ఈనెల 27న పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నారన్నారు.భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో కార్మికులను,రైతులను, పీడితులను,అణచి వేయబడిన వర్గాలను కూడగట్టిందన్నారు.వాళ్లతో మమేకమై ఎన్నో ఉద్యమాలు నిర్మించిందన్నారు. క్రమంగా అనేక ప్రజాసంఘాలను ఏర్పరిచి,కోట్లాదిమందిలో చలనానికి,ఉద్యమానికి కారణమైందన్నారు.ఈ ఉద్యమ క్రమంలోనే పెషావర్ కుట్ర కేసు,మీరట్ కుట్ర కేసు,కాన్పూర్ కేసులతో పాటు ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొన్నదన్నారు.బ్రిటిష్ వలసవాదుల నిషేధానికి కూడా గురైందన్నారు.అనేక సంస్థానాల్లో జమీందారీ విధానానికి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టి సాయుధ పోరాటాలు నిర్వహించిందన్నారు.తెలంగాణ తెబాగ,వర్లి,పున్నప్రా,వాయలార్ పోరాటాలు భారత చరిత్రలో ముఖ్యమైనవన్నారు.కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర అంతా పోరాటాలు,త్యాగాలు,విజయాలతో నిండి ఉన్నదన్నారు.మతోన్మాద ఫాసిజం,కులం అన్ని రకాల అణచివేతలు వైశామ్యాల నుంచి ప్రజలను సాంఘికంగా విముక్తి చేయడానికి మరింత బలంగా ఉద్యమించాలన్నారు.ఆ వెలుగులోనే సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.ఈ నెల 27న జరిగే ఈ సదస్సును జయప్రదం చేయాలని కమ్యూనిస్టు శ్రేణులు,విప్లవ అభిమానులకు విజ్ఞప్తి చేశారు.ఈ ప్రెస్ మీట్ లో పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు వి.గోదావరి,కే.సంధ్యారాణి,మాస్ లైన్ నగర నాయకులు లింగం,విటల్,గంగాధర్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని కనుగొన్న గొప్ప శాస్త్రవేత్త న్యూటన్

## ‘ విజ్ఞాన్ ‘ లో ఘనంగా న్యూటన్ జయంతి



ఖమ్మం, ఇల్లందు, నేటి శుభోదయ ::: గురుత్వాక్షర సిద్ధాంతాన్ని కనుగొన్న భౌతిక శాస్త్రవేత్తగా సర్ ఐజాక్ న్యూటన్ ప్రపంచ ప్రసిద్ధిగాంచారని సీనియర్ జర్నలిస్ట్ ఎస్ వి సూర్యనారాయణ పేర్కొన్నారు. ఇల్లెందులోని 13వ నెంబర్ బస్తీలో గల ‘విజ్ఞాన్’ విద్యాసంస్థలో గురువారం సర్ ఐజాక్ న్యూటన్ జయంతిని నిర్వహించిన సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధునిక విజ్ఞాన శాస్త్ర పితామహుడిగా న్యూటన్ ప్రసిద్ధికెక్కారని, గొప్ప భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్తగా ప్రఖ్యాతి చెందారని ప్రశంసించారు. చెట్టు పై నుండి ఆపిల్ పండు కింద పడడాన్ని గమనించిన న్యూటన్ భూమికి ఆకర్షణ శక్తి ఉందని నిరూపించి ఇది విశ్వానికి కూడా వర్తిస్తుందని వివరించారు. న్యూటన్ ప్రతిపాదించిన గమన నియమాలు (న్యూటన్స్ లాస్ ఆఫ్ మోషన్ )ఎంతో ప్రాధాన్యత కలిగినవిగా ఆయన స్పష్టం చేస్తూ సూర్యకాంతి (తెల్లని కాంతి )ఏడు రంగుల మిశ్రమమని గాజు పట్టకం( ప్రిజ్మ్ ) ద్వారా నిరూపించారని అన్నారు. ‘విజ్ఞాన్ ‘విద్యాసంస్థ ప్రిన్సిపల్ సంతోష్ కుమార్ తివారి మాట్లాడుతూ న్యూటన్ గణితశాస్త్రంలో ‘క్యాల్కులస్’ అనే విభాగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ‘బైనామియల్ ‘సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని పేర్కొన్నారు. 1705 లో ఇంగ్లాండ్ రాణి న్యూటన్ ను ‘ సర్ ‘ అనే అత్యున్నత బిరుదుతో సత్కరించారని తదుపరి ఆయన రాయల్ సొసైటీ కి అధ్యక్షుడిగా కూడా కొనసాగారని కొనియాడారు. 1642 డిసెంబర్ 25న,ఇంగ్లాండ్ లోని ఊల్స్ తోర్ప్ అను గ్రామంలో జన్మించిన న్యూటన్ కేంబ్రిడ్జ్ లోని ట్రినిటీ కాలేజీలో విద్యనభ్యసించారని,విజ్ఞాన శాస్త్ర చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన పుస్తకం గా పరిగణించబడుచున్న ‘ఫిలసోఫియా నేచురాలిస్ ప్రిన్సిపియా మేథమెటికా ‘ అనే గ్రంథాన్ని రచించారని తెలియజేసారు. విద్యాసంస్థ కరస్పాండెంట్ జి వి నర్సయ్య మాట్లాడుతూ సర్ ఐజాక్ న్యూటన్ ప్రతిపాదించిన మూడు గమన నియమాలను వివరించి జడత్వం, బలం, ద్రవ్యరాశి, త్వరణం మధ్య గల సంబంధాలను తెలియజేసే అంశాలను తెలిపారు. ఈ భూమి పై ప్రతీ చర్యకు సమానమైన మరియు వ్యతిరేకమైన ‘ప్రతిచర్య’ ఉంటుందని న్యూటన్ మూడవ నియమం స్పష్టం చేస్తుందని పేర్కొన్నారు. భౌతికశాస్త్రం పై విశేషంగా కృషిచేసిన సర్ ఐజాక్ న్యూటన్ విశ్వమానవాళి కలకాలం గుర్తుంచుకోదగ్గ మహోన్నత శాస్త్రవేత్త గా నిలిచిపోయారని స్పష్టంచేశారు.

# మస్జిద్ సేవకులకు శీతాకాల దుప్పట్లు,స్వెటర్లు పంపిణీ హర్షణీయం

## మహమ్మద్ షబ్బీర్ అలీ ప్రభుత్వ సలహాదారులు




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ డిసెంబర్ 25 నేటి శుభోదయ: మస్జిద్‌లలో సేవలందిస్తున్న ఇమామ్‌లు, మౌజన్‌లు, మదర్సాల నాజిమ్‌లకు శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దుప్పట్లు,స్వెటర్లు పంపిణీ చేశారు.షేక్ ఇసా అహ్మద్ బిన్ షబీబ్,భీంగల్‌కు చెందిన నేషనల్ టెంట్ హౌస్ యజమాని,మాజీ కోఆప్షన్ సభ్యుడు ముహమ్మద్ అజ్మతుల్లా మద్దతుతో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్,పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,హజ్రత్ మౌలానా ముహమ్మద్ జాఫర్ పాషా ఖాద్రీ(అమీర్ మిల్లత్ ఇస్లామియా)ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ మాట్లాడుతూ,మస్జిద్ సేవకులకు శీతాకాల దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేయడం హర్షణీయం అన్నారు.సమాజాన్ని విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని రకాల సహకారాన్ని అందిస్తోందన్నారు.సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన పవిత్ర వాక్యంలో



‘ఇఖ్రా’ అనే పదం ద్వారా విద్య ప్రాముఖ్యతను స్పష్టం చేశాడని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అన్ని మతాల ప్రజలు శాంతియుత వాతావరణంలో జీవించేలా సౌకర్యాలు కల్పిస్తోందన్నారు.శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మత పాఠశాలలతో అనుబంధం ఉన్న పండితులు,మౌజన్‌లు,బాధ్యతాయుతమైన విద్యార్థులకు జాకెట్లు పంపిణీ చేయడం,అవసరమైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ నిధులు అందించడం ఆదర్శప్రాయమైన చొరవగా పేర్కొన్నారు.అనంతర ఈ



సేవకు ముందుకు వచ్చిన మహమ్మద్ అజ్మతుల్లాను శాలువాతో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..మౌలానా అబుల్ కలాం ఆజాద్ తొలి విద్యామంత్రిగా విద్యారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రతి వ్యక్తి విద్యలో ముందడుగు వేయడం నేటి అవసరమని,విద్య ద్వారా నైతికత,వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని,దాంతో సమాజంలో శాంతి,స్థిరత్వం పెరుగుతుందని తెలిపారు.ముహమ్మద్ అజ్మతుల్లామాట్లాడుతూ,మస్జిద్‌లలో సేవలందిస్తున్న ఇమామ్‌లు, మౌజన్‌లు, మదర్సాల నిర్వాహకులు సమాజానికి మార్గదర్శకులని అన్నారు.వారి సేవలను గౌరవిస్తూ ఇలాంటి సహాయ కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు.అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ద్వారా సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడుతుందని చెప్పారు.అనంతరం, మహమ్మద్ అలీ షబ్బీర్,మహేష్ కుమార్ గౌడ్,మహమ్మద్ అజ్మతుల్లా తదితరులు జాకెట్లు,స్కాలర్‌షిప్ నిధులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మానాల మోహన్ రెడ్డి,కర్నె సురేందర్,జె జె నర్సయ్యా,అనంతరావు బోడిరే స్వామి,తదితరులు పాల్గొన్నారు.

# గురువు ప్రాముఖ్యం

## గురువుకు సన్మానం చేసిన సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్.



షాద్ నగర్ ప్రతినిధి నేటి శుభోదయ: జీవితంలో ఉపాధ్యాయులు,అధ్యాపకుల ప్రాముఖ్యాన్ని రాబోయే తరాలకు వివరించడానికి గురువుల ప్రాముఖ్యత ఎంతో అనువైనదని అన్నారు సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్... ఫరూక్ నగర్ మండలం గిరాయి తాండ నూతన సర్పంచ్ గా గెలిసిన అనంతరం తమ గురువుగారైన గురువారం కలసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.పూర్వం విద్యార్థులంతా గురువుగారి ఆశ్రమంలోనే ఉంటూ విద్యను అభ్యసించేవారు. గురువు కూడా ఉచితంగా బోధించేవారు.గురువుగారి ప్రతి మాట శిష్యులకు శిరోధార్యమై ఆజ్ఞగా స్వీకరించేవారని చరిత్రలో ఎన్నో నిదర్శనాలు ఉన్నాయన్నారు.గురువు ప్రసాదించిన విజ్ఞానం ఏకకాలంలో శిష్యునికి నిత్య జీవన విధానాన్ని తెలపడమే గాక, దేవాది దేవుడైన శ్రీకృష్ణుని పట్ల స్వచ్ఛమైన భక్తియుత సేవాభావాన్ని పెంపొందించి జీవిత పరమావధి వైపు నడిపిస్తుందన్నారు. పెద్దలతో ఎలా మెలగాలి ఎలా గౌరవించాలి ఏ సమయంలో ఎవరితో ఎలా కలిసిపోవాలి మెలగాలి అనే సమయాన్ని స్ఫూర్తిని మాకు గురువుగారు వివరంగా వివరించాలని గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో గిరాయ గుట్ట తండా సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్, ఉప సర్పంచ్ రాజు,వార్డు సభ్యులు సరిత కిషన్, మౌనిక రమేష్, సీనియర్ నాయకులు బాలు నాయక్, వెంకట్ నాయక్, శ్రీను, డాకు, పరమేశ్, నరేష్, సునీల్, చిన్న మరియు తది తరులు పాల్గొన్నారు...

# ఏలూరులో పలు చర్చిల్లో జరిగిన క్రిస్మస్ పండుగ వేడుకల్లో పాల్గొన్న

## ఎంపి పుట్టా మహేష్ కుమార్ ప్రతినిధులు












ఏలూరు, నేటి శుభోదయ ::: ఏలూరు లోని పలు చర్చిలకు ఏలూరు ఎంపి పుట్టా మహేష్ కుమార్ క్రిస్మస్ పండుగ రోజున కేక్ లు పంపారు. అందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షల సందేశాన్ని పంపారు. ఎంపీ ఆదేశాల మేరకు కార్యాలయ ప్రతినిధులు ఆయా చర్చి ఫాస్టర్ లకు కేక్ ల అందచేసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, సేవ, త్యాగం, క్షమ, కరుణ వంటి అత్యుత్తమ జీవన మార్గాలను మానవ జాతికి అందించి, ఇతరుల కోసం జీవించడం అనే గొప్ప సందేశాన్ని నేర్పిన క్రీస్తు జన్మదినం ఎంతో పవిత్రమైనదన్నారు. మానవత్వాన్ని చాటే ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయని అవి అందరికీ ఆచరణీయమని ఎంపి పేర్కొన్నారు.

# భారత రాజ్యాంగాన్ని ప్రచారం చేయాలి ... వెన్నెల గద్దర్




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ డిసెంబర్ 25 నేటి శుభోదయ: భారత రాజ్యాంగ విలువల్ని గ్రామగ్రామన ప్రచారం చేయాలని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారధి శాఖ చైర్మన్ వెన్నెల గద్దర్ పిలుపునిచ్చారు.గురువారం ఉదయం హైదరాబాద్లోని శిల్పా కళా వేదిక వద్ద జరిగిన సాంస్కృతిక కార్యక్రమం అనంతరం ముంబై,తెలంగాణ అంబేడ్కర్ వాదులతో జరిగిన భేటీలో చర్చ జరిగింది.ముంబై నుంచి వచ్చిన వారికి ఆమె ప్రత్యేక అభినందనలు తెల్పుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం దేశ ప్రజలకు ఎంతో ఆశజనకమైందని అన్నారు.దీనిని సామాన్య ప్రజల వరకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.ఈ మేరకు నూతనంగా ఎన్నికైన వేల్పూర్ మండలం ఆక్లూరు గ్రామ సర్పంచ్ జిన్నా జనార్దన్ ని ఆమె అభినందించారు.ఇదే సందర్భంగా ఆమె ప్రతి కార్యకర్తతో కరచలనం చేశారు.ఈ సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు ఉమేష్ మహారాజ్,ముంబై ప్రతినిధులైన సామ్రాట్ అశోక్,బసీరబాద్ బాబురావు మహారాజ్,మూలనివాసి మాలజీ,జర్నలిస్టులైన అంగులి మాలజీ,మామిడి రాజు ఉన్నారు.

# స్వర్గీయ నీరుకొండ సాంబశివరావు జ్ఞాపకార్థం వంగలపూడి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్మించిన భోజనశాల షెడ్డు ప్రారంభోత్సవం....

### హాజరైన స్వర్గీయ సాంబశివరావు కుటుంబ సభ్యులు బొల్లి సత్యనారాయణ, శ్రీదేవిలు..





కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం వంగలపూడి గ్రామం జిల్లా పరిషత్ పాఠశాలలో స్వర్గీయ నీరుకొండ సాంబశివరావు జ్ఞాపకార్థం నిర్మించిన విద్యార్థుల భోజనశాల షెడ్డును ‘ప్రోలై ఫిక్స్’ సంస్థ అధినేతలు బొల్లి సత్యనారాయణ శ్రీదేవిలు, బిజెపి సీనియర్ నేత నీరుకొండ వీరన్న చౌదరి ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం చేశారు. అలాగే డైనింగ్ టేబుల్స్, తదితర పరికరాలను అందించారు. స్వర్గీయ నీరుకొండ సాంబశివరావు జ్ఞాపకార్థం వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను వారి కుటుంబ సభ్యులు విరివిగా కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేత నీరుకొండ వీరన్న చౌదరి, గ్రామ సర్పంచ్ శ్రీమతి కుంచే అన్నపూర్ణ భాస్కరరావు, స్థానిక నాయకులు నీరుకొండ శ్రీనివాస్, గెడ్డం సురేష్, పాఠశాల అధ్యాపకులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గల్లంతయిన విద్యార్థి మృత దేహం లభ్యం

ఖమ్మం, నేటి శుభోదయ క్రైమ్ ::: సాగర్ కాలువలో ఈతకు దిగి గల్లంతయిన విద్యార్థి మృతదేహం గురువారం కొణిజర్ల సాగర్ కాల్వ డీప్ కట్ వద్ద లభించిందని టూ టౌన్ పోలీసులు తెలిపారు. వికలాంగులు కాలనీ సుల్తాన్ నగర్ కు చెందిన ఎండి అబ్దుల్ సుహేన్, ఎడ్ల శశాంక్, ఈశ్వర్ లు బుధవారం సాగర్ కాల్వకు ఈతకు వెళ్లగా నీటిలో దిగిన అబ్దుల్ సుహేన్, శశాంకులు ప్రవాహంలో కొట్టుకుపోగా సుహేన్ మృతి చెందిన సంగతి తెలిసిందే. గల్లంతయిన శశాంక్ కోసం ఈతగాల సహాయంతో గాలించిన పోలీసులకు గురువారం కొణిజర్ల సమీపంలోని కెనాల్ డీప్ కట్ వద్ద మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లిన పోలీసులు పరిశీలించి ఖమ్మం కు చెందిన విద్యార్థి శశాంక్ దిగా గుర్తించారు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థుల మృతితో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో
# పలు చర్చిలలో చీరల పంపిణీ..





శేరిలింగంపల్లి : నేటి శుభోదయ.: మియాపూర్ డివిజన్ ప్రగతి ఎన్ క్లేవ్ కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ,సాయి బాలాజీ ఇన్ ఫ్రా అధినేత అట్టేపల్లి రాం ప్రభు స్వప్న ల 26 వ వివాహ వార్సికోత్సవ వేడుక సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ మెమరె చర్చ్, టేకు నరసింహ నగర్, ఎం.ఎ నగర్ లోనీ కల్వరి షారోన్ చర్చిలలో మహిళలకు చీరలను, నూతన సంవత్సర క్యాలెండర్ లను పంపిణీ చేశారు. అట్టేపల్లి రాంప్రభు తన కుటుంబ సభ్యులతో కలిసి పలు చర్చిలలో క్రిస్మస్ పర్వ దినం, క్రీస్తు జన్మదిన సందర్భంగా ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు. పాస్టర్ లు ఫిలిప్స్, జాన్ రాజ్, సుకుమార్ మొదలగువారు అట్టేపల్లి రాంప్రభు స్వప్న దంపతులకు యేసు క్రీస్తు ప్రభువు వాక్యం ద్వారా ఆశీస్సులను అందించారు. ఈ సందర్భంగా అట్టేపల్లి



రాంప్రభు మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా మా తండ్రి స్వర్గీయ అట్టేపల్లి లక్ష్మీ నారాయణ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో మాఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా నోట్ బుక్ లు, నూతన సంవత్సర క్యాలండర్ లు పంపిణీ చేస్తున్నామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్న విద్యార్థులకిద్దరికి ఫీజులు కట్టి, ట్రాన్స్ పోర్ట్ ఛార్జీలు కూడా చెల్లించి విద్యార్థులకి బాసట గా నిలుస్తూ మా సంస్థ సహాయం అందిస్తుందన్నారు. అప్పుడు మా పెళ్ళి చేసుకున్నప్పుడు క్రిస్మస్ పండుగ అని తెలియదని, ఇపుడు యాదృచ్ఛికంగా పండగ కలిసి రావడం అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.ఈ సంవత్సరం మా 26 వ వివాహ వార్సికోత్సవ సందర్భంగా చర్చిలలో మహిళలకి చీరలు, నూతన సంవత్సర క్యాలెండర్ లను పంపిణీ చేసి, సాటి వారికి సహాయం చేయాలనీ యేసు క్రీస్తు వారి స్ఫూర్తి తో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు సాయి బాలాజీ ఇన్ఫ్రా, అట్టే పల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అట్టేపల్లి పురుషోత్తం, శోభారాణి, రాజశేఖర్, వినోద్, శ్రీకాంత్, పొన్నం సతీశ్, విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఖాన్సాయిపేట్ గ్రామ సర్పంచ్ మెరుగు సురేష్ కు సన్మానం
### శ్రీ వైద్య ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సతీష్ కుమార్




మంథని రూరల్, డిసెంబర్-25, నేటిశుభోదయ: మంథని మండలం ఖాన్సాయిపేట గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన మెరుగు సురేష్ ను శ్రీ వైద్య ఫౌండేషన్- మంథని చైర్మన్ డా.బుద్దార్తి సతీష్ కుమార్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్బంగా మాట్లాడుతు అసంపూర్తిగా ఉన్న శ్రీ రామాంజనేయ ఆలయం పూర్తి చేయాలని గ్రామస్తుల చిరకాల ఆకాంక్ష , గ్రామ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని మరియు ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని గ్రామాన్ని అభివృద్ధి లో ముందుకు తీసుకుపోవాలని, గ్రామానికి ఉత్తమ బహుమతి లు వచ్చేలా కృషి చేయాలని, పురస్కారాలు తేవాలని,ఆ దేవుని కృప కటాక్షం ఎల్లపుడు ఉండాలని,ఏ కార్యక్రమం చేపట్టిన ఎలాంటి అడ్డంకులు రాకూడదని,మనస్ఫూర్తిగా శ్రీ రామాంజనేయ ఆలయ ట్రస్ట్- ఖాన్సాయిపేట గ్రామం తరుపున కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో శ్రీ వైద్య ఫౌండేషన్ బోర్డు డైరెక్టర్ కుడుదుల సంతోష్ పటేల్. సెక్రటరీ కుడుదుల రంజిత్ పటేల్, కుంటాల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## రాయలచెరువు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో
# ఉచిత కంటి వైద్య శిబిరం







యాడికి డిసెంబర్ 25 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శు భోదయ తెలుగు దినపత్రిక : మండలంలోని రాయలచెరువు లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత కంటి మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది. లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ శెట్టి మాట్లాడుతూ ప్రతినెలా మా లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుంది. ఈ శిబిరానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి ఇక్కడకు వచ్చి పేదవాళ్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు అని మాట్లాడడం జరిగింది. ఈ ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి 40 మంది పాల్గొనగా 15 మంది ఆపరేషన్లకు ఎంపిక కావడం జరిగినది. వీరిని ఉచితంగా బెంగళూరుకు తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి తిరిగి మరల తమ గమ్యస్థానాలకు చేర్చడం జరుగుతుంది. అదేవిధంగా లయన్స్ క్లబ్ సభ్యులు శంకర కంటి




ఆసుపత్రి వారి సిబ్బందికి ధన్యవాదములు తెలుపడం జరిగినది. ఈ వైద్య శిబిరానికి వచ్చిన వారికి అల్లా బకాష్ భోజన వసతి కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ట్రెజరర్ అల్లా ప్రకాష్, సత్యనారాయణ, రంజిత్ కుమార్, ఎల్ఐసి ప్రసాద్, ఇస్మాయిల్, రవికుమార్ రెడ్డి, ఎస్ బి ఐ రాజు, సూర్యనారాయణ, న్యూ వికాస్ రామకృష్ణ, రాజశేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొనడం జరిగినది.

# సుపరిపాలనకు ఆద్యుడు అటల్ జీ

## వికసిత భారత్‌కు నాయకుడు ు మోదీ జీ!



గజ్వేల్ నియోజకవర్గం, 25 డిసెంబరు 2025(నేటి శుభోదయ): సిద్ధిపేట జిల్లా : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి పురస్కరించుకొని గజ్వేల్ పట్టణ కేంద్రంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్ అధ్యక్షతన గజ్వేల్ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో అటల్ బిహారీ వాజ్ పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ సీనియర్ నాయకులు యేల్లు రాంరెడ్డి, ఉప్పల మధు లు మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్య రూపురేఖలను తన మాటలతో, అత్యున్నత నడవడికతో తీర్చిదిద్దిన మహోన్నత రాజనీతిజ్ఞుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రజాస్వామ్యం వర్ధిల్లేది 'సంవాదం'తోనే కానీ 'వివాదం'తో కాదని, ప్రభుత్వాలు వస్తాయి పోతాయి కానీ దేశం మాత్రం శాశ్వతంగా నిలిచి ఉండాలని ఆయన బలంగా నమ్మారు. రాజకీయం అంటే అధికారం కోసం చేసే పరుగు పందెం కాదు, అదొక సేవా యజ్ఞం అని చాటిచెప్పారు. రాజకీయాల్లో ఆయన పాటించిన హుందాతనం, అందరినీ కలుపుకుపోయే తత్వం, 'దేశమే ప్రథమం' అనే ఆయన సిద్ధాంతం భావితరాలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ గారు, సిద్దిపేట జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు కూడిక్యాల రాములు, సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు నత్తి శివకుమార్, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు పెండ్యాల శ్రీనివాస్, సిద్దిపేటజిల్లా కిషన్ మోర్చా కార్యదర్శి మర్కంటి ఎగొండ సిద్దిపేట జిల్లా మహిళా మోర్చా అలేటి సుమతి, గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శిలు మదుగురి నరసింహ ముదిరాజ్, నాయన సందీప్ కుమార్, గజ్వేల్ పట్టణ ఉపాధ్యక్షులు వడ్డేపల్లి ప్రసాద్, నీరజ గారు,మరియు కార్యదర్శి కాసమైన సందీప్ కుమార్, గజ్వేల్ పట్టణ కార్యవర్గ సభ్యులు నాగులపల్లి పవన్ శివలింగ బాలరాజు,కాసమైన రమేష్, గజ్వేల్ పట్టణ బిజెపి సీనియర్ నాయకులు మంద వెంకట్, బి వేణుగోపాల్ రాజ్, గజ్వేల్ పట్టణ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మంతూరు మమత కార్యదర్శి సరిత, స్వరాజ్యలక్ష్మి గారు, భక్తమల గారు, గజ్వేల్ సోషల్ మీడియా కో కన్వీనర్ సందిరి రాజు,బూత్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, గడియారం రాజేశ్వరి చారి రేవంతుల సురేష్, తదితరులు పాల్గొన్నారు,

# యాడికిలో సిపిఐ శతాబ్ది వేడుకలు వైభవంగా ....

## త్యాగధనుల కుటుంబాలకు ఘన సన్మానం
## సభకు ముఖ్య అతిథులుగా సి. జాఫర్ పి నారాయణ స్వామి



యాడికి డిసెంబర్ 25 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: మండల కేంద్రంలోని నారాయణస్వామి కాలనీలో గురువారం అజయ్ బాబు,సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ, అధ్యక్షతన సిపిఐ పార్టీ వంద సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి జాఫర్, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి హాజరయ్యారు. ముందుగా రైతు సంఘం




సీనియర్ నాయకులు శ్రీరాములు చేతులమీదుగా సిపిఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీ జాఫర్, నారాయణస్వామి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 1925 ఆవిర్భవించి దేశ స్వతంత్రం కోసం ఎన్నో ఉద్యమాలు ప్రాణ త్యాగాలు చేసి స్వాతంత్రం కోసం దేశంలో ఉన్న కార్మికులు కర్షకులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని తెలిపారు. నాటి నుండి నేటి వరకు పేద మధ్యతరగతి ప్రజల పక్షాన ఉంటూ ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ అనేక పోరాట రూపకల్పన చేసింది సిపిఐ అని అన్నారు. ఈనాటికీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాప్తంగా త్యాగాల విజయ స్ఫూర్తి సభలను ఘనంగా నిర్వహించారు. కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతుల, ప్రజా వ్యతిరేక విధానాలను




దుయ్యపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సి జాఫర్ పి నారాయణ స్వామికి యాడికి సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం సిపిఐ పార్టీ కోసం అమరులైన కుటుంబ సభ్యులను, సుదీర్ఘకాలం పార్టీకి సేవ లందించిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, సుబ్బయ్య సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, వికే ప్రదీప్ రెడ్డి, వెంగమ నాయుడు కుమారుడు అజయ్ బాబు, శ్యామ్ సుందర్, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఓబిరెడ్డి,సామాజికవేత్త , స్టాంప్ రైటర్ జూటూరు అబ్దుల్ రజాక్, సిపిఐ సీనియర్ నాయకులు జూటూరు బషీర్, పెద్దవడుగూరు మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్, సిపిఐ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, గుత్తి మండల కార్యదర్శి రామదాసు,సీమల వాగుపల్లి సూర్యనారాయణ, ఏఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి,ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి నరసింహ,సిపిఐ మండల సహాయ కార్యదర్శి వడ్డరాముడు, చేనేత మండల కార్యదర్శి బండారు రాఘవ, సిపిఐ సీనియర్ నాయకులు గరిడి శివన్న,రసూల్, సిపిఐ పట్టణ కార్యదర్శి కుల్లాయి రెడ్డి, సిపిఐ మాజీ ఎంపీటీసీలు, పోస బాల చౌడయ్య, గుండా వెంకటమ్మ, సిబిఐ మాజీ వార్డు సభ్యులు పామిశెట్టి జయరాముడు, సిపిఐ యువ నాయకులు జూటూరు బ్రదర్స్ మహబూబ్ రబ్బాని,సర్దార్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు...

# బిజెపి పార్టీ వ్యవస్థాపకుడు అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి

### మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించిన యాడికి బిజెపి మండల నాయకులు



**యాడికి డిసెంబర్ 25 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు వద్ది రాజశేఖర్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ వ్యవస్థాపకుడు అటల్ బిహారీ వాజ్ పేయి 101 శత జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా బిజెపి మండల నాయకులు నిర్వహించారు. ఆయన గురించి మాట్లాడుతూ ఈయన కవి, రచయిత, వక్త మరియు దేశ భక్తి,జాతీయ వధ మరియు విలువల పట్ల నిబద్ధత కలిగివారని, మూడు సార్లు ప్రధానిగా , తొమ్మిది సార్లు లోక్ సభ కు, రెండు సార్లు రాజ్య సభ కు ఎన్నిక కావడం జరిగింది. వాజ్ పేయి తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో భారత దేశానికి గొప్ప సేవ చేసి ,దేశ నాయకుడుగా మరియు ఈయన పథకాలు ప్రజలకు ఎంతో గానో ఉపయోగ పడినాయి. దేశ అభివృద్ధినీ ముందుకు తీసుకువెళ్లడం కీలక పాత్ర పోషించాడు అని, మాజీ ప్రధాని వాజ్ పేయి భారతీయులలో, భారతీయ ప్రజలలో హృదయాలలో చిర స్థాయిగా నిలిచిపోయిన వ్యక్తిగా కాశ్మీర్ నుంచి గ్రామీణ ప్రాంత వరకు అభివృద్ధి చెందాలని కోరుకున్న వ్యక్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల కన్వీనర్ వద్ది రాజశేఖర్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి మురళీకృష్ణ ఉపాధ్యక్షులు జయరాముడు, కాలవ జనార్ధన్, కేత వెంకటరమణ, మండల మాజీ అధ్యక్షుడు పూజారి ఆంజనేయులు, తెల్లాకుల రమేష్, మండల ఎస్సీ మోర్చా వేణుగోపాల్ కార్యకర్తలు పాల్గొన్నారు..**

## సేవా గుణంతోనే మానవులకు ఆత్మ తృప్తినిస్తుంది
### - మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి



గజ్వేల్ నియోజకవర్గం, 25 డిసెంబరు 2025 (నేటి శుభోదయ): సిద్దిపేట జిల్లా : తోట మానస గణేష్ పెళ్లిరోజు సందర్భంగా, తోట బిక్షపతి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా గజ్వేల్ ఇందిరాపార్కు చౌరస్తాలో సుమారు ఐదువందల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ రాజమౌళి, ప్రజాబందు అవార్డు గ్రహీత నంగునూరి సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ అన్నదాన ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సేవా భావాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయి. మానవ సేవే, మాధవ సేవా అని కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. పెళ్లిరోజు జరుపుకుంటున్న మానస గణేష్ లను అలాగే బిక్షపతికి ప్రత్యేక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిద్ది భిక్షపతి, లచ్చుల్, ప్రశాంత్, బ్రహ్మణపల్లి భిక్షపతి, కాసం సుభాష్, నాగలక్ష్మి, సాయిరాజ్, రక్షిత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్. ఎం. పి. వైద్యుల గుర్తింపు విషయంలో రాజీలేదు
### రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



విజయవాడ, డిసెంబర్ 25 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): ఆర్ఎంపి వైద్యుల గుర్తింపు విషయంలో రాజీలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు గ్రామీణ వైద్యుల మూడు ఫెడరేషన్లతో కూడిన ఏపీ ఆర్ జేఏసీ- ఆంధ్ర ప్రదేశ్ ఆర్ఎంపి, పిఎంపి జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షుడు తొండెపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు అమరావతి సచివాలయంలో బుధవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కలిసి వినతి పత్రం అందజేశారు. తదుపరి ఏపీ ఆర్ జేఏసీ 2026 డైరీ ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు, గ్రామీణ వైద్యుల కొరకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని గతంలో వలె 429, 465 జీవోల లోని అంశాలపై పునః పరిశీలన చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామీణ వైద్యుల కుటుంబాలలో వెలుగులు నింపాలని కోరారు. సావధానంగా విన్న ముఖ్యమంత్రి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. జాయింట్ యాక్షన్ కమిటీ



(జాక్) గౌరవ సలహాదారు డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, గౌరవ న్యాయ సలహాదారు డాక్టర్ నర్రా లోకనాథరావు, రాజకీయ న్యాయ సలహాదారు తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి లంకదాసరి ప్రసాదరావు, మూడు ఫెడరేషన్ల రాష్ట్ర నాయకులైన యామర్తి నాగేశ్వరరావు, కరెళ్ల గణపతి రావు, సి ఎస్ కుమార్, వి బి టి రాజు, ఎం.ఎన్.రాజు, బల్లా శ్రీనివాసరావు, టి రాజా సిద్ధార్థ, జి ఎస్ ప్రసాద్, కంబాల బాబురావు, వజ్రపు వినోద్ కుమార్, ఎం సుధాకర్ రాయల్ జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు





ఏన్కూర్ ,నేటి శుభోదయం:: ప్రేమ , కరుణ, ఐక్యతకు ప్రతీకగా క్రిస్మస్ వేడుకలు ఏన్కూర్ మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. చర్చిల న్నీ వెలుగులు నిండాయి. చర్చిలలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లువిరిసింది. క్రైస్తవ చర్చిలన్నీ ప్రార్థన గీతాలతో మారుమోగాయి. వివిధ చర్చిలలో కేక్ కట్ చేసి ఒకరినొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు . ఈ సందర్భంగా సేవకులు రేవ. కె. అద్భుత కుమార్ మాట్లాడుతూ.... ఏసుక్రీస్తు జననం మానవాళికి దేవుడిచ్చిన బహుమానం అని ఆయన అన్నారు. క్రైస్తవులైనటువంటి దేవుని ప్రేమను పంచుతూ యేసు క్రీస్తు చెప్పిన మార్గాన్ని ప్రజలకు తెలియపరచాలని ఆయన కోరారు . గ్రామాల క్షేమం కోసం, దేశ క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. అనంతరం చర్చిలలో విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సేవకురాలు స్వప్న అనురాగ్, రూపస్ సత్య దాసు, దానియేలు కొర్నేలి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీస్తు చూపిన మార్గాలు సర్వమానవాళికి ఆదర్శప్రాయం

### జనసేన పార్టీ ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్



గుడివాడ, డిసెంబర్ 25 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): క్రీస్తు చూపిన మార్గాలు సర్వమానవాలికి ఆదర్శప్రాయమని గుడివాడ జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. గురువారం సత్యనారాయణపురంలోని నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రజలందరిపై దేవదేవుని కరుణాకటాక్షలు ఉండాలన్నారు ముందుగా దైవ సేవకులు క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి బూరగడ్డ శ్రీకాంత్ క్రిస్మస్ కేక్ కట్ చేసి నేతలకు తినిపించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సాయన రాజేష్ ,మండల అధ్యక్షుడు ఇంటూరి గజేంద్ర,పార్టీ నాయకులు వేమూరి త్రినాథ్,సుంకర వెంకట్,గుండు వెంకట్రావు,మీరా షరీఫ్,పవన్,తదితరులు పాల్గొన్నారు.

# మచిలీపట్నం కార్పొరేషన్ లో ఎలక్ట్రిషన్లకు కాలనీ ఏర్పాటు చేయాలి




మచిలీపట్నం, డిసెంబర్ 25 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): ఎంతోకాలంగా పెండింగ్ లో ఉన్న మచిలీపట్నంలోని ఎలక్ట్రిషియన్స్ కోసం కాలనీ ఏర్పాటు చేసి అర్హులకు ఇళ్లస్థలా ఇవ్వాలని మచిలీపట్నం ఎలక్ట్రీషియన్స్ సర్వస్యత సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గురువారం మచిలీపట్నంలో రామానాయుడు పేట లోని రెస్టారెంట్ లో జరిగింది. నగర ఎలక్ట్రిషియన్ల సర్వసభ్య సమావేశం లో ఈ మేరకు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణను స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర ను పార్లమెంట్ సభ్యులు బాల సౌరిని జనసేన ఇన్చార్జి బండి రామకృష్ణను కోరుతూ తీర్మానం చేశారు. నగర ఎలక్ట్రిషియన్ ల సంఘ లీగల్ అడ్వైజర్ గా సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి ఎలక్ట్రికల్స్ అధినేత మామిడి మురళీకృష్ణ మాట్లాడుతూ ఎంతోకాలంగా ఎలక్ట్రిషన్ల సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని



వాటిని పరిష్కరించవలసిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని అన్నారు. అర్హులైన నిరుపేద ఎలక్ట్రిషన్లకు ఇళ్ల స్థలాలు కేటాయించి కాలనీ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ను మామిడి కృష్ణ కోరారు. ప్రభుత్వ రంగ ఎలక్ట్రిషన్లకు స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ తరగతులు ఉచితంగా ఏర్పాటు చేయాలని కోరారు. సంఘ న్యాయ సలహాదారుడు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుకూలంగా యువ ఎలక్ట్రిషన్లు కంప్యూటర్ తో అనుసంధానమైన ఎలక్ట్రికల్ వైరింగ్ ను నేర్చుకోవాలని అన్నారు. వినియోగదారుల యొక్క నమ్మకాన్ని పెంచుకుంటూ వృత్తిలో నైపుణ్యం పెంచుకోవాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల జాబితాలో ఎలక్ట్రిషన్ కూడా చేర్చి కార్మిక శాఖ ఇస్తున్న అన్ని సదుపాయాలు వర్తింపజేయాలని బాలాజీ కోరారు. త్వరలో మచిలీపట్నం ఎలక్ట్రీషియన్ల నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని బాలాజీ అన్నారు. సీనియర్ ఎలక్ట్రీషియన్లు వెంకటేశ్వరరావు, మేకల వీర శివాజీ, మాదిరెడ్డి ఈశ్వర్, దుర్గాప్రసాద్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అపార్ అనుశక్తి కంపెనీ ఏరియా మేనేజర్ కిషోర్, పూర్వ సంఘ అధ్యక్షులు శ్రీను తదితరులు పాల్గొన్నారు

## హఫీజ్ పేట్ డివిజన్, మదీనాగూడ లో భారతరత్న, మాజీ ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజపేయి గారి జయంతి వేడుకలు



శేరిలింగంపల్లి నేటి శుభోదయప్రతినిధి నియోజక వర్గం, హఫీజ్ పేట్ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో మదినగూడ గ్రామం గాంధీ విగ్రహం దెగ్గర,భారతమాత ముద్దుబిడ్డ ,భారతరత్న , మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజపేయి గారి 101వ జయంతి సందర్భంగా,వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించడం జరిగింది, ఈ సందర్భంగా హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ , బీజేపీ సీనియర్ నాయకులు మహేష్ యాదవ్ , అజిత్ సేనాపతి మాట్లాడుతూ..... ప్రజాస్వామ్య విలువలు, సమగ్ర పాలన మరియు అచంచలమైన దేశభక్తికి నిదర్శనమైన అటల్ జీ జీవితం మనందరికీ మార్గదర్శకం. వారి దూరదృష్టి మరియు ఆదర్శాలు నిరంతర ప్రేరణనిస్తాయి, పరిస్థితులు మారుతున్నా వ్యక్తిత్వం చంపుకొని అటువంటి మహానేత, అవకాశం కోసం రంగులు మార్చక విలువలతో కూడిన రాజకీయం నడిపిన నాయకుడు. నేటి రోజులలో అధికారం కోసం విలువలు మరుస్తున్న




నాయకులకు కరదీపిక లాంటి గొప్ప వ్యక్తి శత్రువులు సైతం శభాష్ అనే అటువంటి అజాతశత్రువు, పదవి కోసం పాకులాడక ప్రధాని పదవిని సైతం తృణప్రాయంగా వదిలివేసిన భారతీయ జనతా పార్టీ శిఖర




సమానుడు, మాజీ ప్రధానమంత్రి భారతరత్న అటల్ బిహారీ వాజ్పేయి గారు అని అన్నారు, ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మహేష్ యాదవ్, అజిత్ సేనాపతి,కోటేశ్వరరావు ,మాజీ కౌన్సిలర్ రమణయ్య, శ్రీధర్ రావు ,బీజేపీ నాయకులు సత్యనారాయణ రాజు ,మారెళ్ల వెంకటేశ్వర్లు , జగన్ గౌడ్ , శివాజీ , సురేష్ కురుమ , విష్ణు , బాబు రెడ్డి, పవన్, రాజు ముదిరాజ్, నవీన్, రాజు యాదవ్, వెంకటేష్ ముదిరాజ్, నర్సింహా యాదవ్, రమేష్ యాదవ్ ,కుమార్ కురుమ , శ్రీనివాస్ , రామ్ మోహన్, శేఖర్, రామ్ చంద్ర యాదవ్, రామ్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, అనీల్ , వినయ్ మరియు ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## అంబేద్కర్ సమాధిని సందర్శించిన జర్నలిస్ట్ నాయకుడు



తలకొండపల్లి డిసెంబర్ 25,నేటి శుభోదయ: భారత రాజ్యాంగ నిర్మాత,భారతరత్న, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సమాధిని గురువారం నాడు జర్నలిస్టు నాయకుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్( టిడబ్ల్యూజేఎఫ్) ఆమనగల్ బ్లాక్ అద్యక్షులు దరువుల శంకర్ సందర్శించారు.మహారాష్ట్రలోని ముంబై పట్టణంలో గల దాదర్ రోడ్డులో గల చైత్య భూమిని (అంబేద్కర్ సమాధి) స్థలాన్ని కుటుంబ సభ్యులు ,గ్రామస్తులతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ సమాధి చేసిన స్థలం వద్ద బౌద్ధమత సాంప్రదాయ ప్రకారం ప్రార్థన నిర్వహించి పూలమాలతో అంబేద్కర్ సమాధికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దరువుల శంకర్ మాట్లాడుతూ అంబేద్కర్ నిర్వహించిన ఉద్యమాలు, ప్రజలతో నిర్వహించిన అనేక పోరాటాలకు సంబంధించిన ప్రదర్శనశాలను తిలకించారు.అంబేద్కర్ చూపిన దారిలో దళిత బహుజనులు నడుచుకోవాలని,రాజ్యాధికారం సాధించే దిశగా ప్రయాణం కొనసాగించనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

## నత్తల మందు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు



వైరా నేటి శుభోదయ: వైరా మండలం తాటిపూడి గ్రామంలో గురువారం తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు గొర్రెలు మేకల కు నత్తలమందు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జవ్వాజి అశ్విని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పశువుల పెంపకానికి చేయూతనందిస్తుందని గొర్రెలు మేకలు రోగాల నివారణ నుండి తట్టుకునేందుకు నత్తలమందు వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సంధ్యారాణి ,సురేష్, రాము, రవీందర్, సుబ్బారావు ,కిషోర్, శేషగిరి , జవ్వాజి వెంకటేశ్వరరావు, బండి కోటయ్య ,కాంగ్రెస్ యువ నాయకుడు జావ్వాజి నాగరాజు, జవ్వాజి రోశయ్య ,పాపిగంటి వెంకటేశ్వర్లు, వినోద్ తదితరులు పాల్గొన్నారు

## రేచర్ల బజార్లో ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



వైరా నేటి శుభోదయ: మున్సిపాలిటీ పరిధిలో గల రేచర్ల బజార్ నందు రేచర్ల వెంకటేష్ -శ్రీకాంత్ స్వామి ఇంటి వద్ద బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజను మరియు హనుమాన్ చాలీసాను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళలు, మాల ధరించిన అయ్యప్పలు భారీ సంఖ్యలో పాల్గొనటం జరిగింది. పూజ అనంతరం రేచర్ల బ్రదర్స్ అండ్ యూత్ ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు అల్పాహారం అందించారు.

## సర్పంచ్ పదవికి న్యాయం చేసి ప్రజల మన్ననలు పొందాలి

### - ఎమ్మెల్సీ యాదవ రెడ్డి



గజ్వేల్ నియోజకవర్గం, 25 డిసెంబరు 2025 (నేటి శుభోదయ): సిద్దిపేట జిల్లా తిప్పారం గ్రామ సర్పంచ్ గా ఆకుల భద్రప్ప గెలుపొంది, కుకునూర్ పల్లి మండల సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా ఉమ్మడి మెదక్ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి అఫిసులో భద్రప్పను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కుకునూర్ పల్లి మండలం మొత్తం బిఆరెస్ సీట్లు కైవసం చేసుకోడానికి కష్టపడిన ప్రతి కార్యకర్తకు అభినందలు తెలిపారు. తెలంగాణ గ్రామ పంచాయతీలు యావత్ దేశానికే ఆదర్శమని, ఆ ఘనత ముమ్మాటికీ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కె దక్కుతుందని అన్నారు. గత ఉమ్మడి రాష్ట్ర పాలనలో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోని గ్రామాలు, పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్ని గ్రామాల రూప రేఖలు మార్చుకున్నాయని, కెసిఆర్ హాయంలో పదేండ్లు ఎనలేని అభివృద్ధిని సాధించుకున్నామని దేశంలోనే అభివృద్ధి చెందిన గ్రామాల్లో మొదటి పది తెలంగాణ గ్రామాలేనని పేర్కొన్నారు. అదే రీతిలో గ్రామాలను అభివృద్ధి చేయాలనీ ప్రజలు ఇచ్చిన అవకాశానికి న్యాయం చేసి ప్రజలకు మన్ననలు పొందాలని సర్పంచ్ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆరెస్ సీనియర్ నాయకులు పంగ మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ మహమ్మారిని అంతం చేసేందుకు 'మేము సైతం'




నేటి శుభోదయ హైదరాబాద్, డిసెంబర్ 25: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, డ్రగ్స్ వంటి మహమ్మారులను అంతం చేసేందుకు పోలీసులతో కలిసి పనిచేస్తామని బర్కత్ పుర లోని అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అన్నారు. డ్రగ్స్ ను నిర్మూలించేందుకు తమవంతు కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం గుంతపల్లి గ్రామంలో డ్రగ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బేటి బచావో, బేటి పడావో పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసై... జీవితాలు నాశనం చేసుకోవద్దని, చదువుకొని ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ కు అలవాటు పడకుండా యువత జాగ్రత్తగా మెలగాలని అన్నారు. మత్తుకు అలవాటు పడితే జీవితం గాడితప్పుతుందని, భవిష్యత్తు అంధకారమవుతుందని వారు వివరించారు.

## మియాపూర్ కల్వరి టెంపుల్ లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు...

### వివిధ ప్రాంతాల నుండి లక్షలాదిగా కదలి వచ్చిన యేసు దాసులు..



శేరిలింగంపల్లి నేటి శుభోదయ ప్రతినిధి.. క్రీస్తు జన్మ దిన సందర్భంగా మియాపూర్ లోని కల్వరి టెంపుల్ లో డిసెంబర్ 25వ తేదీన క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాలనుండి యేసు క్రీస్తు ఆరాధన కోసం టెంపుల్ వచ్చిన విశ్వాసుల కి నిర్వాహకులు సకల సౌకర్యాలు కల్పించారు. దైవజనులు బ్రదర్ సతీష్ కుమార్ దేవుని వాక్య ప్రసంగాల ముగ్దులు అయి వారి నేతృత్వంలో జరిగే కార్యక్రమాలకు హైదరాబాదు నగర ప్రజలు భారీగా రావడంతో కల్వరి టెంపుల్ లో జనాలు విపరీతంగా పెరిగిన, నిర్వాహకులు ప్రార్థన కార్యక్రమం లకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించారు. కల్వరి టెంపుల్ లో ఏసుక్రీస్తు ప్రార్థనల కోసం టెంపుల్ వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చేశారు.వివిధ జిల్లాల నుండి విశ్వాసులు ప్రార్థనలు చేసి తిరిగి వారి



స్వస్థలాలకు సంతోషంగా చేరుకున్నారు. బందోబస్తు కోసం రంగారెడ్డి జిల్లా పోలీసు యంత్రాంగం కల్వరి టెంపుల్ చుట్టుముట్టు కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## బూరుగుపూడి 'ఇంజే బ్రదర్స్' కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కంటే వినయ్ తేజ, వైసిపి నేతలు, ఇతర ప్రముఖులు..








కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామంలో ఇంజె బ్రదర్స్ వారి తల్లి ఇంజె మేరీ (65) తుది శ్వాస విడిచారు. ఈ సందర్భంగా ఆ కుటుంబాన్ని పలువురు ప్రముఖులు గురువారం పరామర్శించారు. రాజానగరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యులు కంటే తేజ, సీనియర్ నాయకుడు పిట్టా కృష్ణ తదితరులు స్వర్గీయ ఇంజె మేరీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని దేవుని ప్రార్థించారు. కోరుకొండ మండలం, మరియు బూరుగుపూడి వైసిపి పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్న ఇంజె బ్రదర్స్ ని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కంటే వినయ్ తేజాలు పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుంజపడుగు పాఠశాల విద్యార్థుల విజ్ఞాన విహార యాత్ర



మంథని రూరల్, డిసెంబర్-25 నేటి శుభోదయ: మంథని మండలం గుంజపడుగు గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం విజ్ఞాన విహారయాత్రలో భాగంగా బుధవారం హైదరాబాద్ లోని చారిత్రక ప్రాంతాలు గోల్కొండ కోట,చార్మినార్,బిర్లా సైన్స్ మ్యూజియం , నెహ్రూ జూ పార్క్ మొదలైనవి సందర్శించారు. ఈ సందర్శనలో గోల్కొండ,చార్మినార్ లకు సంబంధిత చరిత్ర ప్రభావాలను తెలుసుకుని అబ్బుర పడ్డారు.జూపార్క్ లోని జంతువులకు,పక్షులను సందర్శించి వాటి జీవన విధానాలను తెలుసుకున్నారు.బిర్లా సైన్స్ మ్యూజియం లోని సైన్స్ ఎగ్జిబిట్లను,వాటి వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలను తెలుసుకున్నారు.బిర్లా సైన్స్ మ్యూజియం లో డైరోసార్ నిజ అస్థిపంజరం,వృక్ష శిలాజాలను సందర్శించి సంభ్రమాశ్చర్యాలకు గురి అయ్యారు.ఇలాంటి విజ్ఞాన విహార యాత్రల ద్వారా విద్యార్థులకు వినోదం తో పాటు విజ్ఞానం చేకూరుతుంది అని,ఆనందంగా అభ్యసించడం ద్వారా నేర్చుకున్న విషయాలు జీవితాంతం గుర్తుంటాయి.అని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు,మంథని మండల విద్యాధికారి దాసరి లక్ష్మి గారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాసం శివలీల,కర్రు సురేష్,కాసిపేట భూమయ్య,వడ్లకొండ స్వామి,రవీందర్,దాసరి నరేందర్,మూడెత్తుల సమ్మయ్య,సుప్రజ లు పాల్గొన్నారు.

## వీరమాచిన అమరేంద్రప్రసాద్ విగ్రహ ఆవిష్కరణ చేసిన దసరధ జనార్ధన్ (టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు)





విస్సన్నపేట : నేటి శుభోదయ(ప్రతినిధి కమలాకర్): విస్సన్నపేట కాకతీయ కమ్మ సేవా సమితి వేదికగా ఏర్పాటు చేసిన కీర్తి శేషులు వీరమాచిన అమరేంద్రప్రసాద్ విగ్రహ ఆవిష్కరణ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలోవిగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిధిగా తొండెపు ధసరథ జనార్ధన్(టిడిపి పోలట్ బ్యూరో సభ్యులు) విగ్రహ ప్రతిష్ట చేయటం జరిగింది ఈ కార్యక్రమంలో కుల మత పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో ప్రజలు వివిధ హెూదాలలోని నాయకులు అభిమానులు శ్రేయోభిలాషుల నడుమ రంగ రంగ వైభవంగా నిర్వహించటం జరిగింది అనంతరం విద్యలో రాణిస్తూ ప్రతిభను కనబరచిన ముగ్గురు చిన్నారులకు ప్రోత్సహం అందించేందుకు ప్రవాస ఆంధ్రులైన వల్లభనేని గిరిబాబు ఏర్పాటు చేసిన లాప్ టాప్ లను ధసరథ జనార్ధన్ చేతులమీదుగా అందించటం జరిగింది,తదుపరి కాకతీయ కమ్మ సేవా సమితికి సహాయ సహాకారాలు అందించిన ప్రముఖులను సన్మానించి మెమెంటోలు అందించారు, ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ డాక్టర్ యన్ టి వెంకటేశ్వరరావు,టిడిపి సీనియర్ నాయకులు బద్దె, డాబా శ్రీనివాసరావు, వల్లభనేని గిరిబాబు,విస్సన్నపేట మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు,వీరమాచిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు ఆత్మీయులు అభిమానులు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరేంద్ర ప్రసాద్ గారికి నిజమైన ఘనంగా నివాళి అందించారు.

# ఎఈఎల్‌సి ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



మాచర్ల : ఆర్ సి ఇన్చార్జి డిసెంబర్ 25 నేటి శుభోదయ: క్రిస్మస్ అంటే క్రీస్తును ఆరాధించుట అని లోక రక్షకుడైన ఏసుక్రీస్తు ప్రభువులవారి జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రపంచమంతా జరుపుకునే ఒక మహా గొప్ప పండుగ క్రిస్మస్ అని వెస్ట్ గుంటూరు సినడ్ ఎక్స్ యాక్టింగ్ బిషప్ మరియు ముటుకూరు ఆంధ్రా ఇవాంజిలికల్ క్రీస్తూ లూథరన్ దేవాలయం పాస్టర్ రెవరెండ్ కటికల యేసుదానం అన్నారు. ఏసుక్రీస్తు అందరికీ ప్రభువని,అందరికోసం దేవుడే ఈ లోకంలో జన్మించాడని, దేవుడే మానవుడిగా లోకానికి వచ్చి తన రక్షణ భాగ్యాన్ని ఇచ్చాడని ఆ రక్షణ భాగ్యాన్ని పొందుకున్నప్పుడే నిజమైన క్రిస్మస్ అని, ఆయన ఈ లోకంలో చూపిన ప్రేమ కరుణ దయ జాలి అందరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన చేసిన సేవ, ప్రేమ సందేశాన్ని వివరించి అందరికీ ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మరియు పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ క్రిస్మస్ అంటే ఆనందం, సంతోషం,సమాధానం అని,ఏసుక్రీస్తు పాపులను రక్షించుటకు ఈ లోకానికి వచ్చాడని ప్రతి ఒక్కరు తమ పాపాలను విడిచిపెట్టి ఏసుక్రీస్తు ప్రభువుల వారిని సొంత రక్షకునిగా అంగీకరించి పాపాన్ని విడిచిపెట్టి హృదయం అనే ఇంటిలో చేర్చుకొని దేవుని యందు భయభక్తులు కలిగి దేవునికి ఇష్టమైన బిడ్డలుగా జీవించడమే నిజమైన క్రిస్మస్ అని అన్నారు. ఏ ఈ ఎల్ సి ఆల్టర్నేట్ డెలిగేట్ మాచర్ల సామేలు, ఎక్స్ డెలిగేట్ పులిమెల వెంకయ్య, మాచర్ల బుజ్జిబాబు,పులిమెల అన్నారావు, స్త్రీలు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం ముటుకూరు గ్రామంలోని ఆంధ్రా ఇవాంజిలికల్ క్రీస్తూ లూథరన్ దేవాలయం నందు పాస్టర్ కటికల యేసుదానం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు మరియు అన్ని వర్గాల వారు కలిసి సంతోషంతో ఆనందంతో కీర్తనలు పాడుతూ ఏసు క్రీస్తు ప్రభువు వారిని ఆత్మతో సత్యముతో ఆరాధిస్తూ భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి ప్రేమను కనపరిచారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు అనంతరం ముగింపు ప్రార్థన ఆశీర్వాదాలతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ముటుకూరు జడ్పీ హైస్కూల్ చైర్మన్ కుక్కమూడి మరియదాసు, కుక్కమూడి ఏసోబు మాచర్ల వసంత్, మాజీ ఎంపీటీసీ మాచర్ల పురుషోత్తం, పిసిసిలు పులిమెల జక్రయ్య, మాచర్ల చిన్న పేరయ్య సంఘ పెద్దలు,స్త్రీలు పురుషులు, సండే స్కూల్ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.







# అయిదు తరాల అపురూప సమ్మేళనం

## ఒక్క వేదికపైకి చేరిన 200 మంది

## కొంతం కిష్టయ్య కుటుంబ వారసులు ఆదర్శం



మంథని,డిసెంబర్-25 నేటి శుభోదయ: ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయి విలువలు ప్రశ్నార్థకమవుతున్న ప్రస్తుత తరుణంలో ఇదొక అపురూప సన్నివేశం. ఒకే కుటుంబానికి చెందిన దాదాపు 200 మంది ఒక వేదికపై కలుసుకుని ఆనందానుభూతిని పొందిన సందర్భమిది. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన కొంతం కిష్టయ్య, అమ్మాయి దంపతుల వారసులు గురువారం హైదరాబాద్ కొండాపూర్ లోని అపర్ణా సెరేన్ కమ్యూనిటీ లో కలుసుకున్నారు. 80 ఏళ్ల వృద్ధులు మొదలుకొని 6 నెలల శిశువుల వరకు అయిదు తరాల వారు ఇందులో పాలు పంచుకున్నారు. సామాన్య నేపథ్యం నుంచి మొదలైన ఒక కుటుంబం, కేవలం చదువునే ఆయుధంగా మలుచుకుని ఐదు తరాల సంబరాన్ని జరుపుకోవడం అందరినీ ఆకట్టుకుంటోంది. ఒకప్పుడు ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్న ఈ కుటుంబం నేడు సమాజంలో పదిమందిని నడిపించే నాయకత్వ స్థానాలకు ఎదగడం విశేషం.ఈ అపురూప కలయికలో నాటి కష్టాలను తలుచుకుంటూ, నేటి విజయాలను చూసి ఆ కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు. తమ మూలాలను మరువకుండా, విద్య ద్వారా తలరాతను మార్చుకోవచ్చని నిరూపించిన ఈ ఐదు తరాల ప్రయాణం నేటి సమాజానికి ఒక గొప్ప స్ఫూర్తి. పెద్దల ఆశీస్సులు, పిల్లల ప్రగతి కలగలిసిన ఈ వేడుక ఒక అద్భుత దృశ్యంగా నిలిచింది. ఈ సందర్భంగా కుటుంబ వృక్షాన్ని చిత్రరూపకంగా ప్రదర్శించారు.తర్వాత ప్రతి కుటుంబానికి చెందిన వారు పరిచయం చేసుకున్నారు. ఆటపాటలు, చిన్నారుల కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మంథని ఫ్యామిలీ గ్రూప్ వాట్సాప్ బృందం ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసి విజయవంతం చేసింది. రాష్ట్రంలోని అనేక జిల్లాల నుంచి అనేక వ్యయ ప్రయాసలకోర్చి, చలిని కూడా లెక్క చేయకుండా అంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. కుటుంబ పెద్దల విలువలు, సభ్యులందరి ఫోటోలు, పరిచయాలతో ప్రత్యేక పుస్తకాన్ని ప్రచురించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. విదేశాల్లో ఉంటున్న కుటుంబ సభ్యులు ఆన్లైన్ లో పాల్గొన్నారు. ఇలాంటి వేడుకలు ప్రస్తుతం అత్యంత అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.

# డివైయఫ్ఐ అధ్వర్యంలో ముగ్గులుపోటీలు



వైరా నేటి శుభోదయ: వైరా మండలం వల్లాపురం గ్రామంలో డివై ఎఫ్ ఐ ఆధ్వర్యంలో సి ఎస్ ఐ చర్చి దగ్గర క్రిస్టమస్ పండుగ సందర్భంగా ముగ్గులు పోటీలుకుర్చీఆటలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు గారు సిపిఎం మండల కమిటీ సభ్యులు బాజోజు రమణ సిపిఎం సీనియర్ నాయకులు వనమచిన్న సత్యనారాయణ గారు షేక్ మజీద్ బి షేక్ రెహనాభి గోర్రెముచ్చు నవీన్ గొర్రె ముచ్చు జయరాజు బొల్లం రామయ్య గోర్రెముచ్చు జైపాల్ గోర్రెముచ్చు నాగరాజు గుజ్జర్లపూడి ప్రభాకర్ గోరుముచ్చు జైపాల్ గోర్రెముచ్చు నాగరాజు గొర్రె ముచ్చులాజర్ గొర్రె ముచ్చు శ్రీను బండి కోళ్ల జగదీష్ చింతమాల ఉత్తమ కుమార్ గోర్రెముచ్చు సాయి తదితరులు పాల్గొన్నారు

# మానవాళికి శాంతి సందేశం అందించిన జీసస్

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బత్తుల అంజి



ములకలపల్లి, నేటి శుభోదయ ::: ములకలపల్లి మండల కేంద్రం మరియు రామాంజనేయ పురం ములకలపల్లి గ్రామల్లో ప్రార్థన మందిరాలలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో పాల్గొని జిల్లాలోని క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసిన భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి. వేడుకలలో ముందుగా కేక్ కత్తిరించి విశ్వాసులు అందరికీ క్రీస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి సందేశం అందించిన ఏసుక్రీస్తు జన్మదిన సందర్భంగా వేడుకలలో పాల్గొన్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ క్రీస్తు జననం మానవాళికి అందించిన శాంతి సందేశం క్రీస్తు మార్గంలో నేడు ప్రజా ప్రభుత్వం అన్ని కులాలకు మతాలకు వర్గాలకు ప్రజాపాలన అందిస్తుందని ఈ ప్రభుత్వానికి యేసు ఆశీర్వాదాలు ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి సర్పంచ్ కొర్సా చంద్రలేఖ, ఉప సర్పంచ్ పువ్వాల లలితారావు, వార్డు సభ్యులు ముదిగొండ శీను, ఆత్మ కమిటీ డైరెక్టర్ ఈర్ల సంజీవ్, కాంగ్రెస్ నాయకులు వల్లెపు మహేష్, మాజీ వైస్ ఎంపీపీ గోలి రమణ, అడ్వకేట్ గోలి సందీప్, సాంబ, పెద్దబాబు, విశ్వాసులు పాల్గొన్నారు.




# సిసి కెమెరాల ఏర్పాటుకు లక్ష రూపాయలు వితరణ

## టిఎన్ఆర్ ట్రస్టు చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరావు

## తండ్రికి తగ్గ తనయుడు

## తాండ్ర నారాయణరావు సేవలో తాండ్ర వెంకటేశ్వరావు



ములకలపల్లి, నేటి శుభోదయ ::: ములకలపల్లి మండల పరిధిలోని పొగళ్లపల్లి గ్రామానికి చెందిన తాండ్ర నారాయణరావు తనయుడు ఎన్ఆర్ఐ మరియు టిఎన్ఆర్ ట్రస్టు చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరావు సీసీ కెమెరాల ఏర్పాటు నిమిత్తం ఎస్సై మధు ప్రసాద్ కు లక్ష రూపాయల చెక్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములకలపల్లి మండలంలో జరుగుతున్న నేరాలు, చోరులు నియంత్రణ నేరస్తులను గుర్తించే వీలుగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్సై మధు ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,ఇలా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొచ్చి విరాళాలు అందించడం శుభపరిణామమన్నారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో, చౌరస్తాలు, రహదారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఆర్ ట్రస్టు మెంబర్స్ నరాటి ప్రసాద్, తాండ్ర చిట్టిబాబు, కొదుమూరి పుల్లారావు, పూరేటి నర్సింహారావు పాల్గొన్నారు.

## మల్లు భట్టి విక్రమార్క కి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మనోహర్ బాబు



చింతకాని, నేటి శుభోదయ ::: చింతకాని మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో గురువారం నాడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మరియు మత్కేపల్లి ఏఎంసి చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు నివాసంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విద్యుత్ శాఖ మాత్యులు మల్లు బట్టి విక్రమార్క ను చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు మర్యాదపూర్వకంగా కలిసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో షేక్ షంషుద్దీన్,కోల నాగేశ్వరరావు,ఆడెపు శ్యామ్,కొలుకుల వెంకటేశ్వర్లు,బండి వెంకటేశ్వర్లు, బచ్చు ఖాదర్ బాబు,పొనుగోటి రత్నాకర్,కొడవకంటి మోహన్ రావు, పొనుగోటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో చర్చిలో ప్రార్థనలు



ఏన్కూర్, నేటి శుభోదయం:: మండల వ్యాప్తంగా అని గ్రామాల చర్చిలలో గురువారం క్రైస్తవులు ఘనంగా ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రైస్తవులు బుధవారం రాత్రి నుండే ప్రార్థన మందిరాల వద్ద మహిళలు,పురుషులు, చిన్నారులు ప్రత్యేక ప్రార్థనలను చేశారు. మండల పరిధిలోని ఏన్కూరు, టి ఎల్ పేట, నాచారం, రేపల్లెవాడ, తిమ్మారావుపేట, కేసుపల్లి, గార్ల ఒడ్డు తదితర గ్రామాల్లో ప్రార్థనలు ఘనంగా జరిగాయి. జన్నారం గ్రామంలో గల కల్వరి ఆదరణ మినిస్ట్రీస్ ప్రార్థన మందిరంలో పాస్టర్ సురేష్, సువర్ణల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ.... క్రిస్మస్ అనేది ఎన్నో దేశాలలో గొప్పగా జరుపుకునే పండుగని అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు అభిషేక్, వినయ, ఆయా గ్రామాల క్రిస్టియన్లు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు-జర్నలిజం విద్యార్థుల క్షేత్ర పరిశీలన





సాధనాల వీరేంద్ర నేటి శుభోదయ హైదరాబాద్, కూకట్పల్లి డిసెంబర్ 25, 2025.: తెలంగాణ రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ జర్నలిజం విద్యార్థినీ, విద్యార్థులు క్షేత్రస్థాయి పరిశీలనలో పాల్గొని నివేదికలను అధ్యాపకుల ముందు ప్రదర్శించారు.తెలంగాణ రాష్ట్రంలో మూడు విడతలుగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా విద్యార్థులు వివిధ గ్రామాలను ఎంచుకున్నారు. ముప్పైకి పైగా గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల క్షేత్ర పరిశీలనలో భాగంగా ప్రథమ,ద్వితీయ సంవత్సరం చదువుతున్న జర్నలిజం విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎన్నిక, బలపలిచిన పార్టీల మద్దతు, అభ్యర్థుల బలాలు, బలహీనతలు. అభ్యర్థుల గెలుపోటములకు సహకరించిన వివిధ కారణాలు, ఏకగ్రీవమైన విధానం, ప్రచార తీరు,సరళి, ప్రచార సాధనాలు, ప్రలోభాలు హామీలు, ఓటర్ల తీరుతెన్నులతోపాటు వివిధ అంశాలను విద్యార్థులు పరిశీలించారు.అలాగే గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన విద్యార్థులు డిసెంబర్ 24న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ, బాచుపల్లి లో క్షేత్ర పరిశీలన ద్వారా తాము నమోదు చేసిన అంశాలను అధ్యాపకులు ముందు ప్రదర్శించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులను డాక్టర్ షేక్ హసీనా, ద్వితీయ సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులను డాక్టర్ షేక్ షమీర్ ప్రాక్టికల్స్ ఇంచార్జ్ గోపాల్ పర్యవేక్షించారు. వివిధ గ్రామాల్లో క్షేత్ర ప్రదర్శనకు వెళ్ళిన విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా తమ నివేదికలను అధ్యాపకులు తోటి విద్యార్థినీ, విద్యార్థులు మధ్య ప్రదర్శించటం గొప్ప అనుభూతులు పంచిందని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన అనేక రకాల అనుభూతులను అనుభవాలను, మిగిల్చడంతో పాటు రిపోర్టును తయారు చేయడంలో క్లాస్ రూమ్ లో నేర్చుకున్న, కమ్యూనికేషన్ రిపోర్టింగ్ పాఠాలు విషయసేకరణకు తోడ్పడటంతో పాటు ఎడిటింగ్ పాఠాలు రిపోర్టు తయారు చేయడానికి ఉపయోగపడ్డాయని విద్యార్థినీ, విద్యార్థులు తెలియజేశారు. జర్నలిజం క్లాస్ రూమ్ పాఠాలతో పాటు ఇటువంటి క్షేత్రస్థాయి పరిశీలనలు జర్నలిజం విద్యార్థినీ, విద్యార్థులకు నైపుణ్యాలను మెరుగుపరచడంతో పాటు నైపుణ్యం కలిగిన రిపోర్టర్లను,ఎడిటర్లను వెలుగులోకి తెస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి అవకాశాన్ని కలిగించిన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య డాక్టర్ వెల్దండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య డాక్టర్ కోట్ల హనుమంతరావు, హెచ్ ఓ డి ఆచార్య డాక్టర్ పద్మప్రియలకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ జర్నలిజం విభాగం విద్యార్థిని,విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేశారు.

## ఘనంగా ఆయన సన్నిధి పెంతుకోస్తు మినిస్ట్రీస్ వారి క్రిస్మస్ వేడుకలు



డిసెంబర్ 25 శేరి లింగంపల్లి నేటి శుభోదయప్రతినిధి: శేరిలింగంపల్లి నియోజక వర్గం హఫీజ్ పెట్ డివిజన్ అంబేద్కర్ నగర్ లో గల ఆయన సన్నిధి పెంతుకోస్తు మినిస్ట్రీస్ క్రిస్మస్ వేడుకలను పాస్టర్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రార్థన గీతాలతో యేసు క్రీస్తు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాస్టర్ ఇమ్మానియేల్ ప్రసంగించారు. యేసు క్రీస్తు ప్రభువు గురించి దాసులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన మార్గం ప్రేమ, దయ ,కరుణ లను కలిగి ఉండి తోటి వారి మేలు కోరి , క్షమా గుణం కలిగి ఉండాలనీ ఈ సందర్భంగా తెలిపారు అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో సంఘ సభ్యులు బస్తివాసులు పాల్గొన్నారు.



# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న

## నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.రేకులపల్లి భూపతి రెడ్డి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ డిసెంబర్ 25 నేటి శుభోదయ: నిజామాబాద్ రూరల్ మండలం ముబారక్ నగర్‌లోని జీసస్ లవ్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ఎమ్మెల్యే,క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కేక్ కట్ చేసి క్రైస్తవులకు తినిపించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీలకు పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. క్రిస్మస్ వేడుకల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.21 కోట్ల నిధులు కేటాయించిందని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని చర్చిలకు కలర్ లైటింగ్ కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశామని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా ఒకే రోజు జరుపుకునే క్రిస్మస్ పండగ ఏసు ప్రభువు జన్మదినాన్ని సూచిస్తుందని,ఈ పవిత్ర వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ప్రతి కుటుంబానికి శాంతి,సుఖసంతోషాలు కలగాలని ఏసు ప్రభువును ప్రార్థిస్తున్నానని తెలిపారు.ప్రతి చర్చిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేశామని గుర్తు చేశారు.చర్చ్ ఫాదర్ ప్రతినిధులు రోడ్డు అవసరం ఉందని కోరగానే వెంటనే రోడ్డు పనులు చేపట్టామని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందుతున్నాయని,కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీగా అన్ని మతాలు,అన్ని కులాలను సమానంగా చూస్తుందని ఎమ్మెల్యే భూపతి రెడ్డి స్పష్టం చేశారు.ప్రభుత్వం క్రిస్టియన్ లను ఎంతగా ఆదరిస్తుందో,కాంగ్రెస్ పార్టీకి కూడా అంతే ఆశీర్వాదం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పె గంగారెడ్డి,మైనార్టీ శాఖ చైర్మన్ శ్రీనివాస్,మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి,ఫిషరీస్ చైర్మన్ శ్రీనివాస్,చర్చ్ ఫాదర్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.



# అంతారం సర్పంచ్,వార్డు సభ్యులకు సన్మానం

## మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్



తలకొండపల్లి డిసెంబర్ 25: నేటిశుభోదయ: తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్,వార్డు సభ్యులు గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తలకొండపల్లి మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు.తలకొండపల్లి మండల పరిధిలోని అంతారం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ తరఫున స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసి సర్పంచిగా బైరపాక జంగమ్మ బాలస్వామీ,వార్డు సభ్యులుగా బోరిగే కుమార్,బోరిగే మంజుల,భావాని యువరాజు,పిట్టల లక్ష్మీ లక్ష్మయ్యలు విజయం సాధించారు.ఈ సందర్భంగా గురువారం వారిని సిఎల్ శ్రీనివాస్ యాదవ్ నివాసంలో శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన సర్పంచ్,వార్డు సభ్యులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కృషి చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా పని చేయాలని పేర్కొన్నారు.అనంతరం సిఎల్ శ్రీనివాస్ యాదవ్‌ను నూతన సర్పంచ్ వార్డు సభ్యులు శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో అంతారం నాయకులు తిరుపతయ్య,కావాలి యాదగిరి తదితరులు ఉన్నారు.

# శ్రీ సరస్వతి శిశు మందిర్లో ఆర్ఎస్ఎస్ 100 ఏండ్ల శతాబ్ది ఉత్సవాలు




మంథని, డిసెంబర్-25 నేటి శుభోదయ: మంథనిలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో,రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) 100 ఏండ్ల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా భారతి అఖిల భారతీయ శిక్ష సంస్థ ఆధ్వర్యంలో సప్తశక్తి సంఘం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ దుర్గావాహిని పెద్దపెల్లి జిల్లా కన్వీనర్ పూర్వ విద్యార్థిని సభ్యురాలు కోట తిరుమల మాట్లాడుతూ మహిళలలో కుటుంబ ప్రబోధన్, పర్యావరణంపై భారతీయ దృష్టి కోణాన్ని వివరించారు. భారతీయ సనాతన ధర్మ ఆచారాలను మహిళలు కచ్చితంగా పాటించవలసిన అవసరం ఉంది అని తెలిపారు. కుటుంబ వ్యవస్థను కాపాడే బాధ్యతను ఆదర్శవంతమైన ఇంటి మహిళగా స్వీకరించాలన్నారు. పిల్లలు సక్రమ మార్గంలో పెరగాలన్న వారిని ఆదిపరాశక్తులుగా తీర్చిదిద్దాలన్న ఇంట్లో మహిళలదే కీలకపాత్ర అన్నారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి పెద్దపెల్లి జిల్లా కన్వీనర్ తారాబాయి సప్తశక్తి సంఘం కార్యక్రమం గురించి మాట్లాడుతూ స్త్రీలలో దాగివున్న సప్తశక్తుల గురించి వివరించడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమం నిర్వహణలో భూపతిరత్నాంజలి , విశిష్ట అధ్యక్షులుగా కర్నే ప్రసూన్న పాల్గొనడం జరిగింది. కార్యక్రమం అనంతరం ప్రశ్నోత్తరాలు అడిగి మహిళలకి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. వచ్చినా మహిళలు తమ కార్యక్రమం గురించి వారి అనుభవాలను వివరించడం జరిగింది. చిన్నారులు మన వీరనారీమణుల వేషధారణలతో ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయలు, సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# విద్యుత్ షాక్ తో ఆవు మృతి



**అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ కు భద్రత ఏర్పాట్లు చేయండి.**

**ఆర్థిక సహాయం చేయగలరని రైతు వేదన.**

**విద్యుత్ అధికారులు భద్రత ఏర్పాట్లు చేయాలి**

**- సర్పంచ్ బుర్రి స్వప్న భూపాల్ రెడ్డి.**

కేశంపేట ప్రతినిధి నేటి శుభోదయ: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం పోమాల్ పల్లి గ్రామంలో నిదురం జంగయ్య కు చెందిన ఆవు గురువారం సాయంత్రం విద్యుత్ షాక్ కొట్టడంతో ఆవు మృతి చెందినట్లు సర్పంచ్ బుర్రి స్వప్న భూపాల్ రెడ్డి మీడియా కు తెలిపారు.ఆవు మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ ఆవుకు తగలడంతో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందిందట్లు రైతు అంటున్నారు.విద్యుత్ వైర్లు కిందకు ఉండటం,అందులోను ట్రాన్స్ఫార్మర్ కు కంచె లేకపోవడం వల్లనే ఈ ఘటన జరిగి ఉంటుందని భూపాల్ రెడ్డి అన్నారు.మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ. 60 వేల వరకు ఉంటుందని,సర్పంచ్ భూపాల్ రెడ్డి తెలిపారు.ప్రభుత్వం స్పందించి తనకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు...

## జనవరి 12 న ఎన్జీజివోస్ ఎన్.టీ.ఆర్ జిల్లా శాఖ ఎన్నికలు

### 3 వ తేదీ నామినేషన్ల స్వీకరణ

### ఎన్నికల అధికారి కె.జగదీశ్వరరావు



విజయవాడ,డిసెంబర్ 25 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): ఏపీ ఎన్జీజివోస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా శాఖకు ఎన్నికలకు నోటిఫికేషన్ ను విడుదల చేస్తున్నట్లు ఎన్నికల అధికారి ఏపీ ఎన్జీజివోస్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కె.జగదీశ్వరరావు తెలిపారు. ఏపీ ఎన్జీజీఓస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను ఈనెల 29 న ఎన్జీజీవోస్‌హెూమ్ నందు పబ్లిష్ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎన్నికలకు నామినేషన్లు జనవరి 3 వ తేదీన స్వీకరించడం జరుగుతుందన్నారు. జిల్లా శాఖకు సంబంధించి ఒక అధ్యక్షుడు ఒక సహధ్యక్షులు ఒక కార్యదర్శి ఒక కోశాధికారి,ఒక కార్యనిర్వాహక కార్యదర్శి ఐదు ఉపాధ్యక్షులు ఒక మహిళా ఉపాధ్యక్షురాలు -ఐదు సంయుక్త కార్యదర్సులు ఒక మహిళ సంయుక్త కార్యదర్శి కలిపి మొత్తం 17 పోస్టులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు నోటిఫికేషన్ లో ఆయన పేర్కొన్నారు. జనవరి 3 వ తేదీన నామినేషన్లు స్వీకరిస్తామని, అదేరోజు నామినేషన్ల పరిశీలన, అర్హుల జాబితా ప్రచురణ, నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా ప్రచురణ నిర్వహిస్తామన్నారు. ఒక్కొక్క పోస్ట్ కు ఒక నామినేషన్ మాత్రమే దాఖలు అయితే అదే రోజున ఏకగ్రీవం గా ఎన్నిక అయినట్లు ప్రకటిస్తామని ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలు చేస్తే 12 వ తేదీన ఎన్నికలు నిర్వహించి అదేరోజు కౌంటింగ్ అనంతరం ఫలితాలను ప్రకటించడం జరుగుతుందని ఎన్నికల అధికారి కె.జగదీశ్వరరావు తెలిపారు.ఈ ఎన్నికలలో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సహాయ ఎన్నికల అధికారిగా రాష్ట్ర సంఘ ప్రచార కార్యదర్శి శ్రీమతి బి.జానకి పర్యవేక్షకుడిగా రాష్ట్ర కార్యదర్శి వి.సుబ్బారెడ్డి లు వ్యవహరిస్తారని ఎన్నికల అధికారి జగదీశ్వరరావు పేర్కొన్నారు.

## షాద్‌నగర్-కేశంపేట్ రోడ్డులో రైల్వే గేట్ సమస్యపై ఎంపీ దృష్టికి ప్రజల వినతి



షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి డిసెంబర్ 25 : షాద్‌నగర్ పట్టణం మీదుగా వెళ్లే షాద్‌నగర్-కేశంపేట్ ప్రధాన రోడ్డులో ఉన్న రైల్వే గేట్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల రెండు నుంచి మూడు సార్లు రైల్వే గేట్ రిపేర్ల పేరుతో ఐదు నుంచి ఆరు రోజుల పాటు మూసివేయడం వల్ల పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు, రైతులు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. గేట్ మూసివేత కారణంగా ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయని, వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటున్నాయని, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సమయానికి చేరలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో గౌరవ ఎంపీ గారు స్వయంగా షాద్‌నగర్-కేశంపేట్



రోడ్డులోని రైల్వే గేట్‌ను పరిశీలించి, నాణ్యత ప్రమాణాలతో శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. తక్షణమే రైల్వే గేట్ మరమ్మతులు పకడ్బందీగా చేపట్టాలని, దీర్ఘకాలికంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా అండర్‌పాస్ లేదా చిన్న వంతెన (ఫ్లైఓవర్/బ్రిడ్జ్) నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

## సర్వమానవాళికీ గొప్ప శుభదినం

### షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"

### సీఎస్కేలో రవితేజ స్వగృహంలో క్రిస్మస్ వేడుకలు

### హాజరైన స్థానిక నాయకులు తదితరులు



షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి డిసెంబర్ 25: ఆత్మస్వరూపుడు శరీరధారిగా ఏతెంచిన రోజు.. సర్వమానవాళికీ గొప్ప శుభదినం ఇదనీ.. శుభవార్త ప్రకటించిన దేవుని దూతలు.. మానవులతో దేవుడు తిరిగి మమేకమైన రోజు.. దేవుడు ఈ లోకాన్ని ఎంతగానో ప్రేమించాడనీ షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని షాద్ నగర్ పట్టణంలో సిఎస్కెలో షాద్ నగర్ నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీ కోఆర్డినేటర్ రవితేజ నివాసంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో గిరిజన ఆదివాసి రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్, పట్టణ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్ ఫరక్ నగర్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఇబ్రహీం, మహబూబ్,ఇసాక్, గంగమ మోనిసత్తయ్య, శేఖర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచానికి శాంతి ప్రేమలను చూపిన మహనీయుడు యేసుప్రభువు

### గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్



గన్నవరం, డిసెంబర్ 25 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): ప్రపంచానికి శాంతి ప్రేమలను చూపిన మహనీయుడు ఏసుప్రభువు అని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కొనియాడారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ ఏసు చూపిన మార్గంలో అందరూ పయనించి సమాజంలో శాంతి నెలకొల్పేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది ప్రజలు జరుపుకునే పండుగ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బొమ్ములూరు గ్రామ సర్పంచ్ కాటూరి విజయభాస్కర్, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, టిడిపి నాయకులు మున్నంగి బాబురావు, గండేపూడి నితీష్, అన్నే చైతన్య, నత్త కనకయ్య, పచ్చిగళ్ళ శ్రీనివాసరావు,తానంకి వినయ్, మాతంగి వెంకటేశ్వరరావు, చొదిమెళ్ల రాజశేఖర్, గాలంకి కిరణ్, బుద్దాల రాజు, జీవరత్నం,బట్టు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఒడిస్సాలో ఆరుగురు మావోయిస్టు మృతి

## మృతుల్లో తెలంగాణ వాసి

హైదరాబాద్ , నేటి శుభోదయ ::: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రం మొత్తాన్ని మావోయిస్టు రహితంగా మార్చేందుకు గత





కొన్ని నెలలుగా దశలవారీగా పలు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో కంధమాల్ జిల్లాను కూడా పోలీస్ డైరెక్టర్ జనరల్ పలుమార్లు సందర్శించి వ్యూహాన్ని సిద్ధం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని కంధమాల్ జిల్లాలో



మావోయిస్టుల నిర్మూలన కోసం తీవ్ర స్థాయి ఆపరేషన్ ప్రారంభించారు. నిన్నటి నుంచి జిల్లాలోని రెండు ప్రాంతాల్లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య తీవ్ర కాల్పుల మార్పిడి జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో 6 మంది క్యాడర్ మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో ఒడిశాలో కీలక నేతగా ఉన్న కేంద్ర కమిటీ సభ్యుడు గణేష్ ఉయికె (69) కూడా ఉన్నారు. ఆయన తలపై రూ.1 కోటి 20 లక్షల బహుమతి ప్రకటించబడింది. మృతుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు కూడా ఉన్నారు. కంధమాల్ జిల్లా చకపాడ్ పోలీస్ స్టేషన్ పరిధి లోని కంధమాల్-గంజాం సరిహద్దులోని రాంభా అటవీ ప్రాంతంలో మావోయిస్టుల చలనం ఉన్నట్టు రాష్ట్ర గూఢచారి విభాగం పోలీసులకు సమాచారం ఇచ్చింది. మావోయిస్టులను అదుపులోకి తీసుకునేందుకు 20 ఎస్ఓజీ, 2 సీఆర్‌పీఎఫ్, 1 బీఎస్ఎఫ్ బృందాలతో కలిపి మొత్తం 23 బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు వెంటనే ఆపరేషన్‌కు బయలుదేరాయి. గురువారం ఉదయం భద్రతా దళాలు-మావోయిస్టులు ఎదురెదురుగా తలపడ్డారు. ఇరువర్గాల మధ్య తీవ్ర కాల్పులు జరిగాయి. అనంతరం సెర్చ్ ఆపరేషన్‌లో 4 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. వాటిలో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు గణేష్ ఉయికే మృతదేహం



కూడా ఉంది. గణేష్ తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా చేందూర్ మండలం పుల్లెం గ్రామానికి చెందినవాడు. ఒడిశాలో మావోయిస్టు కార్యకలాపాల ప్రధాన నాయకుడిగా పనిచేశాడు. గణేష్ మావోయిస్టు సంఘటనా లో పలు పేర్లతో ప్రసిద్ధి చెందాడు. రూపా, రాజేష్ తివారి, చమురు, పక్కా హనుమంత వంటి పేర్లతో ఆయనను పిలిచేవారని గురువారం కంధమాల్ జిల్లా ఎస్పీ హరీష్ బి.సి. తెలిపారు. మిగిలిన ముగ్గురు మృతుల్లో ఇద్దరు మహిళలు కాగా, వారి గుర్తింపు నిర్ధారణ కాలేదు. మృత మావోయిస్టుల వద్ద నుంచి 2 ఇన్సాస్ రైఫిళ్లు, ఒక .303 రైఫిల్ స్వాధీనం చేసుకున్నారు. సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం మరో 4 మంది మావోయిస్టులు కూడా మృతి చెందినట్టు తెలిసినప్పటికీ, దీనిని పోలీసులు అధికారికంగా నిర్ధారించలేదు. ఈ





అంశంపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది. అలాగే, గత కొంతకాలంగా ఆ ప్రాంతంలో మావోయిస్టులు ఎందుకు పెద్ద సంఖ్యలో కూడగట్టుకున్నారు అన్న దానిపై కూడా విచారణ ప్రారంభించారు. బుధవారం రాత్రి తుముడిబంధ బ్లాక్‌లోని బెల్ఘర్ పోలీస్ స్టేషన్ పరిధి పెడమ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు దాగి ఉన్నట్టు



గూఢచారి సమాచారం అందింది. వెంటనే అక్కడ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. పోలీసులు సాదా దుస్తుల్లో కనిపించడంతో మావోయిస్టులు రాత్రివేళ కాల్పులు ప్రారంభించారు. భద్రతా దళాలు ప్రతికాల్పులు జరిపాయి. ఇరువర్గాల మధ్య దీర్ఘకాలం కాల్పుల మార్పిడి జరిగింది. అనంతరం సెర్చ్ ఆపరేషన్‌లో ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. వారు రాయగడకు చెందిన రాకేష్, బీజాపూర్‌కు చెందిన అమృత్‌గా గుర్తించారు. వీరిద్దరి తలపై మొత్తం రూ.23.65 లక్షల బహుమతి రాశి ప్రకటించబడింది.

## కమ్మ సంఘాల సమాఖ్య క్యాలెండర్ ను ఆవిష్కరించిన

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, నేటి శుభోదయ ::: కమ్మ సంఘాల సమాఖ్య తెలంగాణ వారి 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. హైదరాబాద్ లో గల బంజారాహిల్స్ మినిస్టర్స్ కోర్టర్స్ లో ఆవిష్క రించారు. తెలుగు వారి అభివృద్ధి కోసం కమ్మవారు ఎంత గానో కృషి చేసారని, ఏ రంగం లో ఉన్నా కమ్మ వారు ఆ రంగానికి వన్నె తెస్తారని మంత్రి తుమ్మల అన్నారు. రాబోయే కొత్త సంవత్సరం రాష్ట్రానికి , తెలుగు వారికి అంతా మంచి జరగాలని తుమ్మల అన్నారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ కమ్మ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బొడ్డు రవిశంకర్ రావు, గౌరవ సలహాదారు లు బండి రమేష్ ,టీపీసీసీ ఉపాధ్యక్షులు, కలగర శ్రీనివాసరావు , టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వేముల పృద్వి చౌదరి , సమాఖ్య ప్రధాన కార్యదర్శి గంగ వరపు రామ కృష్ణ ప్రసాద్ ,కోశాధికారి





కం డెపనేని రత్నాకర్ రావు, ఉపాధ్యక్షులు బిక్కసాని నాగేశ్వరరావు, కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు, కార్య వర్గ సభ్యులు వడ్డే చిరంజీవి, దోనవల్లి వేణు గోపాల్ రావు, రాష్ట్రం లోని కమ్మ సంఘాల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ,ప్రతినిధులు సుమారు 300 మంది పాల్గొన్నారు. కమ్మ సంఘాల సమాఖ్య కార్య వర్గం 2026 కొత్త సంవత్సరం లో కమ్మ వారికి మంచి జరగాలని , కమ్మ వారు అందరికి నూతన సంవత్సర శుభాకంక్షాలు తెలిపారు.

## శివారెడ్డి పేట లో అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు



నేటి శుభోదయ వికారాబాద్ 25 డిసెంబర్ : వికారాబాద్ జిల్లా వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శివారెడ్డిపేట్ ప్రాంతంలో శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడింది. ఈ ఉత్సవానికి ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, వేడుకను అర్థవంతంగా నిలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు, శ్రద్ధగా ఉపవాస దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములు, మరియు శ్రీ అయ్యప్ప సేవా సమితి సభ్యులు భాగస్వామ్యంగా పాల్గొన్నారు. ఊరేగింపు సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించబడిన ఆభరణాలతో కూడిన అయ్యప్ప విగ్రహాన్ని భక్తులు ఊరేగించారు. దారిపొడవునా నినాదాలు, భజనలు, సంగీతం, మంగళ వాయిద్యాలతో శోభను చేకూర్చారు. ఈ కార్యక్రమం భక్తుల నిబద్ధతకు, సంస్కృతి పరంపరల నిలుపుదలకు నిదర్శనంగా నిలిచింది. భక్తులు ఆధ్యాత్మికంగా ఒకటై, సమూహంగా ప్రార్థనల్లో పాల్గొన్న తీరు సందడి మధ్యలో ఉన్న శాంతి భావాన్ని గుర్తు చేసింది. కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించబడ్డాయి. ఈ విధంగా, అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు శివారెడ్డిపేట్ ప్రజల మదిలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని, సామూహిక భక్తిసంఘటనను కలిగించిన ఘన సంఘటనగా నిలిచింది.

## వాజ్ పేయ్ ఆదర్శనీయుడు

### బీజేపీ నాయకులు వై.శ్రీదర్



రాజేంద్రనగర్ నేటి శుభోదయ: మాజీ ప్రధాని వాజ్ పేయ్ నేటి యువతకు ఆదర్శమని బీజేపీ నాయకులు వై.శ్రీదర్ అన్నారు. గురువారం భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి జయంతి కార్యక్రమం రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ ముదిరాజ్, బొక్క బాల్ రెడ్డి, కోరని సదానంద్, మల్లేష్ యాదవ్, సోల్కర్ రెడ్డి, రాహుల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి,యు.పవన్, రమణ, శ్రీనివాసరెడ్డి, మాగాణి శివ, సరిత, అంబిక,పద్మావతి,తిరుమలేష్,గౌరీ దేవి,వేణు, గోపాల్, జంగయ్య, అల్లీశివ, నరసింహ,జ్ఞానేశ్వర్,రమాకాంత్,కర్ణాకర్ గౌడ్,రాజారెడ్డి,సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'కూటమి ప్రభుత్వ సారధ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సర్వతో ముఖాఅభివృద్ధి సాధిస్తుంది..'

### టిడిపి జిల్లా అధ్యక్షునిగా 'బొడ్డు' నియామకం శుభ పరిణామం..

### అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు..

### హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్ర తెలంగాణ మహిళా చైర్మన్, టిడిపి జిల్లా ఎస్సీ సెల్ సెక్రెటరీ డాక్టర్ ఖండవల్లి లక్ష్మి..




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి ( ఏ.కె): తెలుగుదేశం పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులుగా రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్, 'రుడా' చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరిని పార్టీ అధిష్టానం నియమించడం ఎంతో శుభపరిణామమని.. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్ర తెలంగాణ మహిళా చైర్మన్, టిడిపి జిల్లా ఎస్సీ సెల్ సెక్రెటరీ, ఆల్ ఇండియా షెడ్యూల్ కులాల రాష్ట్ర మహిళా ప్రెసిడెంట్, సిటీ క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్



ఖండవల్లి లక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని నమ్ముకుని సేవలు అందించిన వారికి ఎప్పటికైనా మంచి స్థానం లభిస్తుందని విద్యావంతుడు, సామ్యుడు 'బొడ్డు' నియమకమే దానికి ఉదాహరణని పండుగ లక్ష్మి స్పష్టం చేశారు. జిల్లాలో పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు, పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్న నాయకులు, కార్యకర్తలకు మంచి రోజులు రానున్నాయని ఈ సందర్భంగా ఆమె ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, 'రుడా' చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి సారధ్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు, కూటమి నేతలకు ఖండవిల్లి లక్ష్మీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. బొడ్డు వెంకటరమణ చౌదరి, బత్తుల బలరామకృష్ణలతో పాటు తన రాజకీయ గురువు పెందుర్తి వెంకటేష్, కూటమి సీనియర్ నేతలు అందరకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని, రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి సాదించాలని ఆకాంక్షిస్తున్నట్లు లక్ష్మీ పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భంగా లక్ష్మికి క్రైస్తవ సంఘాల నేతలు, గ్రామస్తులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు.

## రిటైర్డ్ డి ఎస్పీ ఉమామహేశ్వర రావు మృతి



ఖమ్మం, నేటి శుభోదయ ::: పోలీస్ శాఖ లో ఉమ్మడి ఖమ్మం జిల్లా లో వివిధ హెూదాల్లో పని చేసి ఆంధ్రప్రదేశ్ లో డి ఎస్పీ గా రిటైర్ అయిన ఉప్పలపాటి ఉమా మహేశ్వర రావు గురువారం ఆసుపత్రి లో చికిత్స పొందుతు మృతి చెందారు. ఆయన గతం లో ఏన్కూర్ లో ఖమ్మం ట్రాఫిక్ లో ఎస్సైగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎన్ టి పీసీ కోరుట్ల లలో ఎస్సైగా కొంతకాలం చింతూరు, పాల్వంచ లో సీఐ గా పని చేశారు 610జి వో లో ఆంధ్రప్రదేశ్ కు బదిలీ అయ్యారు. అక్కడ డి ఎస్పీగా రిటైర్ అయ్యారు. కిడ్నీ సంబంధతావ్యాధి తో బాధపడుతున్నారు. చికిత్స పొందుతూ విజయవాడ లో గురువారం తుది శ్వాస విడిచారు.ఆయన 1988 బ్యాచ్ ఎస్సై. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## పాక హనుమంతు నేపథ్యం

హైదరాబాద్ , నేటి శుభోదయ ::: కాంద మాల్ జిల్లాలో జరిగిన ఎన్కౌంటర్లో భద్రత దళాలు ఆరుగురులో సెంట్రల్ కమిటీ సభ్యుడు ( సీసీఎం ) పాక. హనుమంతు ఇతనిపై కోటి రూపాయలు రివార్డు కలదు. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చందూర్ మండలం పుల్లెం ల గ్రామానికి చెందిన మావోయిస్టు నాయకుడు గణేష్ ఉయకే(63) గురుంచి ఏడు రాష్ట్రాల్లో పోలీసు సిబ్బంది సోదాలు నిర్వహించేవారు. గణేష్ సౌత్ జోన్ ఇన్చార్జిగా ఉన్నారు. గణేష్ ఉయకే మావోయిస్టు సంస్థలో సెంట్రల్ కమిటీ సభ్యుడుగా చాలా సీనియర్, సైదాంతిగా శిక్షణ పొందిన క్యాడర్ సభ్యుడు. గత నలభై సంవత్సరాలుగా మావోయిస్టు సంస్థ తో సంబంధం కలిగి ఉన్నారు. సంస్థ అనేక ముఖ్యమైన విభాగాల్లో చురుకైన పాత్ర పోషించారు. మావోయిస్టు సంస్థ విద్యార్థి విభాగంగా పరిగణించబడే రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ ( ఆర్ ఎస్ యు )వ్యాప్తి బాధ్యతతో గణేష్1980 ప్రారంభంలో చత్తీస్గఢ్లోని జగదల్పూర్ వచ్చారు. కళాశాల విద్యార్థుల్లో మావోయిస్టు సిద్ధాంతాలను భావజాలాన్ని వ్యాప్తి చేయటం ఆయన లక్ష్యం.

## ఒడిశా ఎన్‌కౌంటర్ పై స్పందించిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా



హైదరాబాద్, నేటి శుభోదయ ::: ఈ ఎన్‌కౌంటర్ తో నక్సల్ రహిత రాష్ట్రంగా ఒడిశా అడుగులు వేస్తోంది వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ లోగా మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని పేర్కొన్నారు.

## ఘనంగా వానరాశి వెంకటేష్ జన్మదిన వేడుకలు

### హాజరైన మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్





(నేటి శుభోదయ): తలకొండపల్లి మండల పరిధి వెల్జాల్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు వానరాశి వెంకటేష్ జన్మదిన వేడుకలు ఘనంగా గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వెల్జాల్. బస్టాండ్ అలాగే రామశిపల్లి మైసమ్మ తల్లి ఆవరణంలో కేక్ కట్ చేసివృద్దులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తలకొండపల్లి మాజీ ఎంపీపీ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిఎల్. శ్రీనివాస్ యాదవ్ బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు వానరాశి వెంకటేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం సాయంత్రం బిపిఎల్ వెల్జాల్ ప్రీమియర్ లీగ్ యువకులు గ్రౌండ్లో ప్రత్యేకంగా తయారు చేయించిన కేకుతో వనరసి వెంకటేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సర్పంచులు యువకులు వెంకటేష్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఖో-ఖో క్రీడాకారులకు పసుమర్తి చందర్ రావు చేయూత



**కీ"శే" పసుమర్తి పద్మావతి జన్మదినం సందర్భంగా 15 మంది ఖో-ఖో క్రీడాకారులకు క్రీడా దుస్తుల పంపిణీ క్రీడాకారులు కు అండగా నిలుస్తూ క్రీడలను ప్రోత్సహిస్తున్న కల్లూరు మండల సీనియర్ క్రీడాకారులు**

ఖమ్మం, నేటి శుభోదయ ::: కల్లూరు గ్రామ పెద్దలు, సీనియర్ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు, క్రీడా అభిమానులు పసుమర్తి చంద్రరావు సతీమణి, కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ, మాజీ సర్పంచ్ కీ"శే" పసుమర్తి పద్మావతి జన్మదిన సందర్భంగా గురువారం కల్లూరులోని పిఎం ఎస్ హెచ్ ఆర్ ఐ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 15 మంది ఖో-ఖో క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పసుమర్తి చంద్రరావు విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించి, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని మంచి పేరు సంపాదించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు వాకర్ అసోసియేషన్ సభ్యులు చారుగుండ్ల వెంకటేశ్వరరావు, దోసపాటి కృష్ణార్జునరావు , కృష్ణ తదితరులు పాల్గొని ఖో-ఖో క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేశారు. సుమారు ఆరు వేలు రూపాయల విలువైన దుస్తులు క్రీడల్లో రాణిస్తున్న నిరుపేద క్రీడాకారులకు తమ చేయూతను అందించారు. ఈ సహాయానికి గాను వ్యాయామ విద్యా విభాగం పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విద్యా శిక్షకులు పసుపులేటి వీర రాఘవయ్య, పీడీ బోడ భీమా, బ్యాడ్మింటన్ శిక్షకుడు తల్లపురెడ్డి గౌతం, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు గోపాలం నాగరాజు, ఎన్. నాగబాబు, వీరు తదితరులు పాల్గొన్నారు.











## ఢిల్లీలో రెండు రోజులుంటే నాకు ఇన్ఫెక్షన్స్ వస్తాయి

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో గాలి కాలుష్యం విపరీతంగా ఉంటుంది. ప్రపంచంలో అత్యంత గాలి కాలుష్య నగరాల్లో ఢిల్లీ మొదటిస్థానంలో ఉంటుంది. తాజాగా ఢిల్లీ వాయుకాలుష్యంపై కేంద్ర రవాణాశాఖా మంత్రి నితీన్ గడ్కారీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో ఉంటే తనకు ఇన్ఫెక్షన్స్ వస్తాయని గడ్కరీ వ్యాఖ్యానించారు. మంగళవారం ఉదరు మహూర్కర్ రాసిన 'మై ఐడియా ఆఫ్ నేషన్ ఫస్ట్ - రీడిఫైనింగ్ అన్‌లార్డు నేషనలిజం' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడుతూ..'ఢిల్లీలో రెండు రోజులుంటేనే అక్కడున్న గాలి కాలుష్యానికి నాకు ఇన్ఫెక్షన్లు వస్తున్నాయి. ఈరోజు నిజమైన జాతీయవాదం ఏదైనా ఉంటే.. అది దిగుమతుల్ని తగ్గించడం.. ఎగుమతుల్ని పెంచడంలో ఉంది. నేను కేవలం రెండురోజులే ఢిల్లీలో ఉంటాను. కాలుష్యానికి ఇన్ఫెక్షన్లు వస్తున్నాయి. ఎందుకు ఢిల్లీ కాలుష్యంతో ఎందుకింత బాధపడుతుంది? నేను రవాణామంత్రిగా చెబుతున్నాను. ఢిల్లీలో తీవ్ర కాలుష్యానికి 40 శాతం రవాణా రంగమే' అని ఆయన అన్నారు. శిలాజ ఇంధనాల్ని దిగుమతి చేసుకోవడానికి సంవత్సరానికి 22 లక్షల కోట్లను ఖర్చు చేస్తున్నాం. ఇది ఎలాంటి జాతీయవాదం? పైగా ఆర్థిక భారం కూడా. ఈ ఇంధనాలతో మన దేశాన్ని కలుషితం చేసుకుంటున్నాము. దీనికి ప్రత్యామ్నాయంగా డీజిల్, గ్యాస్‌తో నడిచే వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్, హైడ్రోజన్ శక్తితో నడిచే వాహనాల వైపు మళ్లాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.


## వెనిజులాపై అమెరికా అక్రమ దిగ్బంధనాన్ని ఖండించిన రష్యా

జెనీవా : వెనిజులాపై అమెరికా దురాక్రమణపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యుఎన్ఎస్‌సి) మంగళవారం చర్చ చేపట్టింది. ఈ సమావేశంలో అమెరికా 'అక్రమ దిగ్బంధనం'ను రష్యా ఖండించింది. ఇది ప్రాంతీయ శాంతికి ముప్పు కలిగించడమే కాకుండా అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘిస్తోందని పేర్కొంది. డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవాలనే తప్పుడు సాకుతో అమెరికా కరేబియన్ జలాల్లో పౌర నౌకలను ధ్వంసం చేస్తోందని యుఎన్‌లో రష్యా శాశ్వత ప్రతినిధి వాసిలీ నెబెంజియా ఆ సెషన్‌లో పేర్కొన్నారు. ఇది 'కృత్రిమమైనది'గా పేర్కొంటూ .. 'వెనిజులాకు వ్యతిరేకంగా ఉద్రిక్తతలను పెంచడానికి ఉద్దేశించిన సమర్థన' అని వ్యాఖ్యానించారు. వెనిజులాలో చట్టబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని ఉగ్రవాద సంస్థగా ముద్రవేయడం ద్వారా అమెరికా ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి ఒక సాకుగా ఉగ్రవాదంపై పోరాటాన్ని వినియోగిస్తూ, దానిని నిర్వీర్యం చేస్తోందని అన్నారు. ఏకపక్ష యుఎస్ నిర్ణయం, దాని చర్యలను చట్టబద్ధమైన చట్ట అమలు లేదా జాతీయ రక్షణ కార్యకలాపాలుగా మారుస్తుందనే వాదనను ఆయన తిరస్కరించారు. డిసెంబర్ 16న ట్రంప్ ప్రకటనను ప్రాథమిక నిబంధనల ఉల్లంఘనకు స్పష్టమైన సాక్ష్యంగా ఆయన ఉదహరించారు. దీనికి మరిన్ని వివరణలు అవసరంలేదని అన్నారు. రాజకీయ, సైనిక మరియు ఆర్థిక ఒత్తిడిని ప్రయోగించి వ్యతిరేక దేశాల ప్రభుత్వాలను పడగొట్టడం వెనుక ప్రధాన లక్ష్యం ఆయా దేశాల సహజ మరియు ఖనిజవనరులను స్వాధీనం చేసుకోవడమేనని అన్నారు. అమెరికా చర్యలు పూర్తిగా ఆమోదయోగ్యం కానివి అని, యుఎన్, ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టంపై సమావేశం (యుఎన్‌సిఎల్ఒఎస్), భద్రతామండలి తీర్మానాలకు విరుద్ధని ఆయన పేర్కొన్నారు. వెనిజులా ప్రభుత్వానికి, ప్రజలకు రష్యా పూర్తి సంఘీభావం ప్రకటిస్తుందని అన్నారు. ఆయనను జాతీయ సార్వభౌమాధికార రక్షకుడిగా అభివర్ణించారు. అంతర్జాతీయ సమాజం అంతర్జాతీయ చట్టాలను సమర్థించాలని ఆయన కోరారు.

## బిజెపి భూస్వామ్య మనస్తత్వానికి వ్యతిరేకంగా పోరాడతాం

న్యూఢిల్లీ : బిజెపి విధానాలను లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ బుధవారం తీవ్రంగా విమర్శించారు. బిజెపి తెచ్చిన విధానాలు ముఖ్యంగా వైశ్య సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని చిన్న వ్యాపారాలను దెబ్బతీశాయని రాహుల్ ఆరోపిచారు. బిజెపి భూస్వామ్య మనస్తత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని, వైశ్య సమాజానికి పూర్తి మద్దతు ఇస్తామని ఆయన ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'నేను వ్యాపారులతో మాట్లాడినప్పుడు తమ వ్యాపారం పతనం అంచున ఉంది అని వ్యాపారస్తులు ఆవేదన చెందారు. వైశ్య సమాజం నుంచి వచ్చిన ఈ ఆవేదన నన్నెంతగానో కదలించింది. దేశ ఆర్థిక వ్యవస్థకు చారిత్రాత్మకంగా ఎంతో దోహదపడిన సమాజం నేడు నిరాశలో ఉంది. ఇది ప్రమాద హెచ్చరిక. బిజెపి ప్రభుత్వం గుత్తాధిపత్య సంస్థలకు స్వేచ్ఛను ఇచ్చింది. చిన్న, మధ్యతరహా వ్యాపారులను అధికార సంకెళ్లు, తప్పుడు జిఎస్‌టి వంటి లోపభూయిష్ట విధానాలతో బంధించారు' అని రాహుల్ ఎక్స్ పోస్టులో తీవ్రస్థాయిలో విమర్శించారు. బిజెపి తెచ్చిన జిఎస్‌టి సవరణలు కేవలం విధాన వైఫల్యం కాదు. ఇది ఉత్పత్తి, ఉపాధి భారతదేశ భవిష్యత్తుపై ప్రత్యక్ష దాడి. ఇది బిజెపి ఫ్యూడల్ మైండ్‌సెట్ తెలియజేస్తోంది. దీనికి వ్యతిరేకంగా పోరాటం చేస్తాం. ఈ యుద్ధంలో దేశ వాణిజ్యానికి వెన్నెముక అయిన వైశ్య సమాజానికి మద్దతుగా నిలుస్తాను అని రాహుల్ అన్నారు.

# కర్మ యోగం... కర్తవ్య పాలన



భారతీయ జీవన దర్శనం ప్రకారం ఈ జగత్తంతా దైవమయం. మనం చేసే ప్రతి కర్మను ఆ పరమాత్మకు అర్పించే 'నైవేద్యం'గా భావించాలి. ఉపనిషత్తులు బోధించిన సూత్రం ప్రకారం, కర్మలను చేస్తూనే వాటి ఫలితాలకు అంటకుండా ఉండటమే జీవన ముక్తి. అహంకారాన్ని వీడి, 'నేను కర్తను కాదు, కేవలం ఒక నిమిత్త మాత్రుడను' అనే భావనతో పని చేసినప్పుడు ఆ కర్మకు పుణ్యపాపాలు అంటవు. ఆర్ష ధర్మం ప్రతిపాదించిన అదుతే జీవన వేదాంతం కర్మయోగం. లోకంలో జన్మించిన ప్రతి మానవుడు కర్మ చేయక తప్పదు. అయితే, ఆ కర్మను బంధనంగా మార్చుకోవాలా లేక మోక్ష మార్గంగా మలచుకోవాలా అన్నదే ఇక్కడి అసలైన ప్రశ్న. భగవద్గీతలో క ృష? పరమాత్మ అందించిన 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన' అనే దివ్య శ్లోకం మానవాళికి ఒక శాశ్వత దిక్సూచి. పని చేయడంపైనే నీకు అధికారం ఉంది గానీ, ఫలితంపై లేదని చెప్పడం వెనుక లోతైన మనస్తత్వ శాస్త్రం దాగి ఉంది. ఫలితంపై అతిగా ఆశ పెంచుకున్నప్పుడు మనిషిలో ఆందోళన, భయం, అసహనం ప్రవేశిస్తాయి. అదేపనిని దైవ కార్యంగా భావించి చేసినప్పుడు ఆ కర్మ 'యోగం'గా మారుతుంది. ఇది కేవలం సిద్ధాంతం కాదు, నిత్య జీవితంలో అనుసరించదగిన పరమ సత్యం. కర్మయోగం అంటే పలాయనవాదం కాదు, అది సంపూర?మైన క్రియాశీలత. ఒక శిల్పి విగ్రహాన్ని చెక్కుతున్నప్పుడు కేవలం ఆ ప్రతిమ ఎంత ధరకు అమ్ముడవుతుందనే ఆలోచనతో ఉంటే, ఆ శిల్పంలో జీవం ఉట్టిపడదు. అదే శిల్పి తన నైపుణ్యాన్ని పరమాత్మకు అర్పిస్తున్నాననే భావనతో చెక్కితే, ఆ పనిలో ఒక అలౌకికానందం వెల్లివిరుస్తుంది. అలాగే ఒక వైద్యుడు కేవలం ధనం కోసమే చికిత్స చేస్తే అది వ్యాపారం అవుతుంది. అదే వైద్యుడు రోగిలో దైవాన్ని చూస్తూ, తన విజ్ఞానాన్ని ప్రాణదానానికి అంకితం చేస్తే అది పవిత్ర యజ్ఞమవుతుంది. ఫలితం భగవంతుడి నిర?యమని నమ్మి, తన శక్తినంతా చికిత్సపైనే కేంద్రీకరించినప్పుడు ఆ వైద్యుడికి మానసిక ఒత్తిడి ఉండదు. ఈ నిష్కామ బుద్ధి మనిషిని నిరంతరం ఉన్నత స్థితిలో నిలబెడుతుంది. అగ్ని తన ధర్మాన్ని తాను నిర్వర్తించినట్లు, మనిషి తన స్వధర్మాన్ని నిష్కామంగా ఆచరించాలి. ఈ మార్గంలో అత్యంత ముఖ్యమైనది 'ఫలత్యాగం'. అంటే ఫలితాన్ని వదిలేయడం కాదు, ఫలితం వల్ల కలిగే హర్ష విచారాలకు అతీతంగా ఉండటం. విజయం వస్తే పొంగిపోకుండా, అపజయం ఎదురైతే కుంగిపోకుండా ఉండే స్థితి కర్మయోగికి మాత్రమే సాధ్యం. యోగశాస్త్రం బోధించిన ఈ నిష్కామ కర్మ సిద్ధాంతం వ్యక్తిని కర్తవ్యోన్ముఖుడిని చేస్తుంది. చేసే పనిలో దైవత్వాన్ని వెతుక్కున్నప్పుడు ఒత్తిడి మాయమై శాంతి ప్రవహిస్తుంది. ప్రతి క్షణం మన కర్మను ఒక ఆరాధనగా మలుచుకుంటే, ఈ ప్రపంచమే ఒక వైకుంఠమవుతుంది. స్వార్థపు చీకటిని తొలగించి, సేవా భావం అనే జ్యోతిని వెలిగించుకుందాం. సర్వం ఈశ్వరార్పణమస్తు! నిప్పు నిప్పును కాల్చదు గానీ, దానిపై పడిన వస్తువును కాలుస్తుంది. అలాగే, అహంకారంతో చేసే కర్మలు బంధాలను స ృష్టిస్తే, నిరహంకారంతో చేసే కర్మలు మనసును నిర్మలం చేస్తాయి. సూర్యుడు ప్రతిరోజూ లోకానికి వెలుగును ఇస్తాడు, తనే వెలుగునిస్తున్నాననే అహంకారం ఆయనకు ఉండదు. అటువంటి నిస్వార్థ గుణమే మనల్ని మహోన్నతులుగా తీర్చిదిద్దుతుంది. నిత్య జీవిత సవాళ్లను సాకులు చెప్పకుండా ఎదుర్కోవడం, బాధ్యతలను భారం కాకుండా గౌరవంగా భావించడం కర్మయోగపు అంతరార్థం. ఈ జ్ఞానమే మనల్ని నిరంతరం కర్మపథంలో నడిపిస్తూ, అంతిమంగా ఆత్మానందానికి చేరువ చేస్తుంది.

# సౌదీలో 'మధు'మాసం!

### రహస్యంగా మందు విక్రయాలు షరతులు వర్తిస్తాయ్ గురూ..

ఇస్లాం పవిత్ర పుణ్యక్షేత్రాలకు నిలయమైన సౌదీ అరేబియాలో ఒకప్పుడు 'మద్యం' మాట వినిపిస్తేనే కఠిన శిక్షలు ఉండేవి. కానీ, ఇప్పుడక్కడ క్రమేపీ వాతావరణం మారుతోంది. దశాబ్దాల నిషేధాన్ని పక్కన పెట్టి, అత్యంత రహస్యంగా మద్యం విక్రయాలను విస్తరిస్తోంది సౌదీ ప్రభుత్వం.

**నిశ్శబ్దంగా.. నిషా వైపు!**

రియాద్‌లోని 'డిప్లొమాటిక్ క్వార్టర్'లో ఒక గుర్తు తెలియని దుకాణం ఉంది.. బయట బోర్డు ఉండదు. లోపలికి కెమెరాలను రానివ్వరు. 2024 జనవరిలో కేవలం ముస్లిమేతర దౌత్యవేత్తల కోసం మొదలైన ఈ దుకాణం తలుపులు ఇప్పుడు మరికొందరికి తెరుచుకున్నాయి. ఎలాంటి అధికారిక ప్రకటన లేకుండానే, 'ప్రీమియం రెసిడెన్సీ' ఉన్న విదేశీయులకు కూడా ఇక్కడ మద్యం కొనుగోలు చేసే అవకాశం కల్పించారు.

**రక్షణ మామూలుగా లేదు!**

ఈ దుకాణంలోకి వెళ్లడం అంత సులభం కాదు. ప్రవేశ ద్వారం దగ్గర క్షుణ్ణంగా తనిఖీలు చేస్తారు. ఫోన్లు, కెమెరాలను అనుమతించరు. ఆఖరికి మీరు పెట్టుకున్న కళ్లద్దాలు కూడా 'స్మార్ట్ గ్లాసెస్' ఏమో అని సిబ్బంది తనిఖీ చేస్తారు. ధరల విషయానికి వస్తే.. దౌత్యవే త్తలకు పన్ను ఉండదు కానీ, ఈ కొత్త వినియోగదారులకు మాత్రం జేబులు ఖాళీ కావల్సిందే.

**ఇప్పుడిక రియాద్‌లోనే 'కిక్కు'**

ఇప్పటి వరకు మందు తాగాలనిపిస్తే సౌదీ వాసులు పక్కనే ఉన్న



బహ్రెయిన్ ద్వీపానికో లేదా దుబాయ్‌కో వెళ్లేవారు. కొంతమంది స్మగ్లింగ్ చేసిన మందును భారీ ధరకు కొనేవారు. కానీ, తాజా మార్పులతో ధనవంతులైన విదేశీయులకు ఇప్పుడు రియాద్‌లోనే 'కిక్కు' దొరుకుతోంది. సౌదీలో సినిమాలు వచ్చాయి, మహిళలు డ్రైవింగ్ సీట్ ఎక్కారు, ఇప్పుడు మద్యం దుకాణాలు కూడా వచ్చేశాయి. అయితే ఇది కేవలం విదేశీయులకే పరిమితమా? లేక భవిష్యత్తులో అందరికీ అందుబాటులోకి వస్తుందా?.. అన్నది వేచి చూడాలి. ఏది ఏమైనా, సౌదీలో ఈ 'లిక్కర్ ఎక్స్‌పెరిమెంట్' ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**దశాబ్దాల నిషేధం!**

సౌదీలో మద్యం ఎందుకు నిషేధించారో తెలుసా? 1951లో సౌదీ వ్యవస్థాపక రాజు అబ్దుల్ అజీజ్ కుమారుడు ప్రిన్స్ మిషారీ, మద్యం మత్తులో జెడ్డాలోని బ్రిటిష్ వైస్ కాన్సుల్‌ను కాల్చి చంపాడు. ఆ చేదు జ్ఞాపకంతో అప్పట్లో మద్యంపై కఠిన నిషేధం విధించారు. ఇప్పుడు విజన్ 2030లో భాగంగా మొహమ్మద్ బిన్ సల్మాన్ మళ్లీ మెల్లమెల్లగా నిబంధనలను సడలిస్తున్నారు.

# కొండలపై కత్తి!

### ప్రమాదంలో ఆరావళి పర్వతాల మనుగడ
### 100 మీటర్లు మించితేనే గుట్టలు: సుప్రీం
### ప్రమాదకరమైన తీర్పు: పర్యావరణవాదులు
### 90 శాతం ఆరావళి త్వరలో మటుమాయమే
### ఉత్తరాది ఎడారైపోతుందంటూ హెచ్చరికలు

ఒకసారి కాలంలో ఓ 300 కోట్ల ఏళ్లు వెనక్కి వెళ్లి, అంతరిక్షం నుంచి ప్రస్తుత భారతదేశాన్ని ఒక్కసారి చూస్తే? ఉత్తర ప్రాంతంలో కన్పించే ఏకైక భౌగోళిక స్వరూపం ఏమిటో తెలుసా? ఆరావళీ పర్వత శ్రేణులు! భూమిపై అత్యంత పురాతన పర్వతాల్లో ఒకటిగా అది గుర్తింపు పొందింది. కానీ, వందలాది కోట్ల ఏళ్లుగా అతి కఠినమైన కాలపరీక్షకు తట్టుకుని మరీ ఉనికిని కాపాడుకుని నిలిచిన ఆరావళీ శ్రేణులు మనిషి పేరాశ పాలిట పడి త్వరలోనే ఉనికి కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. వాటి పరిరక్షణకు తాము చిరకాలంగా చేస్తున్న ప్రయత్నాలకు సుప్రీంకోర్టు ఇటీవలి తీర్పు గొడ్డలిపెట్టుగా మారిందని పర్యావరణవేత్తలు వాపోతున్నారు. "ఫలితంగా పంజాబ్, హరియాణా మొదలుకుని దేశ రాజధాని ఢిల్లీ దాకా ఆరావళి శ్రేణులు చూస్తుండగానే గనులుగా, రియల్ వెంచర్లుగా మారిపోవడం ఖాయం. అదే జరిగితే థార్ ఎడారి అడ్డూ అదుపూ లేకుండా విస్తరిస్తుంది. దాంతో ఉత్తరాదిలో చాలా భాగం అతి త్వరలోనే ఎడారిగా మారిపోతుంది"అని హెచ్చరిస్తున్నారు! ఆరావళి. గుజరాత్ మొదలుకుని ఢిల్లీ దాకా 650 కిలోమీటర్ల పై చిలుకు విస్తరించిన పర్వత శ్రేణులు. ఉత్తరాదిని అన్నివిధాలా పెట్టని కోటలా కాపాడుకుంటూ వస్తున్నాయి. థార్ ఎడారి తూర్పు దిశగా విస్తరించకుండా అడ్డుకుంటున్నాయి. ఉత్తరాదిన అంతంత మాత్రమే ఉండే భూగర్భ జలాలను గుజరాత్ నుంచి ఢిల్లీ దాకా 4 రాష్ట్రాల పరిధిలో ఎప్పటికప్పుడు రీచార్జి చేయడమే గాక రాజధాని ప్రాంతంలోని అపార కాలుష్యాన్ని వీలైనంత మేరకు తగ్గిస్తున్నాయి.

**కోర్టు తీర్పుతో...**

ఆరావళి రగడ ఇప్పటిది కాదు. దశాబ్దాలుగా ఉన్నదే. సుప్రీంకోర్టు ఇటీలి తీర్పుతో తాజాగా అది మరోసారి రగులుకుంది. అసలు ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం పరిధిలోకి వచ్చే ప్రాంతాలు ఏమిటన్న దానిపై కోర్టు చిరకాలంగా విచారణ జరుపుతూ వస్తోంది. ఈ విషయంలో కేంద్రం వాదనతో ఏకీభవిస్తూ గత నవంబర్ 20న కోర్టు తీర్పు వెలువరించింది. దానిప్రకారం పరిసర ప్రాంతాలతో పోలిస్తే కనీసం 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న వాటిని మాత్రమే గుట్టలుగా, అంటే ఆరావళీ ప్రాంతంగా గుర్తిస్తా రు! ఇది చాలా ప్రమాదకరమైన తీర్పు అని విపక్షాలు మొత్తుకుంటున్నాయి. హరియాణా, దేశ రాజధాని ప్రాంతంలో అస్మదీయులైన రియల్టీ,



ఇన్‌ఫ్రా వ్యాపార దిగ్గజాలకు మేలు చేసేందుకే కేంద్రం ఈ వాదన లేవనెత్తింది. దానితో సుప్రీంకోర్టు ఏకీభవించడం తీవ్ర పర్యవసానాలకు దారితీస్తుంది. దోపిడీదారులు ఇప్పుడిక చట్టబద్ధంగానే పేట్రే గుతారు"అని పేర్కొంటున్నాయి. పర్యావరణవేత్తలు కూడా ఈ వాదనతో ఏకీభవిస్తున్నారు. ఆరావళి శ్రేణుల్లో దాదాపు 90 శాతం ప్రాంతం 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తే ఉంటుందని వారు గుర్తు చేస్తున్నారు. "కనుక నయా నిర్వచనం ప్రకారం అది గుట్టల లెక్కలోకి రాదు. కనుక అక్కడ గనులు తవ్వుకోవడం మొదలుకుని రియల్టీ వెంచర్ల దాకా ఏమైనా చేసుకోవచ్చు. కానీ ఇది పర్యావరణానికే గాక మొత్తం ఉత్తరాదికే తీరని నష్టం చేస్తుంది. చూస్తుండగానే ఢిల్లీ నుంచి పంజాబ్ దాకా ఏమాత్రమూ నివాసయోగ్యం కాకుండా పోవ డం ఖాయం"అని వారు హెచ్చరిస్తున్నారు.

**కొట్టిపారేస్తున్న కేంద్రం**

పాలక బీజేపీ మాత్రం ఆరావళి విషయమై విపక్షాలు, పర్యావరణవేత్తల ఆందోళనలను అసంబద్ధమైనవిగా కొట్టిపారేస్తోంది. ఆరావళి శ్రేణుల నిర్వచనం విషయంలో సుప్రీంకోర్టు నిజానికి ఎలాంటి సడలింపులూ ఇవ్వలేదని కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ చెప్పుకొచ్చారు. ఆరావళి శ్రేణులు నిత్యం పచ్చగా ఉండాలన్నదే కేంద్రం ఆకాంక్ష అన్నా రు. అయితే, '100 మీటర్ల ఎత్తు'నిర్వచనం ప్రపంచవ్యాప్తంగా అంగీకరించినదేనంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారాయన! ఆరావళి శ్రేణుల్లో కేవలం 0.19 శాతం ప్రాంతంలో మాత్రమే మైనింగ్‌కు అనుమతిస్తున్నట్టు వివరించారు. మొత్తమ్మీద 90 శాతం పర్వతాలను పూర్తిస్థాయిలో పరిరక్షిస్తున్నామన్నారు. అతి పురాతనమైన ఆరావళి పర్వత శ్రేణులను విధ్వంసం బారినుంచి కాపాడుకుందామంటూ ఆన్‌లైన్‌లో ఉద్యమం ఊపందుకుంటోంది. 'సేవ్ ఆరావళి'హాష్‌ట్యాగ్‌కు సోషల్ సైట్లలో మద్దతు వెల్లువెత్తుతోంది. ఇది క్రమంగా ఉత్తరాదిని దాటుకుని జాతీయ ఆందోళనగా రూపుదిద్దుకునే సూచనలు కన్పిస్తున్నాయి.

# ప్రపంచ 5జీ అగ్రగామిగా భారత్

కొద్దిరోజుల్లో 2025వ సంవత్సరం ముగుస్తున్న వేళ, టెలికమ్యూనికేషన్ రంగంలో భారత్ ప్రపంచ దిగ్గజంగా తన స్థానాన్ని పటిష్టం చేసుకుంది. చరిత్రలోనే అత్యంత వేగవంతమైన మౌలిక సదుపాయాల కల్పనతో దేశంలో 5జీ వినియోగదారుల సంఖ్య 40 కోట్లకు (400 మిలియన్లు) చేరుకుంది. ఇది భారతదేశ మొత్తం మొబైల్ కస్టమర్ల సంఖ్యలో దాదాపు 32 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఫలితంగా ప్రపంచ డిజిటల్ వృద్ధికి భారత్ ప్రధాన ఇంజిన్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా 5జీ విస్తరిస్తున్నప్పటికీ, భారతదేశ వృద్ధి పథం సాటిలేనిదిగా ఉంది. 2025 చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా 5జీ కస్టమర్ల సంఖ్య సుమారు 290 కోట్లకు చేరుకుంటుందని అంచనా. ఇది ప్రపంచవ్యాప్త మొబైల్ కస్టమర్ల సంఖ్య మూడింట ఒక వంతు. 110 కోట్లకు పైగా వినియోగదారులతో చైనా అగ్రస్థానంలో కొనసాగుతున్నప్పటికీ, భారత్ రికార్డు వేగంతో ఆ వ్యత్యాసాన్ని తగ్గిస్తోంది. జులై 2025 నాటికి 36.5 కోట్ల వినియోగదారులను చేరుకున్న భారతీయ మార్కెట్, 2030 నాటికి 100 కోట్లకు, 2031 నాటికి 110 కోట్లకు చేరుకుంటుందని అంచనా.

### ముందంజలో జియో

ఈ విప్లవంలో రిలయన్స్ జియో కేవలం భారతీయ లీడర్‌గానే కాకుండా, ప్రపంచ స్థాయి టెక్నాలజీ పవర్‌హౌస్‌గా అవతరించినట్లు కంపెనీ తెలిపింది. సంస్థ చెప్పిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 2025లో జియో 50 కోట్ల మొబైల్ వినియోగదారుల చారిత్రక మైలురాయిని అధిగమించింది. అక్టోబర్ 31 నాటికి ఆ సంఖ్య 51 కోట్లకు పెరిగింది. కేవలం ఈ ఏడాది మొదటి పది నెలల్లోనే దాదాపు 3 కోట్ల మంది కొత్త వినియోగదారులు చేరారు. కేవలం 5జీ విభాగంలోనే, 2025 చివరి నాటికి జియో వినియోగదారుల సంఖ్య 26 కోట్లకు చేరుకోనుంది. జియో మొత్తం వైర్‌లెస్ డేటా ట్రాఫిక్‌లో 5జీ వాటా ఇప్పుడు 50 శాతంగా ఉంది. 2025 మొదటి తొమ్మిది నెలల్లో ఈ నెట్‌వర్క్ ద్వారా ఏకంగా 162 ఎక్సాబైట్ల (162 బిలియన్ జీబీ) డేటా వినియోగం జరిగింది. 5జీ నెట్‌వర్క్‌కు మారడం వల్ల ఏడాది ప్రారంభంలో 32.3 జీబీగా ఉన్న సగటు జియో వినియోగదారుని నెలవారీ డేటా వినియోగం ఇప్పుడు 38.7 జీబీకి పెరిగింది.

### తెలుగు రాష్ట్రాల్లో తిరుగులేని ఆధిపత్యం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో రిలయన్స్ జియో తిరుగులేని డిజిటల్ లీడర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నట్లు కంపెనీ చెప్పింది. 2025 చివరి నాటికి ఈ ప్రాంతంలో జియో వైర్‌లెస్ వినియోగదారుల సంఖ్య 3.2 కోట్లు దాటినట్లు పేర్కొంది. దూకుడుగా విస్తరణ, సాంకేతిక విజయాలతో తెలుగు రాష్ట్రాల్లో జియో టాప్ పర్ఫార్మర్‌గా నిలిచినట్లు తెలిపింది. మొబైల్ కనెక్టివిటీ మాత్రమే కాకుండా, హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో కూడా కంపెనీ విప్లవాత్మక మార్పులు తెచ్చినట్లు స్పష్టం చేసింది. జియో ఎయిర్‌ఫైబర్ సేవలు మార్కెట్ వాటాలో సింహభాగాన్ని దక్కించుకోవడంతో, రెండు రాష్ట్రాల్లో వైర్‌లైన్ వినియోగదారుల సంఖ్య దాదాపు 20 లక్షలకు చేరుకుందని చెప్పింది.



### 100 కోట్ల దిశగా ప్రయాణం

భారత ప్రభుత్వం ఈ డిజిటల్ ప్రయాణంపై ధీమాగా ఉంది. 2026 నాటికి దేశీయ 5జీ వినియోగదారుల సంఖ్య 43 కోట్లకు చేరుతుందని భావిస్తోంది. మౌలిక సదుపాయాలు మెరుగుపడటం, 5జీ డివైజెస్ అందుబాటులోకి రావడంతో 2030 నాటికి 100 కోట్ల 5జీ వినియోగదారుల లక్ష్యం అసాధ్యమేమీ కాదనే అభిప్రాయాలున్నాయి. 5జీ ప్రారంభించిన కేవలం మూడేళ్లలోనే భారత్ ప్రపంచ నాయకత్వ స్థాయికి చేరుకుంది. ఈ చారిత్రక మార్పులో రిలయన్స్ జియో ముందు వరుసలో నిలిచినట్లు కంపెనీ చెప్పింది.

# ఐటీ ఉద్యోగాలు.. బాగానే పెరిగాయ్..

దేశీయంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో ఈ ఏడాది హైరింగ్ మెరుగ్గా నమోదైంది. గతేడాదితో పోలిస్తే నియామకాలు 16 శాతం పెరిగాయి. 2025లో మొత్తం ఐటీ ఉద్యోగాల డిమాండ్ 18 లక్షలకు చేరినట్లు వర్క్‌ఫోర్స్, టాలెంట్ సొల్యూషన్స్ సేవల సంస్థ క్వెస్ కార్ప్ ఒక నివేదికలో తెలిపింది. దీని ప్రకారం ఐటీ హైరింగ్ మార్కెట్లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) అత్యధికంగా 27 శాతం వాటా దక్కించుకున్నాయి. 2024లో నమోదైన 15 శాతంతో పోలిస్తే గణనీయంగా ఉద్యోగులను తీసుకున్నాయి. ఇక ప్రోడక్ట్, సాస్ (సాఫ్ట్‌వేర్ యాజ్ ఎ సర్వీస్) సంస్థలు కూడా చెప్పుకోతగ్గ స్థాయిలో రిక్రూట్ చేసుకున్నాయి. అయితే, ఐటీ సర్వీసెస్, కన్సల్టింగ్ విభాగాల్లో మాత్రం నియామకాల వృద్ధి ఒక మోస్తరుగానే నమోదైంది. నిధుల ప్రవాహం నెమ్మదించడంతో స్టార్టప్‌లలో హైరింగ్ కనిష్ట స్థాయి సింగిల్ డిజిట్‌కి పడిపోయినట్లు నివేదిక వివరించింది. అప్పటికప్పుడు పూర్తి స్థాయి ఉద్యోగ విధులను నిర్వర్తించేందుకు సన్నద్ధంగా ఉన్న వారితో పాటు మిడ్ కెరియర్ ప్రొఫెషనల్స్ (4-10 ఏళ్ల అనుభవం) ఉన్నవారి ప్రాధాన్యం లభించింది. మొత్తం హైరింగ్‌లో వీరి వాటా 65 శాతానికి పెరిగింది. 2024లో ఇది 50 శాతం.




### నివేదికలో మరిన్ని విశేషాలు..

మొత్తం డిమాండ్‌లో ఎంట్రీ లెవెల్ ఉద్యోగాల్లో హైరింగ్ వాటా 15 శాతంగా ఉంది. కాంట్రాక్ట్ ఉద్యోగాలకు నియామకాలు మొత్తం ఐటీ హైరింగ్‌లో 10-11 శాతంగా నమోదయ్యాయి. 2024లో ఇది సుమారు 8 శాతంగా నిల్చింది. ఐటీలో నెలకొన్న డిమాండ్‌ని బట్టి చూస్తే ఐటీ కొలువుల్లో కాంట్రాక్ట్ నియామకాల వాటా పెరిగింది. ఏఐ, క్లౌడ్, సైబర్‌సెక్యూరిటీ నైపుణ్యాలు ఉన్న వారిపై కంపెనీలు ప్రధానంగా దృష్టి పెట్టాయి. వచ్చే ఏడాది (2026) ఆసాంతం ఐటీ హైరింగ్ ఇదే విధంగా ఉండొచ్చు. డిజిటల్‌లో స్పెషలైజ్డ్ ఉద్యోగ విధులు, ద్వితీయ శ్రేణి నగరాల పరిధిని దాటి క్రమంగా విస్తరిస్తుండటం వంటి అంశాలు ఇందుకు దన్నుగా ఉంటాయి. ఏఐ, క్లౌడ్, సైబర్‌సెక్యూరిటీ, డేటా ఆధారిత ఉద్యోగాలకు డిమాండ్ నెలకొనవచ్చు. బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్), తయారీ, సాస్, టెలికం రంగాల్లో నియామకాలు ఎక్కువగా ఉండొచ్చు.




### సర్వీసుల్లో ఫ్రెషర్స్, మహిళల నుంచి దరఖాస్తుల వెల్లువ

సర్వీసుల ఆధారిత ఉద్యోగాలవైపు మహిళలు, ఫ్రెషర్స్ మొగ్గు చూపడంతో ఈ ఏడాది ఉద్యోగాలకు దరఖాస్తులు 29 శాతం పెరిగాయి. అప్నాడాట్‌కో నివేదిక ప్రకారం 9 కోట్లకు పైగా జాబ్ అప్లికేషన్లు వచ్చాయి. మెట్రోల పరిధిని దాటి హైరింగ్, డిజిటల్ రిక్రూట్‌మెంట్ సాధనాల వినియోగం పెరిగింది. ఫైనాన్స్, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులు, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్, హెల్త్‌కేర్ సపోర్ట్ ఉద్యోగాలకు మహిళల నుంచి దరఖాస్తులు 36 శాతం పెరిగి 3.8 కోట్లుగా నమోదయ్యాయి.

### ఇది చదివారా? సత్య నాదెళ్లకు అదో సరదా..

ఇక సర్వీస్, టెక్నాలజీ ఆధారిత రంగాల్లో ఫ్రెషర్ల నుంచి దరఖాస్తులు సుమారు 10 శాతం పెరిగాయి. అప్నాడాట్‌కో పోర్టల్‌లోని ఉద్యోగ దరఖాస్తుల డేటా విశ్లేషణ ఆధారంగా ఈ నివేదిక రూపొందింది. దీని ప్రకారం ఏటా 1 కోటి మంది యువతీ, యువకులు ఉద్యోగాల్లో చేరుతున్నారు. బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా), రిటైల్, లాజిస్టిక్స్, ఈ-కామర్స్, ఆరోగ్య సంరక్షణ, మొబిలిటీ, ఐటీ సర్వీసులు తదితర విభాగాల్లో ఉద్యోగాలకు డిమాండ్ నెలకొంది. చిన్న, మధ్య తరహా సంస్థల్లో (ఎస్ఎంబీ) జాబ్ పోస్టింగ్స్ 11 శాతం పెరిగి 10 లక్షలుగా నమోదైంది. అటు పెద్ద సంస్థల్లో జాబ్ పోస్టింగ్స్ 14 శాతం పెరిగి 4 లక్షలుగా నమోదయ్యాయి. ప్రథమ శ్రేణి నగరాల నుంచి సుమారు 2 కోట్ల దరఖాస్తులు, ద్వితీయ..తృతీయ శ్రేణి నగరాల నుంచి 1.8 కోట్ల అప్లికేషన్లు వచ్చాయి. మహిళల జీతభత్యాలు సగటున 22 శాతం పెరిగాయి.

# జనరేటివ్ ఏఐ కంటే స్పష్టమైన ఫలితాలిచ్చే దిశగా..




## ఏఐ వ్యూహాన్ని మార్చుకుంటున్న సేల్స్ ఫోర్స్

ప్రపంచంలోనే అతిపెద్ద ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఒకటైన సేల్స్ ఫోర్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విషయంలో తన దూకుడును తగ్గించుకుంటోంది. గత ఏడాది కాలంగా లార్జ్ ల్యాంగ్వేజీ మోడల్స్ పనితీరుపై నమ్మకం సడలడమే ఇందుకు ప్రధాన కారణం. జనరేటివ్ ఏఐ కంటే మరింత స్పష్టమైన ఫలితాలనిచ్చే నిర్ణయాత్మక ఆటోమేషన్ వైపు కంపెనీ మొగ్గు చూపుతోంది.

### నమ్మకం కోల్పోతున్న ఎగ్జిక్యూటివ్‌లు

'ఒక సంవత్సరం క్రితం ఎల్ఎల్ఎంల గురించి మాకున్న నమ్మకం ఇప్పుడు లేదు' అని సేల్స్ ఫోర్స్ ప్రొడక్ట్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజ్న పరులేకర్ అంగీకరించారు. ఏఐ నమూనాల్లో ఉండే రాండమ్‌నెస్ (యాదృచ్ఛికం) వల్ల వ్యాపార పనుల్లో తప్పులు దొర్లే ప్రమాదం ఉందని, అందుకే తమ కొత్త ఉత్పత్తి అయిన ఏజెంట్ ఫోర్స్‌లో మరింత నియంత్రిత ఆటోమేషన్‌ను ప్రవేశపెడుతున్నామని ఆమె వెల్లడించారు.

### సాంకేతిక వైఫల్యాలే కారణమా?

ఏజెంట్ ఫోర్స్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మురళీధర్ కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏఐ మోడల్స్‌కు ఎనిమిది కంటే ఎక్కువ సూచనలు ఇచ్చినప్పుడు అవి గందరగోళానికి గురవుతున్నాయి. ముఖ్యంగా.. ఎక్కువ సూచనలు ఉంటే ఎల్ఎల్ఎంలు కీలకమైన ఆదేశాలను వదిలివేస్తున్నాయి. వినియోగదారులు అసంబద్ధమైన ప్రశ్నలు అడిగినప్పుడు ఏఐ తన అసలు లక్ష్యాన్ని మర్చిపోయి పక్కదారి పడుతోంది. 25 లక్షల కస్టమర్లు ఉన్న వివింట్ వంటి కంపెనీలు కస్టమర్ సర్వేలను పంపడంలో ఏఐ విఫలమైందని గుర్తించాయి. దీన్ని సరిదిద్దడానికి ఇప్పుడు మళ్లీ పాత పద్ధతిలో 'ట్రిగ్గర్లను' ఏర్పాటు చేయాల్సి వస్తోంది.

### డేటా ఫౌండేషన్లపై దృష్టి

ఏఐ ద్వారా వేల కోట్లు ఆర్జించవచ్చని భావించిన సేల్స్‌ఫోర్స్ సీఈఓ మార్క్ బెనియోఫ్ ఇప్పుడు డేటా ఫౌండేషన్లపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నారు. సరైన డేటా లేకుండా ఏఐ ఇష్టారీతిన ప్రవర్తిస్తుందని చెప్పారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. ఏఐ ఏజెంట్ల విస్తరణ కారణంగా కంపెనీ తన సహాయక సిబ్బందిని 9,000 నుంచి 5,000కి తగ్గించిందని వెల్లడించారు.

# సాగర గర్భంలో అపార ఖనిజ సంపద.. వెలికితీత సాధ్యమేనా?

భారతదేశం అనేక ఖనిజాలకు (ఇంధన, లోహ, అలోహ ఖనిజాలు) నిలయం. వీటిని సరైన విధంగా గుర్తించి.. వినియోగించుకుంటే.. దిగుమతి కోసం దాదాపు ఏ దేశం మీద ఆధారపడాల్సిన అవసరం లేదు. భూమిపైన మాత్రమే కాకుండా.. సముద్ర గర్భంలో కూడా విరివిగా లభిస్తాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇండియా.. నేషనల్ గ్యాస్ హైడ్రేట్ ప్రోగ్రామ్ ద్వారా.. సముద్రంలో మీథేన్ హైడ్రేట్ నిక్షేపాలను గుర్తించింది. ఇంతకీ ఇదెందుకు ఉపయోగపడుతుంది?, ఎలా బయటకు తీయాలి?, బయటకు తీయడం వల్ల లాభం ఏమిటనే.. ఆసక్తికర విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.

భారతదేశం.. బంగాళాఖాతంలో మాత్రమే కాకుండా, దాని తూర్పు ఖండాంతర అంచున దగ్గర కూడా భారీగా మీథేన్ హైడ్రేట్ నిక్షేపాలను గుర్తించింది. ఈ నిక్షేపాల విలువ ట్రిలియన్ డాలర్లు ఉండవచ్చని అంచనా. కానీ దీనిని (మీథేన్ హైడ్రేట్) సముద్రం నుంచి బయటకు తీయగల సరైన టెక్నాలజీ ప్రస్తుతానికి అందుబాటులో లేదు. అంతే కాకుండా దీనిని బయటకు తీయడానికి యునైటెడ్ నేషన్ కన్వెన్షన్ ఆన్ ది లా ఆఫ్ ది సీ ద్వారా కొన్ని హక్కులను పొందాల్సి ఉంటుంది.

### మీథేన్ హైడ్రేట్‌ను బయటకు తీయడం కష్టమా?, ఎందుకు?

సముద్రం అడుగున ఉన్న భూభాగం చల్లగా (0-4 డిగ్రీ సెంటీగ్రేడ్ టెంపరేచర్) ఉంటుంది. కాబట్టి ఇక్కడ మీథేన్ హైడ్రేట్ గడ్డ కట్టుకుని ఉంటుంది. అయితే దీనిని బయటకు తీయాలని ప్రయత్నించినప్పుడు.. కొంత ఉష్ణోగ్రత వల్ల కరిగిపోవచ్చు. ఉష్ణోగ్రత పెరిగేకొద్దీ మీథేన్ హైడ్రేట్ ఆవిరయ్యే అవకాశం ఉంటుంది. డీ-ప్రెషరైజేషన్, థర్మల్ స్టిమ్యులేషన్, వంటి టెక్నాలజీలను ఉపయోగించి లేదా కొన్ని రసాయన పద్దతుల ద్వారా మీథేన్ హైడ్రేట్ బయటకు తీయవచ్చు. కానీ సముద్ర గర్భంలో ఎక్కువ సేపు పని చేయడం అనేది చాలా కష్టమైన పని. అంతే కాకుండా పనిచేస్తున్నప్పుడు మీథేన్ విడుదలైతే చాలా ప్రమాదం. దీనికోసం ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

### మీథేన్ హైడ్రేట్ వల్ల ఉపయోగాలు

సముద్రంలోని భారీ మీథేన్ హైడ్రేట్‌ను బయటకు తీస్తే చాలా ఉపయోగాలు ఉన్నాయి. ప్రధానంగా గ్యాస్ దిగుమతులు తగ్గించవచ్చు. విద్యుత్ ఉత్పత్తి, వంట గ్యాస్, పరిశ్రమల్లో ఉపయోగించవచ్చు. భవిష్యత్ తరాలు ఉపయోగించుకోవడానికి నిల్వ చేసుకుపోవచ్చు. బొగ్గు, పెట్రోలియంతో పోలిస్తే.. మీథేన్ హైడ్రేట్ ఉపయోగం వల్ల కాలుష్యం తగ్గుతుంది. గ్యాస్ ధరలు కూడా తగ్గుతాయి.




### పరిధి దాటితే పరిస్థితులు తీవ్రం!

సముద్రం అనేది ఏ ఒక్క దేశం అధీనంలో ఉండదు. ఇది మొత్తం అంతర్జాతీయ చట్టాలకు లోబడి ఉంటుంది. కేవలం తీరరేఖ నుంచి 12 నాటికల్ మైళ్ల దూరం మాత్రమే ఆ దేశం అధీనంలో ఉంటుంది. అయితే తీరరేఖ నుంచి 200 నాటికల్ మైల్స్ వరకు ఉన్న సముద్రంలో లభించే వనరులను దేశం ఉపయోగించుకునే అధికారం ఉంటుంది. ఈ పరిధి ఏ దేశం దాటినా పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి. కాబట్టి సముద్రంలోని నిక్షేపాలను ఏ ఒక్క దేశం స్వాధీనం చేసుకోవడం అనేది సాధ్యం కాదు.

# ఏఐల మెదడుకు ఇండియన్లే మేత

**ప్రపంచంలో అత్యధిక యూజర్లు భారతీయులే**
**చాట్‌జీపీటీకి 14.5 కోట్ల వినియోగదారులు**
**జెమినైకి 10.5 కోట్ల నెలవారీ యూజర్లు**
**'బ్యాంక్ ఆఫ్ అమెరికా సెక్యూరిటీస్' నివేదిక**



ఏఐ యాప్‌లకు ఇండియా అతిపెద్ద యాక్టివ్ యూజర్-బేస్ మార్కెట్‌గా అవతరించిందని 'బ్యాంక్ ఆఫ్ అమెరికా సెక్యూరిటీస్' తాజా నివేదిక వెల్లడించింది. ఏఐ యాప్‌లకు ప్రపంచంలోనే అత్యధికంగా ఇండియాలో రోజువారీ, నెలసరి యూజర్లు ఉన్నారని తెలిపింది. అత్యధికంగా చాట్ జీపీటీకి 14.5 కోట్ల నెలవారీ వినియోగదారులు ఉంటే తరువాతి స్థానంలో 10.5 కోట్ల మందితో జెమినై ఉంది. ఓపెన్ ఏఐకి చెందిన 'చాట్‌జీపీటీ', గూగుల్‌కు చెందిన 'జెమినై', పెర్‌ప్లెక్సిటీ వంటి యాప్‌లకు ప్రపంచవ్యాప్తంగా భారీగా వినియోగదారులు పెరుగుతున్న సంగతి తెలిసిందే. కానీ, వీటికి ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో రోజువారీ, నెలవారీ యాక్టివ్ యూజర్లు భారత్‌లో ఉన్నారని బ్యాంక్ ఆఫ్ అమెరికా సెక్యూరిటీస్ నివేదిక వెల్లడించింది. 2025 నవంబరు నాటికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న నెలవారీ యాక్టివ్ యూజర్‌లలో.. జెమినైకి 31 శాతం, పెర్‌ప్లెక్సిటీలను 38 శాతం మంది భారతీయులే కావడం గమనార్హం. ఇక వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటి వినియోగంలోనూ భారత్ దూసుకుపోతోంది. ప్రపంచంలోని మొత్తం వాట్సాప్ వినియోగదారుల్లో మనవాళ్లు 32 శాతం కాగా, ఇన్‌స్టాగ్రామ్ యూజర్లలో భారతీయులు 31 శాతం కావడం విశేషం.


నవ శుభోదయ
తెలుగు దినపత్రిక
శుక్రవారం - 26 - డిసెంబర్ - 2025

# ట్రోలర్స్ కి రష్మిక కౌంటర్.. ఇప్పుడైనా?



రష్మిక మందన్న.. కన్నడ ముద్దుగుమ్మ అయినప్పటికీ టాలీవుడ్ లో సత్తా చాటి నేడు పాన్ ఇండియా హీరోయిన్గా చలామణి అవుతోంది. అది తక్కువ సమయంలోనే నాలుగు వేల కోట్లకు పైగా కలెక్షన్స్ బాక్స్ ఆఫీస్ వద్ద రాబట్టి.. స్టార్ హీరోలను సైతం ఆశ్చర్యపరిచింది. ముఖ్యంగా ఏ ఒక్క హీరోకి సాధ్యం కానీ అతి కష్టమైన రికార్డులను బ్రేక్ చేసి అందరి చేత ప్రశంసలు అందుకుంది రష్మిక.. తన నటనతోనే కాదు అందంతో ఆకట్టుకుంటూ నేషనల్ క్రష్ గా పేరు సొంతం చేసుకుంది. ఇకపోతే ఒకవైపు సినిమాలు మరొకవైపు సోషల్ మీడియాలో బిజీబిజీగా గడిపేస్తున్న ఈమె.. తన ఫోటోలను మార్ఫింగ్ చేయడం పై ఎప్పటికప్పుడు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు మరొకసారి ఏఐ దుర్వినియోగంపై ఒక సుదీర్ఘ నోటు పంచుకుంది. ఎక్స్ వేదికగా రష్మిక షేర్ చేసిన ఈ పోస్ట్ వైరల్ అవ్వడమే కాకుండా ఏఐని దుర్వినియోగం చేస్తూ తన ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వదిలిన వారికి గట్టిగానే కౌంటర్ ఇచ్చింది. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం.. అధునాతన టెక్నాలజీ రోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ టెక్నాలజీ మనిషికి ఉపయోగపడాలి కాని దుర్వినియోగం కాకూడదు. అయితే కొంతమంది ఈ ఏఐ రంగంలో అద్భుతాలు సృష్టిస్తుంటే మరికొంతమంది దీనిని తప్పు దోవలో ఉపయోగిస్తూ అటు సెలబ్రిటీలకు ఇటు సామాన్యులకు తీరని నష్టాన్ని మిగులుస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంపై ఎంతోమంది సోషల్ మీడియా వేదికగా స్పందించడమే కాకుండా సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడం లేదా కోర్టును ఆశ్రయించడం లాంటివి చేశారు. అయితే ఇప్పుడు తాజాగా దీనిపై రష్మిక స్పందించింది. రష్మిక తన ఎక్స్ ఖాతా ద్వారా.."మహిళలను లక్ష్యంగా చేసుకొని ఏఐని ఉపయోగిస్తూ టెక్నాలజీని దుర్వినియోగం చేస్తుండడం కొంతమంది వ్యక్తులలో నైతిక క్షీణతను సూచిస్తోంది. నిజానికి ఇంటర్నెట్ ప్రతిబింబం లాంటిది కాదని గుర్తుపెట్టుకోవాలి. ఏదైనా వక్రీకరించగలిగే కాన్వాస్ ఇది. గౌరవప్రదమైన మెరుగైన సమాజం కోసం మాత్రమే ఏఐ ను వినియోగిద్దాం. నిర్లక్ష్యాన్ని వదిలిపెట్టి బాధ్యతగా వ్యవహరిద్దాము. ఇక నిజాన్ని తయారు చేయగలిగినప్పుడే విచక్షణే మనకు గొప్ప రక్షణగా మారుతుంది" అంటూ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ అసభ్యకరంగా ప్రవర్తించే వారిని ఉద్దేశిస్తూ రష్మిక ఈ పోస్ట్ పెట్టింది. ముఖ్యంగా ఇటువంటి వ్యక్తులపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా ఏఐ ను తప్పుదోవ పట్టిస్తూ వ్యక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిని.. మనుషుల్లాగా ప్రవర్తించని వారిని కఠినంగా శిక్షించాలి అంటూ డిమాండ్ చేసింది రష్మిక. ప్రస్తుతం రష్మిక షేర్ చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# స్పిరిట్ హీరోయిన్ ఎనర్జీ బూస్టర్ ఇదే...



ప్రస్తుతం ఈమె ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి గంగా దర్శకత్వంలో రూపొందుతున్న స్పిరిట్ సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే స్పిరిట్ సినిమా షూటింగ్ కార్యక్రమాలు లాంచనంగా జరిగాయి. మెగాస్టార్ చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరై సినిమాను ప్రారంభించారు. గత సంవత్సర కాలంగా ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా ప్రారంభం కావడంతో తృప్తి డిమ్రి కూడా సంతోషం వ్యక్తం చేసింది. సోషల్ మీడియాలో తృప్తి డిమ్రి... వరుసగా సినిమాలు చేస్తూ బిజీగా ఉండే తృప్తి డిమ్రి మరోవైపు సోషల్ మీడియా ద్వారా రెగ్యులర్గా అభిమానులతో టచ్ లో ఉంటుంది. ఎప్పటికప్పుడు తన అందమైన ఫోటోలను షేర్ చేయడం మాత్రమే కాకుండా తన రొటీన్ లైఫ్ ఫోటోలను వీడియోలను అభిమానులతో పంచుకోవడం మనం చూస్తూ ఉంటాం. తాజాగా తన ఎనర్జీ బూస్టర్ అంటూ ఒక చిన్న వీడియోని షేర్ చేసింది. మనలో చాలా మందికి అలసటగా ఉన్నప్పుడు టీ తాగడం అలవాటుగా ఉంటుంది. టీ తాగితే చాలా వరకు రిప్రెషన్ అయినట్లుగా అనిపిస్తుంది. మనలో చాలా మంది టీ తాగడం ద్వారా తిరిగి ఎనర్జీ పొందినట్లు ఫీల్ పొందుతారు. హీరోయిన్ తృప్తి కూడా తన ఎనర్జీ బూస్టర్ చాయ్ బిస్కెట్ అంటూ ఈ వీడియో ద్వారా చెప్పకనే చెప్పింది. చాయ్ బిస్కెట్ ఎంతో ఇష్టంగా తింటాను అంటూ తృప్తి తన సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఇంస్టాగ్రామ్ ద్వారా వీడియోను షేర్ చేసి అభిమానులతో పంచుకుంది. షూటింగ్ గ్యాప్ లో తృప్తి ఇలా చాయ్ బిస్కెట్ తింటూ తిరిగి ఎనర్జీని సొంతం చేసుకుని షూటింగ్లో పాల్గొంటున్నట్లుగా ఈ వీడియోని చూస్తే అర్థమవుతుంది. చాలామంది స్టార్స్ కి కూడా కాఫీ లేదా టీ ఎనర్జీ బూస్టర్ గా పనిచేస్తుందని అంటారు. బాలీవుడ్ వరుస సినిమాల్లో తృప్తి...




2017లో హిందీ చిత్రం పోస్టర్ బాయ్స్ తో బాలీవుడ్ లో అడుగుపెట్టిన తృప్తి ఆశించిన స్థాయిలో గుర్తింపుని సొంతం చేసుకోలేక పోయింది. ఆ వెంటనే లైలా మజ్ను సినిమాతో 2018లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో ప్రధాన పాత్రలో నటించింది. ఆ సినిమా కూడా పెద్దగా గుర్తింపుని తెచ్చి పెట్టలేదు. ఒకవైపు సినిమాల్లో నటిస్తూ మరోవైపు వెబ్ సిరీస్లో నటించడం ద్వారా ఇండస్ట్రీలో కొనసాగాలని ఈమె భావించింది. ఆ సమయంలో వచ్చిన యానిమల్ సినిమా అవకాశం ఈమె కెరియర్ మలుపు తిప్పింది. బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ కి జోడిగా నటించడంతో ఒకసారిగా అందరి దృష్టిని ఆకర్షించింది. పైగా సినిమాలో ఎక్కువగా రొమాంటిక్ సీన్స్ ఉన్న కారణంగా యూత్ దృష్టిని ఆకర్షించడంలో ఈ అమ్మడు సక్సెస్ అయింది. అందువల్లే బాలీవుడ్ నుంచి ఈమెకి వరసగా ఆఫర్లు వస్తున్నాయి. ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీ నుంచి కూడా ఈమెకి సినిమా అవకాశాలు వస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. స్పిరిట్ సినిమా తర్వాత టాలీవుడ్ లో ఈమె మరిన్ని సినిమాలు చేస్తుందని వార్తలు వినిపిస్తున్నాయి. స్పిరిట్ సినిమా కోసం ఈమె భారీ పారితోషికం అందుకుంటున్నట్లు సమాచారం అందుతుంది. పాన్ ఇండియా సూపర్ స్టార్ గా దూసుకుపోతున్న ప్రభాస్ చేస్తున్న మూవీ కావడంతో స్పిరిట్ పై అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు తగ్గట్లుగా దర్శకుడు సందీప్ వంగా ఈ సినిమాను తన గత చిత్రాలకు ఏమాత్రం తగ్గకుండా తీస్తాడని నమ్మకంను ప్రేక్షకులు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి భారీ స్కేల్ ఉన్న సినిమాలో తృప్తి నటించడం ద్వారా కెరియర్లో చాలా పెద్ద మూవీగా స్పిరిట్ నిలుస్తుంది అనే విశ్వాసం ఆమె అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈమె రెగ్యులర్గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా ఏకంగా 60 లక్షలకు పైగా ఫాలోవర్స్ ని సొంతం చేసుకుంది. వారంతా ఇప్పుడు తృప్తి ని స్పిరిట్ సినిమాలో ఎలా చూస్తామా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ ప్రారంభం అయింది కనుక ఏ క్షణంలోనైనా స్పిరిట్ సినిమాలోని తృప్తి లుక్ రివీల్ అయ్యే అవకాశం ఉంది. దీపికా పదుకొనే వంటి స్టార్ హీరోయిన్ నటించాల్సిన పాత్రలో ఈమె నటిస్తున్న కారణంగా సహజంగానే కాస్త ఒత్తిడి అనేది ఉంటుంది. కాని దర్శకుడు సందీప్ రెడ్డి వంగ తన ప్రతిభతో తృప్తిని పూర్తిగా పాత్రలో లీనం అయ్యే విధంగా నటింప చేస్తాడని విశ్లేషకులు అబి,ప్రాయం వ్యక్తం చేస్తు న్నారు.

బాలీవుడ్ లోనే కాకుండా ప్రస్తుతం అన్ని సినిమా ఇండస్ట్రీలో కూడా తృప్తి డిమ్రి గురించి ప్రముఖంగా వినిపిస్తోంది. రణబీర్ కపూర్ హీరోగా నటించిన యానిమల్ సినిమాలు ఈమె పోషించిన పాత్ర చిన్నదే అయినప్పటికీ చాలా పెద్ద ఇంపాక్ట్ క్రియేట్ చేసింది అనే విషయం అందరికీ తెలిసిందే. యానిమల్ సినిమా తర్వాత తృప్తి డిమ్రి ఏకంగా 10 సినిమాలను చేసింది. అందులో ఎక్కువ శాతం గ్లామర్ రోల్స్ ఉన్న విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆమె క్రేజీ ఎప్పటికప్పుడు పెరుగుతూ వచ్చింది.



## రెడ్ కలర్ చీరలో మెస్మరైజ్ చేస్తున్న సమంత!

అగ్ర కథానాయిక సమంత గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తన అద్భుతమైన నటనతో, అందంతో ఎంతోమంది స్టార్ హీరోల సరసన నటించి, భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. ముఖ్యంగా సినిమాల ద్వారా ఎంత క్రేజ్ అయితే అందుకుందో.. వ్యక్తిగతంగా అన్నే విమర్శలు కూడా ఎదుర్కొంది ఈ ముద్దుగుమ్మ. మొదట్లో ప్రముఖ హీరో సిద్ధార్థ్ తో ప్రేమాయణం నడిపిన ఈమె.. ఆ ప్రేమ కొంతకాలం కూడా నిలవలేకపోయింది. ఆ తర్వాత తన తొలి తెలుగు చిత్రం ఏ మాయ చేసావే సినిమాలో హీరోగా నటించిన అక్కినేని వారసుడు నాగచైతన్యతో ప్రేమలో పడింది. దాదాపు ఏడేళ్ల పాటు ప్రేమించుకున్న ఈ జంట పెద్దలను ఒప్పించి మరీ క్రిస్టియన్ , హిందూ సాంప్రదాయ పద్ధతుల్లో వివాహం చేసుకున్నారు. వివాహం తర్వాత మజిలీ అంటూ పలు చిత్రాలలో నటించిన ఈ జంట కలిసి పలు కమర్షియల్ యాడ్స్ లో కూడా నటించారు. ఇక వైవాహిక జీవితంలో అన్యోన్యంగా ఉన్న ఈ జంట అనూహ్యంగా విడాకులు ప్రకటించింది. ముఖ్యంగా నాలుగు ఏళ్లకు విడాకులు ప్రకటించడంతో అభిమానులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద సెలబ్రిటీలు కూడా వీళ్లను కలిపే ప్రయత్నం చేసినా కుదరలేదు. తర్వాత మయోసైటీస్ వ్యాధి బారిన పడి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న ఈమె.. ప్రముఖ బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో ప్రేమలో పడి, ఎట్టకేలకు డిసెంబర్ 1న కోయంబత్తూర్ లోని ఈషా యోగ సెంటర్ సమీపంలో ఉన్న లింగ భైరవి సన్నిధిలో భూత శుద్ధి పద్ధతిలో రెండవ వివాహం చేసుకుంది. ఈ వివాహాన్ని సమంత అధికారికంగా ప్రకటిస్తూ తన ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా కొన్ని ఫోటోలను కూడా పంచుకుంది. ఇకపోతే ఈరోజు ఆమె స్నేహితురాలు సమంత పెళ్లి వేడుకలకు సంబంధించి..ఎవరూ చూడని కొన్ని ఫోటోలను పంచుకున్నారు. ముఖ్యంగా అందులో సమంత ఎరుపు రంగు చీర కట్టుకొని చాలా క్యాజువల్ లుక్ లో అందంగా కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంది. రెడ్ కలర్ చీర కట్టుకున్న ఈమె దీనికి కాంబినేషన్లో రెడ్ కలర్ బ్లౌజ్ తో తన మేకవర్ను ఫుల్ ఫిల్ చేసింది. ముఖ్యంగా జుట్టును బన్ రూపంలో ముడిపెట్టి.. చుట్టూ పూలు పెట్టి చాలా సాంప్రదాయంగా కనిపించింది. ఎరుపు రంగు చీరలో అందరి హృదయాలను దోచుకుంది సమంతా అంటూ నెటిజన్స్ ఈ ఫోటోలు చూసి కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం సమంత కు సంబంధించిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. సమంత విషయానికి వస్తే.. ఒకవైపు హీరోయిన్గా చేస్తూనే మరొకవైపు నిర్మాతగా కూడా తన కెరీర్ ను మొదలుపెట్టింది. ట్రాలాల మూవింగ్ పిక్చర్స్ అనే నిర్మాణ సంస్థను స్థాపించిన ఈమె శుభం అనే సినిమాను నిర్మించి, మంచి విజయాన్ని అందుకుంది. ఇందులో మాయ అనే ఒక చిన్న క్యారెక్టర్ లో నటించి ఆకట్టుకుంది. ప్రస్తుతం నందిని రెడ్డి దర్శకత్వంలో మా ఇంటి బంగారం అనే సినిమా చేస్తోంది. యాక్షన్ పర్ఫామెన్స్ బేస్డ్ గా వస్తున్న ఈ సినిమాపై ఇప్పుడు సమంత అంచనాలు పెట్టుకున్న విషయం తెలిసిందే. అలాగే బాలీవుడ్లో తన భర్త ప్రముఖ డైరెక్టర్ రాజ్ నిడిమోరు దర్శకత్వంలో వస్తున్న రక్త బ్రహ్మాండ్ అనే వెబ్ సిరీస్ లో కూడా నటిస్తోంది.



# పూజాహెగ్డే నెక్ట్స్ ప్లాన్స్ ఏంటి..?



బుట్ట బొమ్మ పూజా హెగ్డే సౌత్ కెరీర్ అంతంత మాత్రంగానే ఉంది. తమిళ్ లో కాస్త పర్వాలేదు కానీ తెలుగులో మాత్రం అమ్మడికి ఛాన్స్ లు లేక కాస్త ఇబ్బంది పడుతుంది. ప్రభాస్ తో రాధే శ్యాం చేసిన ఈ అమ్మడు నెక్ట్స్ మహేష్ గుంటూరు కారం లో ఛాన్స్ వచ్చినట్టే వచ్చి చేజార్చుకుంది. ఆ తర్వాత పూజా హెగ్డేకి తెలుగులో ఒక్క మూవీ కూడా పడలేదు. నాగ చైతన్య, నాని సినిమాల్లో ఛాన్స్ అంటూ వార్తలు రావడమే కానీ అందులో ఏ ఒక్కటి నిజం కాలేదు.

### తెలుగులో ఛాన్స్ లు లేకుండా..

ఐతే తమిళ్ లో ఆల్రెడీ జన నాయగన్ లో నటిస్తున్న పూజా హెగ్డే నెక్ట్స్ కాంచనా 4లో కూడా ఉందని తెలుస్తుంది. ఇదే కాకుండా మరో సినిమా డిస్కషన్ లో ఉందట. హిందీలో కూడా ఒక ప్రాజెక్ట్ చేస్తుంది పూజా బేబ్. ఎటొచ్చి అమ్మడికి తెలుగులోనే సరైన ఛాన్స్ లు లేకుండా అవుతున్నాయి.


పూజా హెగ్డే దుల్కర్ సల్మాన్ కాంబినేషన్ లో ఒక సినిమా వస్తుంది. ఆ సినిమాతో అమ్మడి కొద్దిపాటి గ్యాప్ తర్వాత తెలుగు ఎంట్రీ ఇస్తుంది. బుట్ట బొమ్మని తెలుగు మేకర్స్ ఎందుకు పట్టించుకోవట్లేదు అన్నది తెలియదు కానీ ఆమె ఉంటే సినిమాలో గ్లామర్ షోకి డౌట్ పడాల్సిన అవసరం లేదు. ఇక పూజా బేబీ ఫ్యాన్స్ కి కావాల్సినంత హాట్ స్టఫ్ ఇస్తుంది. కెరీర్ లో ఇప్పటివరకు గ్లామర్ పరంగా తన మార్క్ చూపిస్తూ వచ్చిన పూజా హెగ్డే ఇక మీదట గ్లామర్ ఒక్కటే కాదు తన యాక్టింగ్ టాలెంట్ కూడా చూపించాలని ఫిక్స్ అయ్యింది. అందుకే అమ్మడు ఈమధ్య సినిమాలను కూడా ఆచి తూచి సెలెక్ట్ చేస్తుంది.

### దుల్కర్ సల్మాన్ తో పూజా హెగ్డే..

దుల్కర్ సల్మాన్ తో సినిమా అంటే మినిమం గ్యారెంటీ ఉన్నట్టే లెక్క. తెలుగు, తమిళ్ భాషల్లో ఈ సినిమా రిలీజ్ ఛాన్స్ ఉందని తెలుస్తుంది. సో అటు కోలీవుడ్ లో పూజా మేనియా కొనసాగించేందుకు కూడా ఈ సినిమా సపోర్ట్ చేస్తుంది. ఇదే కాదు టాలీవుడ్ స్టార్ సినిమాల్లో కూడా పూజా నటించాలని చూస్తుంది. ముఖ్యంగా హిందీ ఆడియన్స్ కి తను పరిచయమే కాబట్టి తెలుగు పాన్ ఇండియా సినిమాలు ఆఫర్ వస్తే చేయాలని ఆసక్తిగా ఉంది పూజా హెగ్డే. మరి ఆ ఛాన్స్ ఎవరిస్తారన్నది చూడాలి. పూజా హెగ్డే హిందీలో ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆమెకు అక్కడ సరైన లక్ కలిసి రావట్లేదు. అందుకే అమ్మడు సౌత్ సినిమాల మీదే తన ఫోకస్ పెడుతుంది. తెలుగులో ఒక్క స్టార్ మూవీ ఛాన్స్ వస్తే మళ్లీ తిరిగి కెరీర్ లో పట్టు సాధించాలని చూస్తుంది అమ్మడు.

# అందాలతో ఆకట్టుకుంటున్న చికిరి.. రాత్రి వేళల్లో!





: ఈమధ్య కాలంలో హీరోయిన్లు గ్లామర్ తో అభిమానులను కట్టిపడేయడమే కాకుండా తమ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా పలు విషయాలను అభిమా నులతో పంచుకుంటూ ఆకట్టు కుం టున్నారు. అంతేకాదు అప్పుడప్పుడు తమ పాత్రలను ఇలా సోషల్ మీడియా ద్వారానే రివీల్ చేస్తూ ఫాలోవర్స్ ను పెంచు కుంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా అందాల తార అతిలోకసుందరి కూతురు నయా అతిలోక సుందరి జాన్వీ కపూర్ సోషల్ మీడియాను ఏ రేంజ్ లో ఉపయోగి స్తోందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ముఖ్యంగా గ్లామర్ తో ఫాలోవర్స్ ను పెంచుకోవడమే కాకుండా తన సినిమా ప్రమోషనల్ కార్యక్రమాలకు సంబంధించిన ప్రతి విషయాన్ని కూడా అభిమానులతో పంచుకోవడానికి సోషల్ మీడియాను అధికంగా ఉపయోగిస్తోంది. మొన్నటి వరకు పరమ్ సుందరి, సన్నీ సంస్కారీకి తులసి కుమారి వంటి చిత్రాలను సోషల్ మీడియా ద్వారా జోరుగా ప్రమోట్ చేసిన ఈమె.. అప్పుడే పెద్ది సినిమాని కూడా ప్రమోట్ చేయడం మొదలుపెట్టింది అని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. విషయంలోకి వెళ్తే.. ప్రస్తుతం బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా, జాన్వీ కపూర్ హీరోయిన్గా నటిస్తున్న చిత్రం పెద్ది. వచ్చే ఏడాది రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇకపోతే భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేయడానికి మేకర్స్ ఇప్పటి నుంచే అప్డేట్స్ వదులుతున్న విషయం తెలిసిందే . అందులో భాగంగానే జాన్వి కపూర్ పై రాసిన "చికిరి చికిరి" అనే పాటను విడుదల చేశారు.. నిజానికి లిరికల్ సాంగ్ విడుదల చేస్తారన్నారు కానీ ఏకంగా వీడియో సాంగ్ ని రిలీజ్ చేసేసరికి అభిమానుల ఆనందానికి అవధులు లేవని చెప్పవచ్చు. ఇందులో తన అందాలతో ఆకట్టుకుంది జాన్వి కపూర్..ఇదిలా ఉండగా ఇప్పుడు తాజాగా ఇన్స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలను షేర్ చేస్తూ.." మీ చికిరి" అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోల విషయానికి వస్తే.. గోల్డెన్ గ్లిట్టర్ కలిగిన వన్ స్లీవ్ లెస్ హ్యాండ్ కలిగిన లెహంగా ధరించిన ఈమె రాత్రి వేళల్లో ఈ గ్లిట్టర్ వెలుగుల్లో తన అందాన్ని మరింత రెట్టింపు చేసుకుంది. అంతేకాదు మరికొన్ని ఫోటోలలో రెడ్ అండ్ క్రీం కలర్ కాంబినేషన్ లో ఉన్న హెవీ ఎంబ్రాయిడరీ శారీ ధరించి తన అందాలతో మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా బ్లౌజ్ ను ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్న జాన్వీ.. అందమైన ఆభరణాలు ధరించి మరీ తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసింది. ప్రస్తుతం జాన్వీ కపూర్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో చాలా వైరల్ గా మారుతున్నాయి. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవుతున్నారు. ఏది ఏమైనా తన అందంతో ఆకట్టుకుంటున్న జాన్వీ కపూర్ పెద్ది సినిమాతో సక్సెస్ అందుకోవాలని అభిమానులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

# 'స్వయంభు' వచ్చే వరకూ నభా కవితలేనా?



సాయంత్రం వెలుగులో నన్ను వెతుక్కుందాం.. నా ముఖంలో చిరునవ్వుతో, నా హృదయంలో వెచ్చదనంతో.. కూర్చుని ఆకాశ సౌందర్యం గురించి మాట్లాడుకుందాం.. గాలితో ఊపిరి పీల్చుకుందాం.., మేఘాల నీడలో విశ్రాంతి తీసుకుందాం.. సూర్యాస్తమయంలో మారుతున్న రంగుల్లో నవ్వుకుందాం.. ఎప్పటికీ నన్ను వెతుక్కుందాం.. ఎవరిలో ఇంత సొగసైన కవిత్వం పొంగి పొర్లుతోంది? ఏమో! అది నభా నటేష్ కావొచ్చు. ఈ కన్నడ బ్యూటీ టాలీవుడ్ లో అడుగుపెట్టినప్పటి నుంచి కెరీర్ పరంగా వరుసగా అవకాశాలు అందుకుంటూనే ఉంది. కానీ ఊహించని విధంగా కెరీర్ దూసుకెళు తున్న సమయంలోనే ఒకే ఒక్క యాక్సిడెంట్ తన కలల్ని కల్లలు చేసేస్తుందని భయపడినట్టు చెప్పుకొచ్చింది నభా. అప్పట్లో తన కెరీర్ గురించి చాలా ఆందోళన చెందింది. అయితే చూస్తుండగానే అంతా మారిపోయింది. తాను అనుకున్న విధంగా కంబ్యాక్ అయింది. ఇప్పుడు దర్శకనిర్మాతలను ఆకర్షించడంలో రేసులో ముందుంది. ఈరోజు ఉన్నది రేపు ఉండదు.. రేపు ఉన్నది ఆ తర్వాత ఉండదు.. ప్రతి రోజూ మారిపోతూనే ఉంటుంది. లైఫ్ అంటే ఇదే కదా.. అయితే కొంచెం ఓపిక సహనం అవసరం. కాలంతో పాటే మార్పు ఉంటుందని గ్రహించి సహనంతో ఎదురు చూడాలి. ఇప్పుడు తాను వేచి చూసిన సమయం రానే వచ్చింది. తిరిగి ఎప్పటిలానే నభా నటేష్ తన సొగసైన రూపాన్ని తిరిగి పొందింది. బోయ్స్ ని కవ్వించే అందం చందం తనలో మెండుగా ఉన్నాయని చెప్పకనే చెబుతోంది నభా ఇన్స్టాలోని ప్రతి పోస్ట్. ఎంతో అందంగా డిజైనర్ లుక్కుల్లోకి ఒదిగిపోయి ఫోటోషూట్లలో మిలమిల మెరిసిపోతోంది నభ. తాజాగా నభా నటేష్ షేర్ చేసిన ఓ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. చాలా సింపుల్ గా.. చాలా నేచురల్ గా సహజసిద్ధంగా ప్రకృతి అందాల నడుమ ఒదిగిపోయి కనిపించింది నభా. వైట్ ఫ్రాక్ లో గుబులు రేపేంత అందంగా కనిపిస్తోంది. మునుపటితో పోలిస్తే జిమ్ లో బాగా శ్రమిస్తోంది. దీని ఫలితం నభా ఎంతో స్లిమ్ గా టీనేజర్ ని తలపిస్తోంది. ఈ మేకోవర్ నిజంగా స్టన్నింగ్. హూ ఆర్ యు క్వీన్ నభా.. ఐ మిస్ యు! అంటూ ఒక అభిమాని లవ్ ఈమోజీలను షేర్ చేసాడు. చాలా మంది అభిమానులు నభా నటేష్ అందచందాలకు మైమరిచి పోతున్నామని చెబుతున్నారు. లవ్ కిస్ ఫైర్ ఈమోజీలతో ఫ్యాన్స్ విరుచుకుపడుతున్నారు. తాజా ఫోటోషూట్ వెబ్లో మోంతా తుఫాన్ లా దూసుకెళుతోంది.కెరీర్ మ్యాటర్ కి వస్తే.. నిఖిల్ సరసన - స్వయంభు - అనే హిస్టారికల్ వారియర్ డ్రామా చిత్రంలో నటిస్తోంది. భరత్ కృష్ణమాచారి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాపై నభా చాలా హోప్స్ పెట్టుకుంది. కొంత గ్యాప్ తర్వాత తనకు బిగ్ బ్రేక్ ఇస్తుందని నభా ఆశిస్తోంది. నభాతో పాటు, సంయుక్త మీనన్ మరో కథానాయికగా నటిస్తోంది.

Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- RNI TELTEL/2024/89620